


PRAJA PRASHNA
# ప్రజాప్రశ్న
RNI : TELTEL/2021/80267
తెలుగు దినపత్రిక
సంపుటి: 5 సంచిక: 102, పేజీలు - 08




బుధవారం, సెప్టెంబర్ 17, 2025 వెల: 5 రూ/.
హైదరాబాద్ | ప్రజల పక్షాన ప్రశ్నించే పత్రిక | HYDERABAD

# పిల్లల మీద పాలిటిక్స్ వద్దు

## - రూ.3 కోట్లు ఇచ్చారన్న ఆరోపణలు నిరూపించండి

- హైకోర్టు తీర్పుతో గ్రూప్ 1 ర్యాంకర్ల తల్లిదండ్రులు ఆందోళన వ్యక్తం చేశారు
- 563 మంది ర్యాంకర్లు, 100 మంది తల్లిదండ్రులు సోమాజిగూడ ప్రెస్ క్లబ్‌లో సమావేశం
- రాష్ట్రవ్యాప్తంగా ర్యాంకర్లు, తల్లిదండ్రులు న్యాయం కోరుతూ ప్రభుత్వ స్పందన కోరుతున్నారు



హైదరాబాద్ (ప్రశ్న న్యూస్) అప్పులు చేసి, తిండి తిప్పలు లేకుండా ఎంతో శ్రమించి పిల్లలను పోటీ పరీక్షలకు సిద్ధం చేసిన తమపై ఆరోపణలు చేయడం సరికాదని గ్రూప్ 1 విజేత తల్లిదండ్రులు సూచించారు. పిల్లలకు పెళ్లిళ్లు ఎప్పుడు చేస్తారు, వాళ్లు ఇంకా జాబ్ తెచ్చేకోలేదా, వాళ్లకు జాబ్ రాదా అని చుట్టుపక్కల వాళ్ల నుంచి సూటిపోటి మాటలు అవమానాలు ఎదుర్కొంటున్న పరిస్థితి మాది. కానీ ఇలాంటి తల్లిదండ్రులు నిజంగానే రూ.3 కోట్లు ఇచ్చి గ్రూప్ 1 ఉద్యోగాలు కొనుక్కున్నారా అని నిరూపించాలని డిమాండ్ చేశారు. తాము సైలెంట్ గా ఉంటే నిజంగానే ఉద్యోగాలు కొన్నారని ప్రచారం చేస్తారని మీడియా ముందుకు వచ్చి మాట్లాడుతున్నట్లు చెప్పారు.

### వాళ్లు నేటికీ నిరుద్యోగులే.. ఇంకా ఉద్యోగంలో చేరలేదు

హైదరాబాద్ సోమాజీగూడ ప్రెస్‌క్లబ్‌లో టీజీపీఎస్సీ గ్రూప్ 1 విజేతలుగా నిలిచిన ఓ విద్యార్థిని తండ్రి దాదా సలాం (గోదావరిఖని) మాట్లాడారు. ఒక్కసారి కోర్టుకు విషయం వెళ్తే దాని మీద మనం మాట్లాడటానికి వీలులేదు. న్యాయపరంగా పోరాటం చేయాలి. ఇప్పుడు సెలక్ట్ అయిన వాళ్లకు ఇంకా ఉద్యోగాలు రాలేదు. విజేతలుగా నిలిచిన అభ్యర్థుల జీవితాలు నాశనం చేయవద్దు అని ఓ అభ్యర్థి తండ్రి అభ్యర్థించారు. రాజకీయ నాయకులు ఉద్యోగాల విషయంలో రాజకీయాలు చేయడం తగదన్నారు.

2లో..

### సాంప్రదాయ యుద్ధాలు
# ముగిశాయి

## - కొత్త సవాళ్లకు సిద్ధంగా ఉండండి



న్యూఢిల్లీ (ప్రశ్న న్యూస్) సాంప్రదాయ యుద్ధ పద్ధతులకు కాలం చెల్లాయని, ఇకపై దేశం ఎదుర్కోబోయేది సమాచార, సైద్ధాంతిక, పర్యావరణ, జీవ సంబంధిత యుద్ధాలని కేంద్ర రక్షణ శాఖ మంత్రి రాజ్?నాథ్ సింగ్ స్పష్టం చేశారు. ఈ సరికొత్త సవాళ్లను ఎదుర్కొనేందుకు సాయుధ దళాలు సర్వసన్నద్ధంగా ఉండాలని ఆయన పిలుపునిచ్చారు. మంగళవారం కోల్‌కతాలో జరిగిన కంబైన్డ్ కమాండర్స్ కాన్ఫరెన్స్ 2025లో ఆయన ప్రసంగించారు. ప్రస్తుత కాలంలో యుద్ధాలు ఎప్పుడు, ఎలా మొదలవుతాయో ఊహించడం చాలా కష్టమని రాజ్?నాథ్ అన్నారు. "యుద్ధం రెండు నెలలు జరగొచ్చు, ఏడాది లేదా ఐదేళ్లయినా కొనసాగవచ్చు. ఎలాంటి పరిస్థితులనైనా ఎదుర్కొనేందుకు మన సైనిక సామర్థ్యం సరిపడా ఉండేలా చూసుకోవాలి" అని ఆయన సూచించారు. ప్రపంచవ్యాప్తంగా మారుతున్న సంఘర్షణల నేపథ్యంలో, సాంకేతిక పరిజ్ఞానాన్ని అందిపుచ్చుకున్న సైన్యం యొక్క ఆవశ్యకతను ఆయన నొక్కి చెప్పారు. ప్రధాని నరేంద్ర మోదీ దార్శనికత అయిన 'సుదర్శన చక్ర' వ్యూహాన్ని నిర్మించేందుకు కమాండర్లు చొరవ తీసుకోవాలని రాజ్?నాథ్ కోరారు. ఈ లక్ష్యాన్ని సాకారం చేసేందుకు వాస్తవిక కార్యాచరణ ప్రణాళికను రూపొందించేందుకు ఇప్పటికే ఒక కమిటీని ఏర్పాటు చేసినట్లు తెలిపారు. రాబోయే ఐదేళ్లకు మధ్యకాలిక, పదేళ్లకు దీర్ఘకాలిక ప్రణాళికలు సిద్ధం చేయాలని సూచించారు. ప్రధాని మోదీ ప్రవేశపెట్టిన 'జై' (జాయింట్‌నెస్,

2లో..

# రెవెన్యూ శాఖ పనితీరుపై సీఎం అసహనం

## - కలెక్టర్ల సదస్సులో సీఎం చంద్రబాబు నాయుడు

వివిధ ప్రభుత్వ శాఖలు అందించే సేవలకు ఇకపై రేటింగ్స్ ఇస్తామని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు స్పష్టం చేశారు. క్వాంటం వ్యాలీ, వాట్సప్ గవర్నెన్స్, డేటా లేక్, ఆర్టీజీఎస్ లెన్స్, అవేర్ 2.0 అంశాలపై సీఎం సమీక్షించారు. పాలనలో టెక్నాలజీ వినియోగంపై జిల్లా కలెక్టర్లకు దిశానిర్దేశం చేశారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి మాట్లాడారు.'కొన్ని ప్రభుత్వ శాఖల పనితీరు మరింతగా మెరుగు పడాల్సి అవసరం ఉంది.గతంతో పోల్చుకుంటే కొన్ని శాఖల పనితీరు మెరుగు అయినా రెవెన్యూ లాంటి శాఖల పనితీరు మరింత బాగుపడాల్సి ఉంది. ఎన్ని సార్లు చెబుతున్నా రెవెన్యూ శాఖ ప్రజలకు సంతృప్త స్థాయిలో సేవలు అందించటం లేదు. ఈ పరిస్థితుల్లో అన్ని ప్రభుత్వ సేవల్ని రేటింగ్ చేయాలని నిర్ణయించాం.'అని సీఎం చంద్రబాబు నాయుడు తెలిపారు.'కలెక్టర్లు చూసే దస్త్రాల క్వాలిటీ ఎంత ఉందో కూడా తనిఖీ చేస్తాం. సీనియర్ అధికారులు కూడా తమ పని విధానం మార్చుకోవాలి.ఇకపై తమ తమ శాఖలకు సంబంధించిన క్షేత్ర స్థాయి



సమాచారం కోసం

2లో..

### రాష్ట్రంలో మరో
# కొత్త డిస్కం

- విద్యుత్ శాఖపై సీఎం రేవంత్ రెడ్డి సమీక్ష
- అధికారులకు కీలక ఆదేశాలు



హైదరాబాద్ (ప్రశ్న న్యూస్) విద్యుత్ శాఖ ఉన్నతాధికారులతో రేవంత్ రెడ్డి సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా సీఎం మాట్లాడుతూ రాష్ట్రంలో ఎస్పీడీసీఎల్, ఎన్పీడీసీఎల్ తో పాటు మరో కొత్త డిస్కం ఏర్పాటు చేయాలని ఇప్పటికే నిర్ణయించామన్నారు. దీనికి సంబంధించి ప్రాథమిక ప్రణాళికను అధికారులు వివరించారు. ఈ సమీక్షలో వ్యవసాయం, మేజర్, మైనర్ లిఫ్ట్ ఇరిగేషన్,

2లో..

# రైతుకు రూ.3, బయట రూ.32.. ఇదేం పాలన.?

## - చంద్రబాబు సర్కార్‌పై జగన్ ఫైర్



అమరావతి (ప్రశ్న న్యూస్) ఉల్లి, టమాటా పంటలకు గిట్టుబాటు ధరలు లేక రైతులు నష్టపోతున్నారని, ఇందుకు చంద్రబాబు ప్రభుత్వ నిర్లక్ష్య వైఖరే కారణమని వైసీపీ అధినేత జగన్ మండిపడ్డారు. ఈ మేరకు తన 'ఎక్స్' ఖాతా వేదికగా ప్రభుత్వంపై విమర్శలు గుప్పించారు. పంట ధరల పతనంలో చంద్రబాబు ప్రభుత్వం కొత్త రికార్డులు సృష్టిస్తోందని జగన్ ఎద్దేవా చేశారు. "కర్నూలులో కిలో ఉల్లి ధర కేవలం మూడు రూపాయలు, కిలో టమాటా రూపాయిన్నరకు పడిపోయింది.

2లో..

## హిమాచల్ ప్రదేశ్, ఉత్తరాఖండ్‌లను వణికించిన 'క్లౌడ్ బరస్ట్'

- కొండచరియలు విరిగిపడి హిమాచల్‌లో ముగ్గురు దుర్మరణం
- వరద నీటిలో కొట్టుకుపోయిన 20కి పైగా బస్సులు, ఇతర వాహనాలు
- ధ్వంసమైన రోడ్లు, ఇళ్లు, దుకాణాలు.. అస్తవ్యస్తమైన జనజీవనం



2లో..

### హుస్సేన్ సాగర్‌లో
# ఫ్లోటింగ్ గ్రౌండ్

## - ఇకపై నీటిపైనే క్రికెట్, ఫుట్‌బాల్



**హైదరాబాద్ (ప్రశ్న న్యూస్)** హైదరాబాద్ నగరవాసులకు, పర్యాటకులను గుడ్‌న్యూస్. ఇప్పటికే నగరంలో అనేక టూరిస్టు ప్లేసులు ఉండగా తాజాగా మరో టూరిస్టు ప్లేస్ అందుబాటులోకి రానుంది. టూరిస్టులను ఆకర్షించడానికి హెచ్ఎండీఏ సరికొత్త ప్రణాళికలు సిద్ధం చేస్తోంది. సింగపూర్ తరహాలో హుస్సేన్ సాగర్ సరస్సులో ఫ్లోటింగ్ బాక్స్ క్రికెట్ గ్రౌండ్‌ను ఏర్పాటు చేయాలని అధికారులు ఆలోచిస్తున్నారు. ఈ ప్రాజెక్ట్ పర్యాటక రంగంలో కొత్త ఒరవడికి నాంది పలకవచ్చని భావిస్తున్నారు. హుస్సేన్ సాగర్‌ను మరింత ఆకర్షణీయంగా మార్చడానికి ప్రభుత్వం ప్రణాళికలు రూపొందిస్తోంది.

2లో..

## దేశ రాజకీయాల్లో 1983 ఒక సంచలనం

- విజయవాడలో 'సజీవ చరిత్ర' పుస్తకావిష్కరణ కార్యక్రమం
- ముఖ్య అతిథిగా పాల్గొన్న సీఎం చంద్రబాబు నాయుడు
- 1984 నాటి రాజకీయ సంక్షోభాన్ని గుర్తు చేసుకున్న చంద్రబాబు
- ప్రజాస్వామ్య పరిరక్షణలో ఎన్టీఆర్ పోరాటం మరువలేనిదని వ్యాఖ్య



విజయవాడ (ప్రశ్న న్యూస్) దేశ రాజకీయాల్లో 1983 ఒక సంచలనాత్మక సంవత్సరమని, ఆనాడు ప్రజాస్వామ్యాన్ని కాపాడేందుకు జరిగిన

2లో..

## సీఎం రేవంత్ రెడ్డి పెద్ద మనసు

- రెండు కాళ్లు కోల్పోయిన యువకుడికి కృత్రిమ కాళ్లు

2లో..



### ప్రభుత్వ సలహాదారుగా
# ఎన్వీఎస్ రెడ్డి

- హైదరాబాద్ మెట్రో రైల్‌కు కొత్త ఎండీ నియామకం
- మెట్రో ఎండీగా సర్ఫరాజ్ అహ్మద్‌కు అదనపు బాధ్యతలు
- రెండేళ్ల పాటు ఈ పదవిలో కొనసాగనున్న ఎన్వీఎస్ రెడ్డి



**హైదరాబాద్ (ప్రశ్న న్యూస్)** తెలంగాణ ప్రభుత్వం మెట్రోరైల్ ఎండీగా ఉన్న ఎన్వీఎస్ రెడ్డిని బదిలీ చేసింది. ఆయన స్థానంలో సర్ఫరాజ్ అహ్మద్ ను నియమించింది. ఎన్వీఎస్ రెడ్డి ఇప్పటికే రిటైర్ అయినందున ఆయనను సలహాదారుగా నియమించారు. అలాగే హెచ్ఎండీఏ సెక్రటరీగా కోట శ్రీవత్స, మహిళాశ శిశు సంక్షేమ డైరక్టర్ గా శృతి ఓజాను బదిలీ చేశారు. హైదరాబాద్ మెట్రో రైల్ లిమిటెడ్ మేనేజింగ్ డైరెక్టర్ గా నల్లమోతు వేణు గోపాల్ రెడ్డి 2007 నుంచి కొనసాగుతున్నారు. ఆ పదవిని ఏర్పాటు చేసినప్పటి నుండి ఆయనే ఉన్నారు. నిర్వహిస్తున్నారు. 1983 బ్యాచ్ సివిల్ సర్వీసెస్ అధికారి అయిన ఆయన, మొత్తం 18 సంవత్సరాలకు పైగా

2లో..

## రేవంత్ పై బీఆర్ఎస్ బిగ్ బాంబ్

### - కాంగ్రెస్ ఎంపీలే రాధాకృష్ణన్‌కు ఓటేశారన్న పాడి కౌశిక్ రెడ్డి



హైదరాబాద్ (ప్రశ్న న్యూస్) ఉప రాష్ట్రపతి ఎన్నికల్లో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తెలంగాణ కాంగ్రెస్ ఎంపీల ఓట్లను బీజేపీకి 'అమ్మేశారని' భారత రాష్ట్ర సమితి ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డి ఆరోపించారు. మంగళవారం పార్టీ ఆఫీసులో ప్రెస్‌మీట్ పెట్టి ఈ ఆరోపణలు చేశారు. కాంగ్రెస్ నిలబెట్టిన అభ్యర్థికి 315 ఓట్లు రావాల్సి ఉందని కానీ 300 ఓట్లే వచ్చాయన్నారు.

2లో..

## హైదరాబాద్ ఫ్యూచర్ సిటీకి మరో మార్గం

### - ప్రతిపాదనలు సిద్ధం చేస్తున్న అధికారులు



హైదరాబాద్ (ప్రశ్న న్యూస్) తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన భారత్ ఫ్యూచర్ సిటీని నాగార్జునసాగర్-హైదరాబాద్ రహదారితో అనుసంధానం చేయడానికి ఒక కొత్త రహదారిని నిర్మించనున్నారు. ఈ ప్రాజెక్టులో భాగంగా సాగర్ రహదారి నుంచి రంగారెడ్డి జిల్లా యాచారం మండలం తక్కళ్లపల్లి మీదుగా

2లో..

# పిల్లల మీద పాలిటిక్స్ వద్దు

మంచి కోసం పాటుపడాలని, అనవసర విషయాలను దుష్ప్రచారం చేయకూడదని సూచించారు. ఈ పిల్లలు కూడా నేటికి నిరుద్యోగులేనని, వారు ఉద్యోగంలో చేరితేనే ప్రయోజకులు అయినట్లు భావించాలన్నారు.

**రూ.3 కోట్లు ఇచ్చి జాబ్ తెచ్చుకున్నామని నిరూపించాలని ఛాలెంజ్**

తన కుమార్తెకు 46వ ర్యాంకు వచ్చిందని, తనలాగ విద్యావంతులు అయిన తల్లిదండ్రులు ఉన్నవారికి గైడెన్స్ లభించిందన్నారు. ఉద్యోగాలు రాకపోవడంతో కొందరు అభ్యర్థులు, కొన్ని కోచింగ్ సెంటర్లలో జాబ్స్ రాకపోవడంతో వాళ్లు కూడా దుష్ప్రచారంలో భాగస్వాములు అవుతున్నారని ఆరోపించారు. రూ.3 కోట్లు ఇచ్చి గ్రూప్ 1 జాబ్ తెచ్చుకున్నామని నిరూపించాలి. మీరు ఎక్కడికి రావాలన్నా మేం వస్తాం. కానీ ఆరోపణలు చేసిన వాళ్లు తమ వ్యాఖ్యలకు కట్టుబడి నిరూపించాలని' డిమాండ్ చేశారు. తెలంగాణ గ్రూప్ 1 ఉద్యోగాల్లో రూ.1700 కోట్ల మేరకు స్కాం జరిగిందని ఆరోపిస్తున్న వాళ్లు నోటి మాటగా కాకుండా తమ ఆరోపణలను ఆధారాలుగా నిరూపించాలన్నారు.

### రూ.3 కోట్లకు ఎన్ని సున్నాలుంటాయో తెలియదు..

గ్రూప్ 1లో 159వ ర్యాంకర్ తండ్రి జంగారెడ్డి ప్రెస్‌క్లబ్‌లో మీడియాతో మాట్లాడారు. వారం రోజుల నుంచి గ్రూప్ 1 విజేతలపై దుష్ప్రచారం చేస్తున్నారు. రాజకీయాల్లోకి విద్యార్థులను, నిరుద్యోగ అభ్యర్థులను లాగొద్దని రాజకీయ నేతలకు సూచించారు. ఇక్కడున్న వారికి రూ.3 కోట్లకు ఎన్ని సున్నాలు ఉంటాయో తెలియదు. మా కుటుంబాల పరిస్థితి చూసి మాట్లాడాలన్నారు. కష్టపడి చదివి ఉద్యోగాలు తెచ్చుకున్న పిల్లలకు గ్రూప్ 1 జాబ్ రాకుండా అడ్డుకునే ప్రయత్నాలు సరికాదన్నారు. ఓ ర్యాంకర్ తల్లి మాట్లాడుతూ ఆవేదన వ్యక్తం చేశారు. విద్యార్థులకు అన్యాయంగా ర్యాంకులు రావు. ఎంతో శ్రమించి, గంటల తరబడి చదివి ఎంతో త్యాగాలు చేసి వారు తమ కలను సాకారం చేసుకున్నారు. నలుగురు పోటీ చేస్తే ఒక్కరే విజయం సాధిస్తారు. ఓడిపోయిన ముగ్గురు రీ ఎలక్షన్ జరగాలని కోర్టులను ఆశ్రయిస్తే పరిస్థితి ఎలాం ఉంటుంది. కానీ కొందరు తమ స్వార్థ రాజకీయ ప్రయోజనాల కోసం బలి చేయాలని చూస్తున్నారు. ఇది సరికాదు. వాళ్లు అభ్యర్థులుగానే ఆర్టీసీ క్రాస్ రోడ్డు, అశోక్ నగర్ లోనే మగ్గిపోవాలా ఎన్నటికీ ఉద్యోగాలు సాధించి ప్రయోజకులు కాకూడదా అని అడిగారు.

# సాంప్రదాయ యుద్ధాలు ముగిశాయి

ఆత్మనిర్భరత, ఇన్నోవేషన్) మంత్రం ప్రాముఖ్యతను ఆయన పునరుద్ఘాటించారు. ఆత్మనిర్భరత అనేది కేవలం నినాదం కాదని, అది మన దేశ వ్యూహాత్మక స్వయంప్రతిపత్తికి అత్యంత కీలకమైన అవసరమని ఆయన పేర్కొన్నారు. 'ఆపరేషన్ సిందూర్' విజయం మన బలం, వ్యూహం, స్వావలంబనకు నిదర్శనమని కొనియాడారు. రక్షణ రంగంలో భవిష్యత్ సాంకేతిక పరిజ్ఞానాల అభివృద్ధి కోసం ప్రైవేటు పరిశ్రమలు, విద్యాసంస్థలతో మరింత లోతైన భాగస్వామ్యం అవసరమని ఉద్ఘాటించారు. ఈ సందర్భంగా 'డిఫెన్స్ ప్రొక్యూర్‌మెంట్ మాన్యువల్ 2025'కు తాను ఆమోదం తెలిపినట్లు రాజ్?నాథ్ వెల్లడించారు. కొనుగోలు ప్రక్రియను సులభతరం చేసి, జాప్యాన్ని తగ్గించేందుకు 'డిఫెన్స్ అక్విజిషన్ ప్రొసీజర్ 2020'ను సవరిస్తున్నట్లు తెలిపారు. ఈ సమావేశంలో చీఫ్ ఆఫ్ డిఫెన్స్ స్టాఫ్ జనరల్ అనిల్ చౌహాన్, త్రివిధ దళాధిపతులు జనరల్ ఉపేంద్ర ద్వివేది, అడ్మిరల్ దినేష్ కె. త్రిపాఠి, ఎయిర్ చీఫ్ మార్షల్ ఎ.పి. సింగ్, డీఆర్‌డీఓ ఛైర్మన్ సమీర్ వి. కామత్ తదితర ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

# రాష్ట్రంలో మరో కొత్త డిస్కం

గ్రామీణ మంచినీటి సరఫరా , జీహెచ్ఎంసీ పరిధిలో మంచినీటి సరఫరాకు సంబంధించిన విద్యుత్ వినియోగాన్ని కొత్త డిస్కం పరిధిలోకి తీసుకురావాలన్న ప్రతిపాదన పై నిర్ణయం తీసుకున్నారు. డిస్కంల పునర్ విభజన తర్వాత పీపీఏ అలోకేషన్, సిబ్బంది, ఆస్తుల విభజన, బకాయిలు, ఇతర అంశాలపై అధికారులకు పలు సూచనలు చేశాను. కేబినెట్ ఆమోదం అనంతరం కొత్త డిస్కం ఏర్పాటుపై ముందుకెళ్లాలని ఆదేశించారు. ఈ సందర్భంగా గ్రేటర్ హైదరాబాద్ లో అండర్ గ్రౌండ్ విద్యుత్ కేబులింగ్ విధానంపై పలు ప్రతిపాదనలను అధికారులు సీఎం రేవంత్ రెడ్డికి వివరించారు.

డిసెంబరులోగా అండర్ గ్రౌండ్ కేబులింగ్ కు ప్రాజెక్టుకు సంబంధించి పూర్తిస్థాయి ప్రణాళికలు రూపొందించి, వచ్చే రెండున్నరేళ్లలో కోర్ అర్బన్ రీజియన్ లో అండర్ గ్రౌండ్ కేబులింగ్ పూర్తి చేయాలని సీఎం రేవంత్ రెడ్డి అధికారులను ఆదేశించారు. ఓవర్ లోడ్ సమస్యలు తలెత్తకుండా కోర్ అర్బన్ రీజియన్ లో విద్యుత్ సబ్ స్టేషన్లను అప్ గ్రేడ్ చేయాలని, కోర్ అర్బన్ రీజియన్ లో ఎక్కడెక్కడ కొత్త విద్యుత్ సబ్ స్టేషన్ల అవసరం ఉందో గుర్తించి, ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఈ సమీక్షలో డిప్యూటీ సీఎం, ఇంధన శాఖ మంత్రి శ్రీ మల్లు భట్టి విక్రమార్క పాల్గొన్నారు.

# రైతుకు రూ.3, బయట రూ.32..ఇదేం పాలన.?

ఈ ధరలతో రైతు ఎలా బతకాలి?" అని ఆయన ప్రభుత్వాన్ని సూటిగా ప్రశ్నించారు. గత కొన్ని వారాలుగా రైతులు తీవ్ర ఆవేదనతో గగ్గోలు పెడుతున్నా, ప్రభుత్వం కనీసం కనికరం చూపడం లేదని దుయ్యబట్టారు. ప్రజలు, రైతులు కష్టాల్లో ఉన్నప్పుడు ఆదుకోలేని ప్రభుత్వం ఉండి ఏం లాభమని ఆయన నిలదీశారు. క్వింటా ఉల్లిని రూ.1,200కు కొనుగోలు చేస్తామన్న ప్రభుత్వ ప్రకటనలు కేవలం నామమాత్రంగానే మిగిలిపోయాయని జగన్ ఆరోపించారు. కర్నూలు మార్కెట్‌లో తూతూమంత్రంగా వేలం నిర్వహించి, కొనేవారు లేరనే అభిప్రాయాన్ని కలిగించే ప్రయత్నం చేశారని విమర్శించారు.

రైతులకు గిట్టుబాటు ధర దక్కడం లేదని, కానీ అదే ఉల్లిపాయలు ఆన్‌లైన్ స్టోర్లలో కిలో రూ.29 నుంచి రూ.32 వరకు, రైతు బజార్లలో రూ.25కు అమ్ముతున్నారని ఆయన గుర్తుచేశారు. రైతులకు, రిటైల్ ధరలకు మధ్య ఇంత వ్యత్యాసం ఉండటానికి ప్రభుత్వ వైఫల్యమే కారణమని అన్నారు. ఉల్లితో పాటు టమాటా రైతుల పరిస్థితి కూడా దయనీయంగా ఉందని, కొనేవారు లేక పంటను రోడ్ల పక్కన పారబోస్తున్నారని జగన్ ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం తక్షణమే జోక్యం చేసుకుని, రైతుల నుంచి పంటలను కొనుగోలు చేసి వారికి అండగా నిలవాలని, మానవత్వం చాటుకోవాలని డిమాండ్ చేశారు.

# హుస్సేన్ సాగర్‌లో ఫ్లోటింగ్ గ్రౌండ్

దీనిలో భాగంగా హైదరాబాద్ మెట్రో డెవలప్‌మెంట్ అథారిటీ (హెచ్ఎండీఏ) అధ్యయనాలు చేపడుతోంది. ఈ ప్రాజెక్టులో భాగమే ఫ్లోటింగ్ క్రికెట్ గ్రౌండ్. అంతేకాకుండా, ఖైరతాబాద్ మెట్రో నుంచి నెక్లెస్ రోడ్డు, సంజీవయ్య పార్కు, ట్యాంక్‌బండ్, ఎన్టీఆర్ గార్డెన్, ప్రసాద్ ఐమ్యాక్స్ వరకు దాదాపు 10.5 కిలోమీటర్ల పొడవుతో స్కైవాక్ వంతెనను నిర్మించే అంశాన్ని కూడా పరిశీలిస్తున్నారు. ఈ స్కైవాక్‌లో సైకిల్ ట్రాక్, వాక్‌వే కూడా ఉండేలా ప్రణాళికలు జరుగుతున్నాయి. ఇది పబ్లిక్-ప్రైవేట్ పార్ట్‌నర్‌షిప్ (పీపీపీ) పద్ధతిలో నిర్మించనున్నారు.

**- ఫ్లోటింగ్ క్రికెట్ గ్రౌండ్ విశేషాలు..**

ప్రస్తుతం క్రికెట్‌కు ఉన్న ఆదరణ దృష్ట్యా సంజీవయ్య పార్కు సమీపంలో హుస్సేన్ సాగర్‌కు ఆనుకొని నీటిపై తేలియాడే బాక్స్ క్రికెట్ గ్రౌండ్‌ను ఏర్పాటు చేయాలని హెచ్ఎండీఏ అధికారులు భావిస్తున్నారు. సింగపూర్, మాల్దీవులు వంటి దేశాల్లో ఇలాంటి ఫ్లోటింగ్ స్టేడియంలు ఇప్పటికే అందుబాటులో ఉన్నాయి. హైదరాబాద్ నగరంలో క్రికెట్ అభిమానులు చాలా ఎక్కువ. ఇప్పటికే బాక్స్ క్రికెట్ తెగ ట్రెండ్ అవుతోంది. ఈ నేపథ్యంలో హుస్సేన్ సాగర్‌లో ఏర్పాటు చేసే ఫ్లోటింగ్ గ్రౌండ్‌కు మంచి ఆదరణ ఉంటుందని అధికారులు అంచనా వేస్తున్నారు. పర్యాటకులను ఆకర్షించడం, నగర పర్యాటకానికి కొత్త హంగులు తీసుకురావడం, వినోదం, క్రీడా కార్యక్రమాలకు కొత్త వేదికలు కల్పించడం, హుస్సేన్ సాగర్ ప్రాంతానికి కొత్త కళను తీసుకురావటంలో భాగంగా ఈ ప్రాజెక్టు చేపట్టారు. ఈ ప్రాజెక్టులు పూర్తయితే హైదరాబాద్ పర్యాటక రంగంలో ఒక ముఖ్యమైన కేంద్రంగా మారుతుందని అధికారులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.

# తాండూర్ లో జూనియర్ కళాశాల మంజూరు చేయాలి: బడికల శ్రావణ్

ముథోల్,: తాండూర్ మండలంలో జూనియర్ కళాశాలను మంజూరు చేయాలని బిఆర్ఎస్వీ మంచిర్యాల జిల్లా అధ్యక్షులు బడికల శ్రావణ్ డిమాండ్ చేశారు. ఫీజు రియంబర్స్మెంట్, జూనియర్ కళాశాల మంజూరు కోరుతూ మంగళవారం తాండూర్ మండల కేంద్రంలో బిఆర్ఎస్వీ నాయకులతో కలిసి ఆందోళన నిర్వహించారు. తాండూర్ కు జూనియర్ కళాశాలను మంజూరు చేస్తామన్న హామీని మంత్రి నిలబెట్టుకోవాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్వి నాయకులు పాల్గొన్నారు.

# దేశ రాజకీయాల్లో 1983 ఒక సంచలనం

మహా పోరాటంలో గెలిచిన ఏకైక నాయకుడు నందమూరి తారక రామారావు అని ముఖ్యమంత్రి చంద్రబాబు అన్నారు. ఎన్టీఆర్ జీవితంలోని కీలక ఘట్టాలతో ఎన్టీఆర్ లిటరేచర్ కమిటీ రూపొందించిన 'సజీవ చరిత్ర' పుస్తకావిష్కరణ కార్యక్రమం విజయవాడ పోరంకిలోని మురళీ రిసార్ట్స్‌లో జరిగింది. ఈ కార్యక్రమానికి చంద్రబాబు ముఖ్య అతిథిగా హాజరై ప్రసంగించారు. ఈ సందర్భంగా చంద్రబాబు 1984 నాటి రాజకీయ సంక్షోభాన్ని గుర్తుచేసుకున్నారు. "ఆనాడు ప్రజాస్వామ్యానికి జరిగిన ద్రోహంపై ప్రజలు తిరగబడ్డారు. 161 మంది ఎమ్మెల్యేలను రామకృష్ణ స్టూడియోకు తరలించి క్యాంపు నిర్వహించాల్సి వచ్చింది. ఆ క్లిష్ట సమయంలో ఎమ్మెల్యేలను సమీకరించడంలో ఇంద్రసేనారెడ్డి కీలక పాత్ర పోషించారు" అని చంద్రబాబు వివరించారు. దశాబ్దాలుగా సాగుతున్న కాంగ్రెస్ పాలనకు 1983 ఆంధ్రప్రదేశ్ ఎన్నికల ఫలితాలు గట్టి గుణపాఠం నేర్పాయని ఆయన అభిప్రాయపడ్డారు. 'సజీవ చరిత్ర' పుస్తకం ద్వారా 1984లో జరిగిన వాస్తవాలు నేటి తరానికి తెలుస్తాయని చంద్రబాబు తెలిపారు. ఎన్టీఆర్ జీవిత చరిత్రలోని ముఖ్యమైన ఘట్టాలను ప్రజల ముందుకు తీసుకురావడంలో ఈ పుస్తకం ఒక చారిత్రక దాఖలాగా నిలుస్తుందని ఆయన పేర్కొన్నారు. ఎన్టీఆర్ పోరాటం దేశవ్యాప్తంగా ప్రభావం చూపిందని, ఆ స్ఫూర్తి ఎప్పటికీ నిలిచి ఉంటుందని అన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ ఉపరాష్ట్రపతి వెంకయ్యనాయుడు, త్రిపుర గవర్నర్ ఇంద్రసేనారెడ్డి, ఏపీ అసెంబ్లీ స్పీకర్ అయ్యన్నపాత్రుడు సహా పలువురు ప్రముఖులు పాల్గొన్నారు.

# సీఎం రేవంత్ రెడ్డి పెద్ద మనసు

హైదరాబాద్ (ప్రశ్న న్యూస్) తెలంగాణలో మానవతా విలువలకు ప్రాధాన్యం ఇస్తూ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చేసిన చర్యలు ఇటీవలి కాలంలో చర్చనీయాంశంగా మారాయి. వరంగల్ జిల్లా పులకుర్తి గ్రామానికి చెందిన గుండేటి రాహుల్ జీవితంలో జరిగిన దారుణ సంఘటన అందరినీ కలచివేసింది. ఐఐటీ చదవాలని కలలుగన్న రాహుల్, రాజస్థాన్ కోటా వెళ్తున్న రైలులో దుండగుల దాడికి గురై రెండు కాళ్లను కోల్పోయాడు. చిన్న వయసులోనే తన భవిష్యత్తు చీకటిలో మునిగిపోయిందని భావించిన ఆ విద్యార్థికి సీఎం రేవంత్ రెడ్డి మానవతా దృక్పథం కొత్త వెలుగుని తీసుకొచ్చింది. రాహుల్ పరిస్థితి తెలుసుకున్న వెంటనే సీఎం స్పందించి నిమ్స్‌లో అత్యాధునిక కృత్రిమ కాళ్లను అమర్చేలా అధికారులను ఆదేశించారు. ముఖ్యమంత్రి సహాయ నిధి నుంచి పది లక్షల రూపాయల కంటే ఎక్కువ వ్యయం చేసి చికిత్సా సహాయం అందించారు. కొన్ని రోజులుగా ఒక్కో అడుగు వేస్తూ మళ్లీ నిలబడిన రాహుల్ ఇప్పుడు పూర్తి ఆత్మవిశ్వాసంతో నడవగలుగుతున్నాడు. సీఎం దాతృత్వం వల్ల మళ్లీ తన కలలను నెరవేర్చగలమన్న నమ్మకం కుటుంబంలో కలిగింది.

జూబ్లీహిల్స్‌లోని అధికార నివాసానికి రాహుల్ తన కుటుంబంతో కలిసి వెళ్లి కృతజ్ఞతలు తెలిపాడు. ఈ సందర్భంగా సీఎం రాహుల్‌ను భుజం తట్టి, కష్టాలను జయించి భవిష్యత్తులో ప్రతిభ చూపాలని ప్రోత్సహించారు. ప్రభుత్వ పెద్దల ప్రోత్సాహం ఒక బాధిత విద్యార్థి జీవితంలో ఎంతటి మార్పు తీసుకురాగలదో ఈ ఉదాహరణ స్పష్టంగా చూపిస్తోంది. ఇదిలా ఉండగా సంక్షేమ విభాగం ఆధ్వర్యంలో అంధ విద్యార్థులకు సంగీత శిక్షణా కార్యక్రమాన్ని సీఎం ప్రారంభించారు. జూబ్లీహిల్స్‌లో వాయిద్య పరికరాలను పంపిణీ చేసి, విద్యార్థుల ప్రదర్శనలను ప్రత్యక్షంగా వీక్షించారు. ఈ సందర్భంగా వారు పాడిన పాటల సీడీని విడుదల చేసి ప్రతిభావంతులైన యువతను రాష్ట్ర ప్రభుత్వం ఎల్లప్పుడూ ఆదుకుంటుందని హామీ ఇచ్చారు. సంగీతం కేవలం వినోదం కోసం మాత్రమే కాదు, మనసును ప్రశాంతంగా ఉంచే సాధనమని, ఆత్మకు ఆహ్లాదం కలిగించే శక్తి ఉందని పేర్కొన్నారు. దృష్టి లోపం ఉన్న విద్యార్థులు ఈ కళలో కృషి చేస్తే, భవిష్యత్తులో ప్రతిభావంతులైన గాయకులు, సంగీతకారులుగా నిలుస్తారని నమ్మకం వ్యక్తం చేశారు సీఎం రేవంత్ రెడ్డి. ఈ కార్యక్రమానికి ఎంపీ అనిల్ కుమార్ యాదవ్, జీహెచ్ఎంసీ మేయర్ విజయలక్ష్మి, ముఖ్యమంత్రి ప్రత్యేక అధికారి వేముల శ్రీనివాస్, కరీంనగర్ జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి తదితర ప్రజా ప్రతినిధులు హాజరయ్యారు. వీరందరూ కలిసి విద్యార్థులకు ఉత్సాహం కలిగిస్తూ, రాబోయే రోజుల్లో వారు పెద్ద వేదికలపై తమ ప్రతిభను ప్రదర్శించాలని ఆకాంక్షించారు.

# ప్రభుత్వ సలహాదారుగా ఎన్వీఎస్ రెడ్డి

ఈ పదవిలో ఉన్నారు. ఎన్వీఎస్ రిటైర్ అయి కూడా 9ఏళ్లు అవుతోంది. 2016లో రిటైర్మెంట్ తర్వాత మళ్లీ 2017లో రీఅపాయింట్‌మెంట్ అయ్యారు. 2025 మార్చిలో ఆయన పదవి రద్దు చేయాలని ప్రభుత్వం ఆర్డర్ జారీ చేసినప్పటికీ, ఏప్రిల్ 9న మళ్లీ ఒక సంవత్సరం పొడిగించారు. చివరికి ఇప్పుడు సలహాదారుగా పదవి ఇచ్చి బదిలీ చేసారు. 2007లో ఎచ్ఎమ్ఆర్ఎల్ ఏర్పాటు తర్వాత మొదటి ఎండీగా నియమితులయ్యారు. 69 కి.మీ. ఫేజ్-1 ప్రాజెక్ట్‌ను పబ్లిక్-ప్రైవేట్ పార్ట్‌నర్‌షిప్ మోడల్‌లో పూర్తి చేశారు. 2017 మార్చిలో మెట్రో సర్వీస్ ప్రారంభం నుంచి ఆయన నాయకత్వంలో 57 స్టేషన్లు, 3 కారిడార్లు (బ్లూ, రెడ్, గ్రీన్ లైన్‌లు) ఆపరేషన్‌లోకి వచ్చాయి. ప్రస్తుతం ఫేజ్-2 (లైన్ 4: జూబ్లీహిల్స్ నుంచి రంగారెడ్డి) ఓల్డ్ సిటీ విస్తరణలు (చార్మినార్, ఫలాక్‌నుమా) ఆయన పర్యవేక్షణలో జరుగుతున్నాయి. హైదరాబాద్ ఎయిర్‌పోర్ట్ మెట్రో లిమిటెడ్ (హ్యామ్‌ఎల్) ఎండీగా కూడా పనిచేశారు. తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన తర్వాత మార్చి 27-28, 2025న మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ అండ్ అర్బన్ డెవలప్‌మెంట్ (ఎంఏయూడీ) డిపార్ట్‌మెంట్ ఆర్డర్ జారీ చేసి, 177 మంది రిటైర్డ్ అధికారుల పదవులు మార్చి 31, 2025తో రద్దు చేసింది. ఎన్వీఎస్ రెడ్డి కూడా ఈ జాబితాలో ఉన్నారు.

ఇది రాజకీయ చర్చకు దారితీసింది, ఎందుకంటే ఆయన టెర్మ్ జూన్ 2025 వరకు ఉండాలని ముందు నిర్ణయించారు. మార్చి ఆర్డర్ తర్వాత కేవలం 10 రోజుల్లోనే, ఏప్రిల్ 9, 2025న తెలంగాణ ప్రభుత్వం కొత్త ఆర్డర్ జారీ చేసి, ఆయన పదవిని ఏప్రిల్ 1, 2025 నుంచి మరో సంవత్సరం పొడిగించింది. ఇది ఫేజ్-2 ప్రాజెక్టులు, ఎయిర్‌పోర్ట్ మెట్రో విస్తరణల కోసం తీసుకున్న నిర్ణయంగా ప్రభుత్వం చెప్పింది. ఇటీవల ఎల్ అండ్ టీ కేంద్ర , రాష్ట్ర ప్రభుత్వాలకు ఓ లేఖ రాసింది. తాము మెట్రోను నిర్వహించలేకపోతున్నామని నిర్వహణ పరంగా లాభాలు రావడం లేదని పెద్ద ఎత్తున నష్టాలు వస్తున్నాయని చెప్పింది. నిర్వహణ కోసం స్పెషల్ పర్పస్ వెహికల్ ఏర్పాటు చేయాలని కోరింది. గతంలో కూడా ఎల్ అండ్ టీ తాము తమ వాటాని అమ్మేస్తామని కూడా లేఖలు రాసింది. ఈ వివాదంతో పాటు మెట్రో విస్తరణ విషయంలో సర్వీసులో ఉండే అధికారిని నియమించాలనుకున్న ప్రభుత్వం ఎన్వీఎస్ రెడ్డిని సలహాదారుగా నియమించి సర్ఫరాజ్ అహ్మద్ ను ఆయన స్థానంలో నియమించింది.

# హిమాచల్ ప్రదేశ్, ఉత్తరాఖండ్‌లను వణికించిన 'క్లౌడ్ బరస్ట్'

డెహ్రాడూన్ (ప్రశ్న న్యూస్) ఉత్తర భారతంలోని హిమాచల్ ప్రదేశ్, ఉత్తరాఖండ్ రాష్ట్రాలను క్లౌడ్ బరస్ట్ వణికించింది. సోమవారం రాత్రి నుంచి మంగళవారం తెల్లవారుజాము వరకు కురిసిన కుండపోత వర్షాలు, ఆకస్మిక వరదలు ఈ రెండు రాష్ట్రాల్లో తీవ్ర విషాదాన్ని మిగిల్చాయి. ఈ ప్రకృతి బీభత్సానికి హిమాచల్ ప్రదేశ్‌లో ముగ్గురు మృతి చెందగా, రెండు రాష్ట్రాల్లోనూ భారీ ఆస్తి నష్టం సంభవించింది. వంతెనలు, రోడ్లు కొట్టుకుపోవడంతో రవాణా వ్యవస్థ స్తంభించి, జనజీవనం పూర్తిగా అస్తవ్యస్తమైంది. హిమాచల్ ప్రదేశ్‌లోని మండీ జిల్లాలో ఈ వర్షాల ప్రభావం అత్యంత తీవ్రంగా ఉంది. జిల్లాలోని నిహ్రీ ప్రాంతంలో కొండచరియలు విరిగిపడి ఒక ఇంటిపై పడటంతో ముగ్గురు అక్కడికక్కడే మరణించారని, మరో ఇద్దరిని సహాయక బృందాలు సురక్షితంగా కాపాడాయని జిల్లా ఎస్పీ సాక్షి వర్మ తెలిపారు. ఇక ధర్మపూర్ పట్టణంలోని బస్ స్టాండ్ పూర్తిగా వరద నీటిలో మునిగిపోయింది. వరద ప్రవాహానికి 20కి పైగా ప్రభుత్వ బస్సులు, ఇతర వాహనాలు కొట్టుకుపోయాయని, సమీపంలోని వర్క్‌షాప్‌లు, పంప్ హౌస్‌లు, దుకాణాలు కూడా ధ్వంసమయ్యాయని ఉప ముఖ్యమంత్రి ముఖేశ్ అగ్నిహోత్రి ఫేస్‌బుక్‌లో పేర్కొన్నారు. అటు రాజధాని సిమ్లాలోనూ పలుచోట్ల కొండచరియలు విరిగిపడటంతో ప్రధాన రహదారులు మూసుకుపోయాయి. ఇక, ఉత్తరాఖండ్‌లోనూ పరిస్థితి భిన్నంగా ఏమీ లేదు.

ముఖ్యంగా రాజధాని డెహ్రాడూన్‌లోని సహస్రధార, రాయ్‌పూర్, మాల్దేవతా ప్రాంతాలు అతలాకుతలమయ్యాయి. సోమవారం రాత్రి కురిసిన భారీ వర్షానికి సహస్రధార నది ఉప్పొంగి ప్రవహించడంతో హోటళ్లు, దుకాణాల్లోకి వరద నీరు, బురద చేరి తీవ్ర నష్టం వాటిల్లింది. మాల్దేవతా ప్రాంతంలో ఏకంగా 100 మీటర్ల పొడవైన రోడ్డు వరద ప్రవాహానికి పూర్తిగా కొట్టుకుపోయింది. దీంతో పలు గ్రామాలకు రాకపోకలు నిలిచిపోయాయి. ప్రకృతి విపత్తుపై రెండు రాష్ట్రాల ప్రభుత్వాలు వేగంగా స్పందించాయి. ఉత్తరాఖండ్ ముఖ్యమంత్రి పుష్కర్ సింగ్ ధామి మంగళవారం ఉదయం ప్రభావిత ప్రాంతాల్లో ఏరియల్ సర్వే నిర్వహించి, అధికారులతో సమీక్షించారు. సహాయక చర్యలు యుద్ధప్రాతిపదికన జరుగుతున్నాయని, రహదారులను పునరుద్ధరించే పనులు ముమ్మరం చేశామని ఆయన తెలిపారు.

సహస్రధార నదిలో చిక్కుకుపోయిన ఐదుగురిని రాష్ట్ర విపత్తు స్పందన దళం (ఎస్డీఆర్ఎఫ్), పోలీసులు కలిసి రక్షించారని వెల్లడించారు. మరోవైపు, ప్రధాని నరేంద్ర మోదీ, కేంద్ర హోంమంత్రి అమిత్ షా మంగళవారం ఉదయం ముఖ్యమంత్రి పుష్కర్ సింగ్ ధామితో ఫోన్‌లో మాట్లాడి పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. కేంద్రం నుంచి అన్ని విధాల సహాయ సహకారాలు అందిస్తామని హామీ ఇచ్చారు. ప్రస్తుతం రెండు రాష్ట్రాల్లోనూ సహాయక బృందాలు నిరంతరాయంగా పనిచేస్తున్నాయి.

# రేవంత్ పై బీఆర్ఎస్ బిగ్ బాంబ్

రేవంత్ రెడ్డికి అమ్ముకోవడం అలవాటు అన్నారు. గ్రూప్-1 పోస్టులను అమ్ముకున్నారు. మిర్యాలగూడ ఎమ్మెల్యే గన్ మెన్ యూరియాను అమ్ముకున్నారు. ఇప్పుడు ఉప రాష్ట్రపతి ఎన్నికల్లో కూడా ఇలాంటి అక్రమాలు జరిగాయన్నారు. ఎన్నికల ముందు రేవంత్ రెడ్డి ఎంపీలకు దిశానిర్దేశం చేసినప్పటికీ, ఓట్లు బీజేపీ అభ్యర్థికి పడ్డాయని కౌశిక్ రెడ్డి పేర్కొన్నారు. ఇది కాంగ్రెస్ పార్టీ ఎన్‌డీఏతో రహస్య ఒప్పందం చేసుకున్నారని తెలంగాణ ప్రజల ఓట్లు ఇలా అమ్ముకోవడం దారుణమన్నారు. ఉపరాష్ట్రపతి ఎన్నికలు అయ్యాక మేము బీజేపీ అభ్యర్థికి ఓట్లు వేశామని కాంగ్రెస్ ఎంపీలు నిర్మలా సీతారామన్ ను కలిశారని కౌశిక్ రెడ్డి ఫోటోలు బయట పెట్టారు. కేంద్రమంత్రి నితిన్ గడ్కరీని కలిశారని తెలంగాణ కాంగ్రెస్ 8మంది ఎంపీలు లోక్ సభ స్పీకర్ ను కలిశారన్నారు. క్రాస్ అయిన 15 ఓట్లలో 8మంది తెలంగాణ కాంగ్రెస్ ఎంపీల ఓట్లు ఉన్నాయని కౌశిక్ రెడ్డి స్పష్టం చేశారు.తెలంగాణకు రేవంత్ రెడ్డి ద్రోహం చేశారన్నారు. రేవంత్ రెడ్డి చంద్రబాబుతో లింక్ పెట్టుకుని తెలంగాణ కాంగ్రెస్ ఎంపీల ఓట్లు అమ్ముకున్నారని మండిపడ్డారు. తనకు ముగ్గురు తెలంగాణ కాంగ్రెస్ ఎంపీలు కలిసి బీజేపీ ఉపరాష్ట్రపతి అభ్యర్థికి ఓటు వేశామని చెప్పారని కౌశిక్ రెడ్డి తెలిపారు. రాహుల్ గాంధీ ఓట్ చోరీ గురించి మాట్లాడుతున్నారు తెలంగాణలో కాంగ్రెస్ ముఖ్యమంత్రి ఓట్ చోరీ చేస్తున్నారని ఆరోపించారు. సుప్రీంకోర్టు మాజీ జడ్జి సుదర్శన్ రెడ్డిని రేవంత్ రెడ్డి మోసం చేశారన్నారు. రేవంత్ రెడ్డి గురుదక్షిణ చంద్రబాబు నాయుడు,మోడీకి చెల్లిస్తున్నారని విమర్శించారు. జస్టిస్ సుదర్శన్ రెడ్డికి రేవంత్ రెడ్డి వెన్నుపోటు పొడిచారు. రాహుల్ గాంధీ చెప్తే రేవంత్ రెడ్డి అభ్యర్థిని పెట్టారు మోడీ చెప్తే ఉపరాష్ట్రపతి అభ్యర్థికి ఓట్లు వేశారని.. రేవంత్ రెడ్డికి అమ్ముకోవడం అలవాటన్నారు. సిబిఐ,ఐటీ,ఈడీ బీజేపీ జేబు సంస్థలు అని రాహుల్ గాంధీ అంటారని కాళేశ్వరం ప్రాజెక్టుపై సీబీఐ విచారణ అని రేవంత్ రెడ్డి అంటారన్నారు. కాళేశ్వరం ప్రాజెక్టు విషయంలో మంత్రులు ఎవరికి తెలియకుండా రేవంత్ రెడ్డి సిబిఐ విచారణకు ఇచ్చారని ఆరోపించారు. కాంగ్రెస్ వాళ్ళను చూస్తే జాలివేస్తోంది, రేవంత్ రెడ్డి కాంగ్రెస్ పార్టీకి ముఖ్యమంత్రి నా లేక బీజేపీకి ముఖ్యమంత్రో తెలియడం లేదన్నారు.నరేంద్రమోదీ ఏది చెప్తే రేవంత్ రెడ్డి అది చేస్తున్నారు, మోడీకి రేవంత్ రెడ్డికి ఒప్పందం లేకపోతే గ్రూప్1 పోస్టుల అమ్మకాలపై సిబిఐ విచారణ జరిపించాలన్నారు. బిఆర్ఎస్ ప్రభుత్వం ఉన్నప్పుడు హడావిడి చేసిన కేంద్రమంత్రి బండి సంజయ్ ఇప్పుడు సైలెంట్ అయ్యారని కాంగ్రెస్ పార్టీని రేవంత్ రెడ్డి నడిసముద్రంలో ముంచుతున్నారని తేల్చారు. రేవంత్ రెడ్డి కాంగ్రెస్ కార్యకర్తలను పట్టించుకుంటున్నారా.? 15 ఓట్లు ఎవరు దొంగతనం చేశారో కాంగ్రెస్ తేల్చుకోవాలని సూచించారు.

# హైదరాబాద్ ఫ్యూచర్ సిటీకి మరో మార్గం

మేడిపల్లి వరకు ఉన్న ఆర్అండ్‌బి మార్గాన్ని నాలుగు వరుసలుగా విస్తరిస్తారు. మేడిపల్లికి అర కిలోమీటరు ముందుగా కొత్త రహదారిని నిర్మించి దానిని నేరుగా ఫ్యూచర్ సిటీకి అనుసంధానిస్తారు. గతంలో ఫ్యూచర్ సిటీని అనుసంధానించేందుకు కందుకూరు (శ్రీశైలం రహదారి) నుంచి యాచారం (నాగార్జునసాగర్ రహదారి) వరకు ఉన్న రహదారిని 100 అడుగులు విస్తరించాలని 2020లో ప్రతిపాదించారు. కందుకూరు నుంచి మీర్ ఖాన్ పేట వరకు ఈ పనులు పూర్తయ్యాయి. అయితే మిగిలిన పనులు భూసేకరణ, విద్యుత్ స్తంభాలను మార్చడానికి పెద్ద మొత్తంలో నిధులు అవసరం కావడంతో నిలిచిపోయాయి. ఈ ఆర్థిక భారాన్ని తగ్గించుకోవడానికి ఇప్పుడు తక్కళ్లపల్లి మీదుగా రహదారికి ప్రాధాన్యత ఇస్తున్నట్లు సమాచారం. ఈ కొత్త రహదారి అందుబాటులోకి వస్తే ఫ్యూచర్ సిటీకి చేరుకోవడానికి సులభమైన, వేగవంతమైన మార్గం లభిస్తుంది. ఈ ప్రాంతంలో పరిశ్రమలు, వ్యాపారాలు అభివృద్ధి చెందడానికి తోడ్పడుతుంది. ప్రయాణికులు సురక్షితంగా, తక్కువ సమయంలోనే గమ్యాన్ని చేరుకోగలుగుతారు. ఈ కొత్త రహదారి నిర్మాణం వల్ల ఫ్యూచర్ సిటీలో పెట్టుబడులు పెరిగే అవకాశం ఉంది. అలాగే చుట్టుపక్కల ప్రాంతాల ఆర్థిక వ్యవస్థకు కూడా ఇది ఊతమిస్తుందని భావిస్తున్నారు. దాంతో పాటుగా ఈ రహదారి వెళ్లే గ్రామాలు ఊహించనంతగా అభివృద్ధి చెందుతాయి. ఇక ఫ్యూచర్ సిటీ నుంచి ఏపీ రాజధాని అమరావతికి గ్రీన్ ఫీల్డ్ ఎక్స్‌ప్రెస్ వే నిర్మించనున్నారు. మొత్తం 12 వరుసలతో ఈ రహదారి నిర్మించనుండగా ఇటీవల సీఎం రేవంత్ రెడ్డి కేంద్ర మంత్రి గడ్కరీని కలిసి ప్రాజెక్టుపై చర్చించారు. యాచారం, మునుగోడు మీదుగా సూర్యాపేట - అమరావతి - బందర్ పోర్టు వరకు ఈ రహదారిని ప్రతిపాదించారు. త్వరలోనే ఎన్హెచ్ఏఐ అధికారులు తెలుగు రాష్ట్రాల్లో పర్యటించి ప్రాథమిక అలైన్‌మెంట్ ఖరారు చేయనున్నట్లు అధికార వర్గాలు వెల్లడించాయి.

# రెవెన్యూ శాఖ పనితీరుపై సీఎం అసహనం

పదే పదే కలెక్టర్లను నివేదికలు అడిగే పరిస్థితి రాకూడదు. ఆర్టీజీఎస్ నుంచి అవసరమైన మేరకు నివేదికలు తీసుకోవాలి. దానికి అనుగుణంగా క్షేత్ర స్థాయిలో పని చేయించాలి. ఉన్నతాధికారులు కలెక్టర్లను రిపోర్టులు కోరుతూ ఉండడం వల్ల పనులు ముందుకు కదలడం లేదనే విమర్శలు వస్తున్నాయని ఇకపై ఇలాంటి వాటికి చెక్ పెట్టాలి. ఆ కాలం ముగిసింది.'అని సీఎం చంద్రబాబు నాయుడు స్పష్టం చేశారు.

### ఫైళ్లన్ని ఆన్ లైన్ చేయాల్సిందే

'రెండు నెలల్లో 100 శాతం అన్ని ఫైళ్లు ఆన్ లైన్‌లో ఉండాల్సిందే. మానుప్యులేషన్ లేకుండా ఫోరెన్సిక్ ఆడిటింగ్ లాంటివి కూడా తీసుకువస్తాం. నెక్స్ట్ జెన్ టెక్నాలజీ వైపు మనం ముందడుగు వేయాలి. ఆర్టీజీఎస్ ద్వారా అవేర్ వ్యవస్థను ఏర్పాటు చేశాం. దీని ద్వారా 42 రకాల సమాచారం కలెక్టర్లకు అందుతోంది. నవంబరు నెలలోగా డేటా లేక్ పూర్తిగా అందరికీ అందుబాటులోకి వస్తుంది.'అని సీఎం చంద్రబాబు నాయుడు ఆదేశించారు.'వచ్చే కలెక్టర్ల సదస్సు నాటికి ఏయే జిల్లాలు ఎక్కడెక్కడ తమ పనితీరు మెరుగుపరుచుకోవాలో కూడా రియల్ టైమ్ లో చెప్పేలా వ్యవస్థను తీర్చిదిద్దుతున్నాం. లాస్ట్ మైల్ వరకూ ప్రయోజనాలు అందేలా టెక్నాలజీ వినియోగించాలి. వచ్చే రెండేళ్లలో ఈ ఫలితాలను కూడా అందుకోవచ్చు. ఆర్టీజీ జిల్లా కేంద్రాలు నవంబర్ నాటికి సిద్దం అవుతాయి. టెక్నాలజీ వినియోగంపై అక్టోబరు నెలలో మంత్రులు, అధికారులు, కలెక్టర్లకు శిక్షణా కార్యక్రమం నిర్వహిస్తాం.'అని సీఎం చంద్రబాబు నాయుడు వెల్లడించారు.

### టెక్నాలజీ ఎకో సిస్టం తెస్తాం

'ప్రకృతి వైపరీత్యాలు సంభవించినప్పుడు కానీ ఇతర అత్యవసర సమయాల్లో ప్రజలను అలెర్ట్ చేసేలా అలెర్ట్ బ్రాడ్ కాస్ట్ సిస్టం ఏర్పాటు చేయాలి. దీన్ని వివిధ ప్రాంతాల్లో చేపట్టాలి. అలాగే సీసీ టీవీ ఫుటేజీలను అనాలసిస్ చేసే పరిస్థితి తీసుకురావాలి. బ్యాండ్ విడ్త్ లేని సమయం నుంచి అత్యధిక బ్యాండ్ విడ్త్ తో పనిచేసే సమయం వచ్చింది. చురుగ్గా ఉండే యువ అఖిల భారత సర్వీసు అధికారుల సేవల్ని వినియోగించుకుంటాం.'అని సీఎం చంద్రబాబు నాయడు తెలిపారు.'ఏపీలో టెక్నాలజీ ఎకో సిస్టం క్రియేట్ చేసేందుకు ఐదుగురు యువ అధికారులను నియమించాం. టెక్నాలజీ రంగంతో పాటు ఇన్నోవేషన్ వంటి రంగాల్లో కూడా యువ ఐఏఎస్సులకు బాధ్యత అప్పజెప్పాం. ఇటీవల కాలంలో నేను చాలా మంది ఐఏఎస్సులతో మాట్లాడాను. కొందరు యువ ఐఏఎస్సుల్లో చాలా ఆలోచనలు ఉన్నాయి. చాలా వినూత్నంగా ఆలోచిస్తున్నారు. అలాంటి వాళ్లను పికప్ చేస్తున్నాం.'అని సీఎం చంద్రబాబు చెప్పారు.

### క్వాంటం భవనాల డిజైన్లు

కలెక్టర్ల కాన్ఫరెన్సులో క్వాంటం వ్యాలీ భవనాల డిజైన్లను ప్రదర్శించారు. ఆ భవనాలపై కలెక్టర్ల అభిప్రాయాలను సీఎం చంద్రబాబు నాయుడు కోరారు. భవిష్యత్తులో 3 వేల క్యూబిట్ క్వాంటం కంప్యూటర్ల ఏర్పాటుకు వీలుగా కార్యాలయ స్థలం అందుబాటులోకి రానున్నట్టు చంద్రబాబు వెల్లడించారు. 80 వేలమంది పని చేసేలా క్వాంటం వ్యాలీ భవనాల నిర్మాణం చేపడుతున్నట్టు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు తెలిపారు.

# ఎద్దు పొడవడంతో ఒకరి మృతి

బెల్లంపల్లి,: బెల్లంపల్లి పట్టణం రవీంద్ర నగర్ కు చెందిన జంగంపల్లి రాజారాం మంగళవారం ఎద్దు దాడిలో మృతి చెందాడు. రోడ్డు పక్కన ఇబ్బంది పడుతున్న ఎద్దు ముకుతాడు సరిచేస్తుండగా, ఆ ఎద్దు రాజారాం ఛాతిపై కొమ్ములతో పొడిచి, స్తంభానికి గుద్దడంతో తీవ్రగాయాలయ్యాయి. స్థానికులు అతన్ని బెల్లంపల్లి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా, చికిత్స పొందుతూ మరణించాడు.

# నిర్మల్ ప్రభుత్వ కళాశాలలో ఓజోన్ దినోత్సవం ఘనంగా నిర్వహణ

నిర్మల్, : నిర్మల్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో రసాయన శాస్త్ర విభాగం ఆధ్వర్యంలో అంతర్జాతీయ ఓజోన్ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎం సుధాకర్ ఈ విషయాన్ని ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా రసాయన శాస్త్ర అధ్యాపకులు సూర్య సాగర్, అర్చన ఓజోన్ ప్రాముఖ్యతను విద్యార్థులకు వివరించారు. ఈ కార్యక్రమంలో సుభాష్, శ్రీనివాస్, రమేష్ తో పాటు ఇతర అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

# రోడ్లపై చెత్త వేస్తే 8 రోజులు జైలు శిక్ష

**మరి సిబ్బంది తొలగించకుంటే..**

**అధికారులు పర్యవేశకుంటే ఏం చేస్తారో**

**ప్రతిరోజు రోడ్లు శుభ్రపరచకుంటే**

**చెత్త ఎత్తకుంటే మరి ఏం చేద్దాం అంటారో**



హైదరాబాద్ (ప్రశ్న న్యూస్) హైదరాబాద్‌లో రోడ్డుపై చెత్త వేయడం సర్వసాధారణమే కదా అని తేలికగా తీసుకుంటున్నారా అయితే జాగ్రత్త. ఇకపై అలా చేస్తే జరిమానాతో సరిపోదు, ఏకంగా 8 రోజుల పాటు జైలు శిక్ష అనుభవించవలసిందే నగరంలో రోడ్లపై చెత్త వేసే వారిపై హైదరాబాద్ పోలీసులు, జీహెచ్ఎంసీ అధికారులు సంయుక్తంగా కొరడా ఝుళిపిస్తున్నారు. ఈ నిర్లక్ష్యం కేవలం అపరిశుభ్రతకే కాకుండా, కొన్నిచోట్ల సామాజిక ఉద్రిక్తతలకు కూడా దారితీస్తుండటంతో అధికారులు ఈ అంశాన్ని తీవ్రంగా పరిగణిస్తున్నారు. నగరవాసులు రోడ్ల పక్కన పడేస్తున్న చెత్త, ముఖ్యంగా మాంసాహార వ్యర్థాలను వీధి కుక్కలు, పిల్లులు వంటి జంతువులు లాక్కెళ్లి సమీపంలోని దేవాలయాలు, మసీదులు, చర్చిలు, ఇళ్ల ముందు పడేస్తున్నాయి. ఈ కారణంగా సున్నితమైన ప్రాంతాల్లో వివాదాలు తలెత్తి, స్థానికంగా ఉద్రిక్త వాతావరణం నెలకొంటోంది. ఇటీవల ఇలాంటి ఘటనలు పెరిగిపోవడంతో, ఈ సమ స్యకు మూలకారణమైన రోడ్లపై చెత్త వేసేవారిపై కఠిన చర్యలు తీసుకోవాలని పోలీసులు నిర్ణయించారు.

### సిబ్బంది తొలగించకుంటే..అధికారులు పర్యవేక్షించకుంటే ఏం చేద్దాం..

చెత్త తొలగించకుంటే ఫైన్ వెయ్యడం జైలుకు పంపడం చాలా మంచి నిర్ణయమే దీనిని ప్రజలు మేధావులు స్వాగతించుచున్నారు. వేసిన చెత్తని సిబ్బంది అదే రోజు తొలగించకుంటే దానిని పర్యవేక్షించవలసిన మున్సిపల్ అధికారులు పర్యవేక్షకుంటే మరి వాళ్లకు ఎంత ఫైన్ వేస్తారు.? ఎన్ని రోజులు జైలుకు పంపిస్తారు.? అన్నదానిపై కూడా అధికారులు వివరాలు తెలిపితే బాగుంటుందని నగర ప్రజలు కోరుకుంటున్నారు. వాస్తవానికి జిహెచ్ఎంసి అధికారుల నిర్లక్ష్యంతోనే చెత్త రోడ్లపై వేస్తున్నారు ప్రతి సర్కిల్ పరిధిలో డిప్యూటీ కమిషనర్ ఎ.ఎం.ఓ.హెచ్ లు పర్యవేక్షించాలి ఎస్ఎఫ్ఏల కనుసైగల్లో సిబ్బందిచే ఎప్పటికప్పుడు తొలగించాలి కానీ ఈ మున్సిపల్ శాఖలో ఉన్న అవినీతిలో కొంతమంది సిబ్బంది నిర్లక్ష్యంతో చెత్తను పూర్తిగా తొలగించారు తూతూ మంత్రంగా తొలగిస్తారు దానికి తోడు అధికారుల బాధ్యతారాహిత్యం ఇంకేముంది రోడ్లకు ఇరువైపులా ఎక్కడపడితే అక్కడ చెప్తా చెత్తకుప్పలు చిత్త దిబ్బలు ఇలా ప్రజలను ఇబ్బంది పెడుతున్నాయి. ఉన్నత అధికారులు కూడా సిబ్బంది అధికారుల నిర్లక్ష్యంపై కూడా ఓ నిర్ణయం తీసుకుంటే బాగుంటుందని ప్రజలు సూచిస్తున్నారు.

# జీఎస్టీ తగ్గింపుతో సామాన్యులకు ఆర్థిక లాభం చేకూరుతుంది

**- భాజాపా పట్టణ ఓబీసీ ఉపాధ్యక్షులు : సగ్గు రాహుల్**



వేములవాడ (ప్రశ్న న్యూస్)భారతీయ జనతా పార్టీ కేంద్ర ప్రభుత్వం ఇటీవల దేశవ్యాప్తంగా జీఎస్టీ (జనరల్ సేల్స్ టాక్స్) పన్ను రేట్లను తగ్గించడం ద్వారా సామాన్య ప్రజలకు ఆర్థిక ప్రయోజనం చేకూర్చడంలో భాజపా ప్రభుత్వం కట్టుబడి ఉందని భారతీయ జనతా పార్టీ వేములవాడ పట్టణ ఓబీసీ ఉపాధ్యక్షులు సగ్గు రాహుల్ అన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భాజపా శ్రేణులు సమిష్టిగా జీఎస్టీ తగ్గింపు - ఆర్థిక లాభాలపై ప్రజలకు క్షేత్రస్థాయిలో అవగాహన కల్పించాల్సిన అవసరం ఉందన్నారు.బీజేపీ ప్రభుత్వం ప్రజల సంక్షేమం కోసం నిరంతరం కృషి చేస్తూ ఆర్థిక వ్యవస్థను బలోపేతం చేయడానికి కట్టుబడి ఉందని సగ్గు రాహుల్ స్పష్టంచేశారు.

# రోడ్డు ప్రమాదంలో ఇద్దరు మృతి



మేడ్చల్ (ప్రశ్న న్యూస్) రోడ్డు ప్రమాదంలో యువతి ఇస్లావత్ అనూష, మహేశ్వర్ రెడ్డిలు మృతి చెందిన సంఘటన మేడ్చల్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. మేడ్చల్ పోలీసులు తెలిపిన వివరాలు ప్రకారం మండలంలోని ఘనపూర్ గ్రామంలో గల మెడిసిటీ మెడికల్ కళాశాలలో ఎంబీబీఎస్ మూడవ సంవత్సరం చదువుతున్న ఇస్లావత్ అనూష (20) తన మిత్రుడు మహేశ్వర్ రెడ్డితో ఏపీ28సిహెచ్9386 అనే నెంబర్ గల ద్విచక్ర వాహనంపై మేడ్చల్ నుంచి కొంపల్లి వైపు వెళ్తుండగా మార్గమధ్యమైన కండ్లకోయ సమీపంలోని ఆక్సిజన్ పార్కు బస్ స్టాప్ వద్ద అతివేగంగా వచ్చిన ఎంపీ28హెచ్3645 అనే నెంబర్ గల లారీ వెనుక నుంచి ఢీకొట్టడంతో ద్విచక్ర వాహనంపై వెళ్తున్న ఇద్దరు కిందపడగా అనూషపై నుంచి లారీ వెళ్లడంతో ఆమె అక్కడికక్కడే మృతి చెందింది. ఈ ప్రమాదంలో గాయపడిన మహేశ్వర్ రెడ్డిని మేడ్చల్ పట్టణంలోని సంప్రద ఆసుపత్రికి తరలించగా చికిత్సపొందుతూ మహేశ్వర్ రెడ్డి మృతి చెందాడు. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు మేడ్చల్ పోలీసులు తెలిపారు.

# మైనార్టీ గురుకుల పాఠశాలను ఆకస్మిక తనిఖీచేసి జగిత్యాల ఎమ్మెల్యే సంజయ్

**-విద్యార్థులతో కలిసి భోజనం**



జగిత్యాల జిల్లా (ప్రశ్న న్యూస్) జగిత్యాల పట్టణంలోని తెలంగాణ మైనార్టీ గురుకుల బాలుర పాఠశాలను ఆకస్మిక తనిఖీచేసి విద్యార్థులతో కలిసి భోజనం చేసిన జగిత్యాల ఎమ్మెల్యే డా సంజయ్ కుమార్. విద్యార్థుల సమస్యలు అడిగి తెలుసుకొని ప్రభుత్వం డైట్ చార్జీలు పెంచిందని ప్రస్తుతం ప్రతి రోజు అందించే మెనూ ఎలా ఉంటుందని విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. డైట్ మెనూ ను పక్కాగా అమలు చేయాలని సిబ్బందిని ఆదేశించడం జరిగింది.చదువుల్లో వెనకబడిన విద్యార్థులకు స్పెషల్ క్లాస్ లు తీసుకోవాలని సూచించారు.

# దైవిక వాస్తుశిల్పి విశ్వకర్మ

## "విశ్వకర్మ జయంతి సందర్భంగా"



సృష్టికర్త అని కూడా పిలువబడే విశ్వకర్మది హిందూ పురాణాలలో ఒక ప్రత్యేక స్థానం. విశ్వం యొక్క అంతిమ సృష్టికర్తగా, దేవతల కోసం అనేక రాజ భవనాలను నిర్మించిన దైవిక వాస్తు శాస్త్రం తెలిసిన సూత్రధారిగా గుర్తింపుపొందిన గొప్ప వాస్తు శిల్పి. పురాణాల ప్రకారం విశ్వకర్మ శివుని త్రిశూలం, విష్ణువు సుదర్శన చక్రం, లంక మహారాజు రావణుడి పుష్పక విమానం వంటి అనేక దైవిక ఆయుధాలను నిర్మించాడు. ఇంద్రుని వజ్రం, శ్రీకృష్ణుని రాజ్యం ద్వారక, పాండవుల కోసం మాయా సభను కూడా రూపొందించారు. ఈ సృష్టిలలో ప్రతి ఒక్కటి అతని అసాధారణ నిర్మాణ నైపుణ్యాన్ని ప్రదర్శిస్తుంది.

విశ్వకర్మ సృజనాత్మకతకు అవధులు లేవు. ఆయన నాలుగు యుగాల దేవతలకు అనేక రాజభవనాలను రూపొందించి నిర్మించారు. ఈ అద్భుతమైన నిర్మాణాలు ఆయన అసాధారణ నైపుణ్యాలు, కళాత్మక దృష్టికి నిదర్శనంగా నిలుస్తాయి. సత్య యుగంలోని సంపన్నమైన రాజభవనాల నుండి కలియుగంలోని గొప్ప దేవాలయాల వరకు, విశ్వకర్మ నిర్మాణ అద్భుతాలు యుగయుగాలుగా ప్రజలను ఆకర్షించాయి. విశ్వకర్మ దినోత్సవం, లేదా విశ్వకర్మ జయంతి, భారత్ లో ఎంతో ఉత్సాహంతో జరుపుకునే శుభ సందర్భం. విశ్వకర్మకు నివాళులు అర్పించడానికి, ఆయన అమూల్యమైన సహకారాన్ని గుర్తించడానికి ఇది అంకితం చేయబడింది. ఈ రోజున, ప్రజలు తమ తమ చేతిపనులు, వ్యాపారాలలో విజయం, శ్రేయస్సు కోసం ఆయన ఆశీర్వాదం కోసం ప్రార్థనలు, ఆచారాలను నిర్వహిస్తారు. మన ప్రపంచాన్ని రూపొందించడంలో దైవిక వాస్తుశిల్పి పాత్రను గుర్తించడం గౌరవించడంలో విశ్వకర్మ దినోత్సవం యొక్క ఒప్రాముఖ్యత ఎంతో ఉంది.

### విశ్వకర్మ జయంతి

దైవిక వాస్తుశిల్పి అయిన విశ్వకర్మ పుట్టినరోజున నిర్వహించే పండుగనే విశ్వకర్మ జయంతి. ప్రతి సంవత్సరం సెప్టెంబరు 17న విశ్వకర్మ పూజను నిర్వహించడం సంప్రదాయం. హిందూ పురాణాల ప్రకారం విశ్వకర్మ స్వయంభుగా, ప్రపంచ సృష్టికర్తగా పరిగణించబడ్డాడు. కృష్ణుడు పరిపాలించిన పవిత్రమైన ద్వారక నగరాన్ని, పాండవుల కోసం ఇంద్రప్రస్థ రాజభవనాన్ని నిర్మించడంతో పాటు దేవతలకు అనేక అద్భుతమైన ఆయుధాలను తయారుచేశాడు. విశ్వకర్మను దివ్య వడ్రంగి అని కూడా పిలుస్తారు. పరికరకర్త, వాస్తు శాస్త్రాలలో శాస్త్రమైన స్థపత్య వేదంతో ఘనత పొందాడని ఋగ్వేదంలో ప్రస్తావించబడింది. విశ్వకర్మ దైవిక శిల్పి కాబట్టి ఆయన జ్ఞాపకార్థం విశ్వకర్మ జయంతిని జరుపుకుంటారు. విశ్వకర్మ జయంతిని విశ్వబ్రాహ్మనులు ఎంతో ఉత్సాహంగా జరుపుకునే వేడుక. తాము పనిచేసే ప్రదేశంలో విశ్వకర్మకు పూజలు నిర్వహించి తీర్థ ప్రసాదాలను పంపిణీ చేస్తారు. విశ్వకర్మ చేతివృత్తుల శాస్త్రాన్ని బోధించడమే కాక వివిధ కళలలో దాగి ఉన్న నైపుణ్యాన్ని వివరించాడు. ఈ సంప్రదాయం ఇప్పటికీ కొనసాగుతోంది, పండితులు కొన్ని సృష్టి యొక్క కళ రహస్య శాస్త్రాలను అర్హులైన వ్యక్తులకు బోధించడం అనాధిగా వస్తున్న సంప్రదాయం. విశ్వకర్మ ఈ విశ్వాన్ని సృష్టించాడని పురాణాలు చెబుతున్నాయి. భగవాన్ కృష్ణుడు ద్వారకకు మారినప్పుడు కూడా ఆయన ద్వారక నగరాన్ని సృష్టించాడు. పురాణాల ప్రకారం రాజు కోరిక మేరకు భగవాన్ జగన్నాథుడి విగ్రహాలను తయారుచేసే పనిని స్వీకరించి తాను పనిచేసే మందిరాన్ని మధ్యలో ఎవరు కూడా తెరవ వద్దని షరతు విధించాడు. కాని గడువు ముగుస్తుండడం విగ్రహాల తయారీపై ఆతృత పెరిగిన రాజు విగ్రహాలు చెక్కుతున్న మైదిర తలుపులు తెరవడంతో కృష్ణభగవానుని విగ్రహాలు అసంపూర్తిగా మిగిలిపోగా నేటికి అసంపూర్తిగా మిగిలిపోయిన జగనాథుని విగ్రహనే పూజించడం గమనార్హం. ప్రపంచానికి అసలైన సృష్టికర్తగా పిలువబడుతున్న విశ్వకర్మ సృష్టి కంటే ముందే ఉన్నాడు. విశ్వకర్మకు ఐదుగురు కుమారులు 1.మన్ను, 2.మయ, 3.తవష్ట, 4.శిల్పి, 5.దేవగ్యా, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. దివ్య హస్తకళాకారుడైన విశ్వకర్మ హస్తకళాకారులు, వాస్తు శిల్పులందరికి అధిపతి.

బ్రహ్మదేవుని సప్తమ కుమారుడైన విశ్వకర్మ భాద్రపద మాసంలోని శుక్ల పక్షం చతుర్దశి రోజున జన్మించాడని విశ్వాసం. విశ్వకర్మ ప్రపంచంలోని మొదటి హస్తకళాకారుడిగా పరిగణిస్తారు. విశ్వసృష్టిలో బ్రహ్మ దేవుడికి సాయపడ్డాడని పురాణాల వల్ల తెలుస్తుంది. విశ్వకర్మ జయంతి సందర్భంగా విశ్వకర్మతో పాటు ఆయుధాలను కూడా పూజిస్తారు. ఇది ఉద్యోగం, వ్యాపారంలో పురోగతిని, జీవితంలో ఆనందం, సకల సౌఖ్యాలను తెస్తుందని విశ్వాసం. చతుర్ముఖుడైన విశ్వకర్మ కిరీటాన్ని, సువర్ణా భరణాలతో ఎనిమిది చేతులు, ఒక చేతిలో నీటిబిందె, ఒక చేతిలో పుస్తకం, ఒక చేత ఉచ్చు, మిగిలిన చేతులలో వివిధ ఆయుధాలను, పనిముట్లను కలిగి ఉండి భక్తులను అనుగ్రహిస్తాడని భక్తుల ప్రగాఢ విశ్వాసం.



**రవికుమార్ సంతోజు**
**బడంగ్ పేట్.**

# ఏసీబీ వలలో భారీ అవినీతి తిమింగలం

## - జీతం లక్ష, ఆస్తులు 200 కోట్లు

- **విద్యుత్ శాఖ ఏడీఈ అంబేద్కర్ నివాసంలో ఏసీబీ సోదాలు**
- **రూ. 2.18 కోట్ల నగదు స్వాధీనం, అధికారుల అదుపులో ఏడీఈ**
- **హైదరాబాద్‌లో జీ+5 భవనం, ఖరీదైన ప్లాట్లు గుర్తింపు**
- **ఆదాయానికి మించిన ఆస్తుల కేసు నమోదు చేసి విచారణ**
- **ఈ అధికారిని పట్టుకున్న వందల కోట్లే**



హైదరాబాద్ (ప్రశ్న న్యూస్) తెలంగాణలో ఏ అధికారిని పట్టుకున్న ఏసీబీ అధికారులకు కళ్ళు బైర్లుగా అమ్ముతున్నాయి వాళ్ళ అక్రమాస్తులు చూసి.. చేసేది చిన్న ఉద్యోగమైన సంపాదించింది మాత్రం అపర కోటీశ్వరులుగా సంపాదించారు. అంటే ఎంత అవినీతి అక్రమాలకు పాల్పడ్డారో అర్థం చేసుకోవచ్చు. చిన్నస్థాయి ఉద్యోగులే ఇట్లా వందల కోట్లు సంపాదిస్తుంటే మరి ఐఏఎస్ స్థాయి అధికారుల ఆస్తులు ఎన్ని వందల కోట్లు ఉన్నాయో ఊహకందని పరిస్థితి.తెలంగాణ అవినీతి నిరోధక శాఖ విద్యుత్ విభాగంలో అతి పెద్ద అవినీతి తిమింగలాన్ని పట్టుకుంది. మంగళవారం ఉదయం 5 గంటల నుంచి విద్యుత్ శాఖ అసిస్టెంట్ డివిజనల్ ఇంజనీర్ (ఏడీఈ) అంబేద్కర్ నివాసం, బంధువుల ఇళ్లపై భారీ సోదాలు చేపట్టారు. ఆదాయానికి మించిన ఆస్తులు కేసులో ఈ రైడ్స్‌లో రూ.2 కోట్లకుపైగా నగదు, బంగార ఆభరణాలు, మూడు ప్లాట్లు, గచ్చిబౌలిలో ఒక భవనం, 10 ఎకరాల వ్యవసాయ భూమి, 1,000 చదరపు గజాల ఫామ్‌హౌస్ వంటి ఆస్తులు గుర్తించారు. ప్రాథమిక అంచనాల ప్రకారం, అంబేద్కర్ బెనామీల పేర్లపై ఉన్న మొత్తం ఆస్తుల విలువ రూ.200 కోట్లకు పైగా ఉండవచ్చని ఏసీబీ అధికారులు తెలిపారు. మొత్తం ఏసీబీ 18 బృందాలుగా విడిపోయి మణికొండలోని అంబేద్కర్ నివాసం, గచ్చిబౌలి, మధాపూర్, రంగారెడ్డి, మెదక్, నల్గొండ జిల్లాల్లోని బంధువులు, బినామీల ఇళ్లలో తనిఖీలు చేపట్టింది. మహబూబ్‌నగర్ జిల్లాలోని బినామీ సతీష్ ఇంట్లోనే రూ.2 కోట్ల నగదు నోట్ల కట్టల రూపంలో పట్టుబడింది. ఈ నగదు అంబేద్కర్ అక్రమ సంపాదనలో భాగమని అధికారులు గుర్తిచారు. సోదాల సమయంలో డాక్యుమెంట్లు, పత్రాలు పెద్ద ఎత్తున దొరికాయి.

### - దొరికిన ఆస్తులు

- హైదరాబాద్ మూడు ఖరీదైన ప్లాట్
- గచ్చిబౌలి ప్రాంతంలో ఒక ఖరీదైన భవనం (బంధువు పేరుపై ఉంది).



- సూర్యాపేట్ జిల్లా పెంపహాడ్‌లో 10 ఎకరాల వ్యవసాయ భూమి.
-అదే ప్రదేశంలో 1,000 చదరపు గజాల్లో ఒక ఫామ్‌హౌస్.
- రెండు కార్లు

బ్యాంక్ డిపాజిట్లు, ఇతర విలువైన వస్తువులు. మొత్తం ఆస్తుల విలువ రూ.200 కోట్లకు పైగా ఉండవచ్చని ప్రాథమిక అంచనా. బినామీల పేర్లపై ఉన్న గృహాలు, స్థలాలు, ఫామ్‌ల్యాండ్‌లు జాబితాను ఏసీబీ రెడీ చేస్తోంది.

అంబేద్కర్ మణికొండ, నార్సింగ్ డివిజన్లలో ఏడీఈగా పనిచేస్తూ, విద్యుత్ కనెక్షన్లు, చిన్న పనులకు కూడా భారీ లంచాలు వసూలు చేసినట్లు ఆరోపణలు ఉన్నాయి. మాల్స్, థియేటర్లు, వాణిజ్య సంస్థలకు కనెక్షన్లు ఇవ్వడానికి లంచాలు తప్పనిసరిగా డిమాండ్ చేసేవారని, కస్టమర్లను హింసించేవారని ఫిర్యాదులు పెద్ద ఎత్తున ఉన్నాయి. గతేడాది అవినీతి, డ్యూటీలో లేకపోవడం వంటి కారణాలతో సస్పెన్షన్‌కు గురయ్యారు, కానీ కొన్ని వారాల్లో తిరిగి డ్యూటీకి వచ్చారు.

ఈ ఆస్తులు అక్రమ లంచాలతోనే కూడబెట్టబడ్డాయని ఏసీబీ ఎఫ్ఐఆర్ నమోదు చేసింది. ఆయనను అరెస్టు చేశారు.

# ఆటో డ్రైవర్ హత్య కేసు నిందితులు అరెస్ట్ : డీఎస్పీ రఘు చందర్

**-రూరల్ సీఐ సుధాకర్, ఎస్సై సదాకర్**

జగిత్యాల జిల్లా (ప్రశ్న న్యూస్) గ్రామీణ మండలం పొలాస - గుల్లపేట సమీపంలో జగిత్యాలకు చెందిన నహీముద్దీన్ అనే ఆటో డ్రైవర్ హత్య కేసులో పోలీసులు నిందితులను అరెస్ట్ చేశారు. బీహార్‌కు చెందిన దర్శన్ సాహ్నా, సునీల్ సాహ్నా అనే కూలీలు మూడు వందలకు ఆటో అద్దెకు మాట్లాడుకుని, అద్దె విషయంలో గొడవ రావటంతో గుడ్డతో మెడకు ఉరివేసి ఆ తర్వాత బండతో మోదీ హత్య చేసినట్లు జగిత్యాల డీఎస్పీ రఘు చందర్ తెలిపారు.

నిందితులను అరెస్ట్ చేసి రిమాండ్ కు తరలించారని తెలిపారు.రూరల్ సీఐ సుధాకర్, ఎస్సై సదాకర్ , పోలీసు సిబ్బంది ఉన్నారు.



# జాతీయ స్థాయి కరాటేలో విజేతలుగా నిలిచిన లిటిల్ స్టార్, జడ్పీ హైస్కూల్ విద్యార్థులు

**- జాతీయ స్థాయిలో స్వర్ణ పతకాలు సాధించిన శివ కుమార్, వర్షిత**



**వేములవాడ (ప్రశ్న న్యూస్)** 29వ జాతీయస్థాయి ఓపెన్ కరాటే ఛాంపియన్షిప్ టోర్నమెంట్‌లో వేములవాడ, హనుమాజీపేట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు పతకాల వర్షం కురిపించారు. హైదరాబాద్ లోని బోడుప్పల్, బొమ్మక్ బాలయ్య గార్డెన్స్‌లో జరిగిన ఈ పోటీల్లో విక్టరీ షోటాకన్ కరాటే అసోసియేషన్ ఇండియా తరపున 20 మంది విద్యార్థులు పాల్గొన్నారు. వేములవాడ లిటిల్ స్టార్ స్కూల్ విద్యార్థులు శ్రీకర్, ఆదిత్య చరణ్ వెండి పతకాలు సాధించగా, హనుమాజీపేట జడ్పీహెచ్ఎస్ విద్యార్థులు శివకుమార్, వర్షిత బంగారు పతకాలు గెలిచారు. తపస్వి, భవ్యశ్రీ, స్నేహిత, నిపుణశ్రీ వెండి పతకాలు, ధరణి, నైమిశా, గ్రీష్మ, శ్రీవల్లి, గీతిక ప్రియ, మనస్విని, శృతిక, శ్రీ శరణ్య, నందిత, వైష్ణవి, లక్ష్మి తనుజ కాంస్య పతకాలు సాధించి ప్రతిభ చాటారు. శిక్షకుడు కనికరపు రాజశేఖర్ మార్గదర్శకత్వంలో సాధించిన ఈ విజయాలను లిటిల్ స్టార్ స్కూల్ ప్రధానోపాధ్యాయులు బొంగుని శ్రీనివాస్ గౌడ్, హనుమాజీపేట జడ్పీహెచ్ఎస్ ప్రధానోపాధ్యాయులు శ్రీకాంత్ అభినందించారు.

# ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర గవర్నర్ అబ్దుల్ నజీర్ కి సాదర వీడ్కోలు



**శ్రీకాళహస్తి(ప్రశ్న న్యూస్)** రేణిగుంట, తిరుపతి జిల్లా మూడు రోజుల పర్యటన అనంతరం తిరుగుప్రయాణం అయిన ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర గవర్నర్ అబ్దుల్ నజీర్ మంగళవారం సాయంత్రం రేణిగుంట విమానాశ్రయం నందు జిల్లా ఇంచార్జి కలెక్టర్ శుభం బన్సల్. సాదర వీడ్కోలు పలికారు అడిషనల్ ఎస్పీ కె.రవి మనోహరాచారి, రేణిగుంట డి ఎస్ పి వై. శ్రీనివాసరావు, రేణిగుంట తహసిల్దార్ చంద్రశేఖర్ రెడ్డి ఆంధ్రప్రదేశ్ గవర్నర్ సాదర వీడ్కోలు పలికినారు.

# పౌష్టికాహారంతో వ్యాధులు దూరం



**నాచారం(ప్రశ్న న్యూస్)** పౌష్టికాహారం తీసుకోవడం ద్వారా వ్యాధి నిరోధకశక్తి పెరిగి ఆరోగ్యవంతంగా ఉంటారని డా.కేకే కాన్సెర్ కేర్ అండ్ సపోర్ట్ ఫౌండేషన్ ఫౌండర్ డాక్టర్ కరుణ కుమార్ తెలిపారు. నాచారం లోనీ సెయింట్ పాయిస్ కళాశాల లో డాక్టర్ కేకే క్యాన్సర్ కేర్,



సపోర్ట్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో యువత లో రక్త సంబంధిత వ్యాధుల నివారణ అంశం పై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో విద్యార్థినులకు అనీమియా, తలేసీమియా మరియు ఇతర రక్త సంబంధిత వ్యాధుల పై అవగాహన కల్పించారు. విద్యార్థినులకు మరియు పాఠశాల సిబ్బందికి ఉచిత వైద్య పరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ కరుణ కుమార్ మాట్లాడుతూ వ్యాధి నిరోధక శక్తి పెరిగేందుకు ఆకుకూరలు, పండ్లు, కోడిగుడ్లు వంటి పోషకాలు కలిగిన ఆహారం అందించాలన్నారు. ఈ కార్యక్రమంలో సిస్టర్ వేలాంగిణి కుమారి కళాశాల సిబ్బంది పాల్గొన్నారు.

# సొంతగూటికి చేరిన కాంగ్రెస్ నేతలు

ఆదిలాబాద్: ఆదిలాబాద్ కాంగ్రెస్ పార్టీలో కీలక పరిణామం చోటుచేసుకుంది. అసెంబ్లీ ఎన్నికలకు ముందు పార్టీ నుంచి సస్పెండ్ అయిన టిపిసిసి మాజీ కార్యదర్శి గంద్రత్ సుజాత, మాజీ డిసిసి అధ్యక్షుడు సాజిద్ ఖాన్, మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ సంజీవ రెడ్డి తిరిగి కాంగ్రెస్ పార్టీలో చేరారు. హైదరాబాద్ లో టిపిసిసి అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్ సమక్షంలో వీరు కాంగ్రెస్ లో చేరగా, సీనియర్ కాంగ్రెస్ నేతలు ఈ చేరిక పట్ల హర్షం వ్యక్తం చేశారు.

# గుడిహత్నూర్‌లో బీజేపీ జెండా ఆవిష్కరణ, బ్రహ్మానంద్ ముఖ్య అతిథి

బోథ్, : తెలంగాణ విమోచన దినోత్సవం సందర్భంగా, సెప్టెంబర్ 17న గుడిహత్నూర్ బీజేపీ కార్యాలయంలో జాతీయ జెండా ఆవిష్కరణ కార్యక్రమం జరగనుంది. ఈ కార్యక్రమానికి బీజేపీ జిల్లా అధ్యక్షులు శ్రీ పతంగే బ్రహ్మానంద్ ముఖ్య అతిథిగా హాజరవుతారు. మండల బీజేపీ అధ్యక్షుడు కేంద్రే శివా, పార్టీ నాయకులు, కార్యకర్తలు అధిక సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.

# సెప్టెంబర్ 17-ప్రజల చేతుల్లో స్వరాజ్య దీపం



తెలంగాణలో ప్రజాస్వామ్య పునాదులు గట్టిపడిన చారిత్రక రోజు ఇది. కేవలం రాజాధికారం మార్పు మాత్రమే కాదుబీ ప్రజల చేతిలో ప్రజాస్వామ్యం శక్తి ఆరంభమైన రోజుగా చరిత్రలో నిలిచింది.

### చరిత్రలో ఒక మలుపు - ఆపరేషన్ పోలో

1948 సెప్టెంబర్ 17న హైదరాబాద్ సంస్థానం భారత గణతంత్రంలో కలిసింది. రెండు శతాబ్దాలుగా కొనసాగిన నిజాం పాలన ముగిసి, తెలంగాణ ప్రజలకు కొత్త యుగం ప్రారంభమైంది. ఆ రోజు నుంచి పల్లెలు, ఊర్లు, పట్టణాలు ప్రజాస్వామ్య పంథాలో అడుగులు వేశాయి.

### విలీనమా.? విమోచనమా.?

కొందరు దీన్ని "విలీనం" అంటారు, మరికొందరు "విమోచనం" అని పిలుస్తారు. కానీ తెలంగాణ ప్రజల దృష్టిలో ఇది అంతకంటే గొప్పది %-% ప్రజాస్వామ్యానికి నాంది పలికిన రోజు. అందుకే దీన్ని లిలి"ప్రజా పాలన దినోత్సవం"గా పిలుస్తారు.

### కాంగ్రెస్ చారిత్రాత్మక నిర్ణయం

స్వాతంత్ర్యం తర్వాత హైదరాబాద్ ను భారత గణతంత్రంలో కలపడానికి కేంద్రంలో కాంగ్రెస్ తీసుకున్న ధైర్య నిర్ణయం చరిత్రలో చిరస్థాయిగా నిలిచింది. ఆ తర్వాత కూడా ప్రజాస్వామ్య వ్యవస్థను బలపరిచేందుకు, స్థానిక సంస్థల నుంచి రాష్ట్ర పాలన వరకు ప్రజల పాలుపంచుకునే అవకాశాలను విస్తరించేందుకు కాంగ్రెస్ నిరంతర కృషి చేసింది.

### ప్రజా పాలన - పదంలో విశాలత

"ప్రజా పాలన" అన్న పదంలోనే ఆత్మగౌరవం, స్వేచ్ఛ, సమానత్వం దాగి ఉన్నాయి. కులం, మతం, వర్గం భేదాలు లేకుండా ప్రజలకు హక్కులు లభించిన రోజు ఇది. ప్రజల మాట వినబడే వేదికలు ఏర్పడిన రోజు, పాలకులు ప్రజల ఆమోదం పొందిన ప్రతినిధులుగా ముందుకు వచ్చిన రోజు.

### నేటి తరానికి పాఠం

సెప్టెంబర్ 17 కేవలం చారిత్రక స్మరణ మాత్రమే కాదు, ప్రస్తుత తరం కోసం గొప్ప పాఠం. ప్రజాస్వామ్యాన్ని బలోపేతం చేయడం మనందరి బాధ్యత అని గుర్తు చేసే రోజు. రాజకీయాలు అధికారానికి మాత్రమే కాదు, ప్రజల సేవకు అని చెప్పే రోజు. తెలంగాణ అభివృద్ధి, సమాన హక్కులు, సామాజిక న్యాయయి ప్రజా పాలన బలపడినప్పుడే సాధ్యమని సూచించే రోజు.



సత్యనారాయణ గుండ్లపల్లి
ప్రెసిడెంట్, తెలంగాణ డి ఎన్ టి లాయర్స్ ఫోరం

సెప్టెంబర్ 17ను "విమోచన దినోత్సవం" అని పిలవడం విభజనాత్మకంగా మారే ప్రమాదం ఉంది. "విలీన దినోత్సవం" అనడం ఆ ఘట్టం ఆత్మను ప్రతిబింబించదు. కానీ "ప్రజా పాలన దినోత్సవం" అన్నే తెలంగాణ చరిత్రకు, ప్రజాస్వామ్యానికి న్యాయం చేస్తుంది.

"ప్రజలే పాలనకు కేంద్ర బిందువ. ప్రజల కోసం, ప్రజలతో కూడిన పాలన మాత్రమే శాశ్వత ప్రజాస్వామ్యం."

# సైనిక చర్యతో స్వాతంత్ర్యం దిశగా

## "తెలంగాణ విమోచనదినం సందర్భంగా"



హైదరాబాదు సంస్థానాధీశుడు ఏడవ నిజాం నవాబు ఉస్మాన్ ఆలీ ఖాన్ నుండి విముక్తి కోసం సంస్థాన ప్రజలు 1946 నుంచి 1948 మధ్య వీరోచితంగా చేసిన పోరాటానే తెలంగాణ విమోచనోద్యమంగా పిలుస్తారు. రెండు వందల సంవత్సరాల దోపిడి, అణిచివేతకు నలభై ఏడు సంవత్సరాల తిరుగుబాటు, సాయుధ పోరాటం ఒక దశ మాత్రమే. వివిధ సంఘాలు, పార్టీలు, ప్రజాస్వామికవాదులు, రచయితలు, ప్రజల సంఘటిత క్రమ-పరిణామ పోరాటమది. హైదరాబాదు సంస్థానంలో ప్రస్తుత తెలంగాణాతో పాటు మరాఠ్వాడ (మహారాష్ట్ర), బీదర్ (కర్ణాటక) ప్రాంతాలు ఉండేవి. ఈ మూడు భాషా ప్రాంతాలకు చెందిన మొత్తం 16 జిల్లాలకు గాను 8 జిల్లాలు తెలంగాణా ప్రాంతానికి చెందినవి కాగా, మరాఠా, కన్నడ ప్రాంతాలకు చెందినవి 8 జిల్లాలుండేవి. భారతదేశానికి స్వాతంత్ర్యం వచ్చినను నిజాం సంస్థానంలోని ప్రజలకు మాత్రం స్వాతంత్ర్యం లేకపోవడాన్ని ఇక్కడి ప్రజలు జీర్ణించుకోలేకపోయారు. దేశమంతటా స్వాతంత్ర్యోత్సవాలతో ప్రజలు ఆనందంతో గడుపుచుండగా నిజాం సంస్థాన ప్రజలు మాత్రం నిరంకుశ బానిసత్వంలో కూరుకుపోయారు. హైదరాబాదు రాజ్యాన్ని పాలిస్తున్న ఏడవ నిజామ్ మీర్ ఉస్మాన్ అలీ ఖాన్ రాజ్యాన్ని సొంతం చేసుకోవడానికి విశ్వప్రయత్నం చేస్తు రజాకార్లను ఉసిగొల్పాడు. నిజాంకు అండగా ఖాసిం రజ్వీ నేతృత్వంలోని రజాకార్లు గ్రామాలపై పడి దోపిడిచేయడం, ఇండ్లు తగలబెడుతు నానా అరాచకాలు సృష్టించారు. అతని మతోన్మాద చర్యలు కోరలుచాచి వెయ్యి నాల్కలతో విషం కక్కాయి. హీనమైన బతుకులు వెళ్ళదీస్తున్న జనాల బ్రతుకులను పట్టించుకోకుండా ప్రజల నుండి బలవంతంగా వసూలు చేసుకున్న పన్నుల సొమ్ముతో విలాసాలు, జల్సాలు, భోగభాగ్యాలు అనుభవించే వారు. దీనితో రామానందతీర్థ నేతృత్వంలో ఆర్యసమాజ్ ఉద్యమాలు, కమ్యూనిస్టుల ఆధ్వర్యంలో సాయుధ పోరాటాలు ఉద్ధృతమయ్యాయి. మొదట నల్గొండ జిల్లాలో ప్రారంభమైన ఉద్యమం శరవేగంగా నైజాం సంస్థానం అంతట విస్తరించింది. రావి నారాయణరెడ్డి, చంద్ర రాజేశ్వరరావు, మల్లు స్వరాజ్యం, ఆరుట్ల కమలాదేవి, బొమ్మగాని ధర్మభిక్షం, మాడపాటి హనుమంతరావు, దాశరథి రంగాచార్య, కాళోజి నారాయణరావు, షోయబుల్లాఖాన్, సురవరం ప్రతాపరెడ్డి తదితర తెలంగాణ సాయుధ పోరాటయోధులు, వారికి స్ఫూర్తినిచ్చే కవులు, రచయితలు మూలంగా 1948లో ఉధృత రూపం దాల్చి చివరికి భారత ప్రభుత్వం సైనిక చర్యతో నైజాం సంస్థానాన్ని 1948 సెప్టెంబర్ 18న భారత్ యూనియన్‌లో విలీనం చేసుకునే వరకు కొనసాగింది.

### నిజాం పాలనలో దురాగతాలు

బాంచన్ కాల్మొక్త అంటు బతుకులీడ్చిన ప్రజలు నిజాం పాలనపై ఎదురు తిరగడానికి అంతులేని దురాగతాలే కారణం. నిజాం పాలన చివరి దశలో మానవరక్తాన్ని తాగే రాకాసి మూకలైన రజాకారు దళాల దురాగతాలకు అంతు ఉండేదికాదు. రైతులు పండించిన పంటలకు కూడా వారికి దక్కనిచ్చేవారు కాదు. హిందూ మహిళలను నగ్నంగా బతుకమ్మ ఆడించేవారు. నిజాం పాలకులు ఉద్యమాలను ఆపడానికి ఉద్యమకారులను చిత్రహింసలకు గురిచేసేవారు. గోళ్ళ కింద గుండుసూదులు, బ్లేడ్లతో శరీరంపై కోసి గాయాలపై కారం పోసేవారు. సిగరెట్లతో కాల్చేవారు. బొటనవేళ్లకు తాళ్ళు కట్టి తలకిందులుగా వేలాడదీసేవారు. చెవులకు బరువులు కట్టడం, ఛాతీపై పెద్దబండలు పెట్టడ, కాగే నూనెలో వేళ్లు ముంచడం ఆనాడు సాధారణమైన శిక్షలు. ప్రజల వద్ద నుంచి ముక్కుపిండి పన్నులు వసూలు చేసేవారు. ధాన్యాలను బలవంతంగా లాక్కొనేవారు. ప్రజలు తిండిలేక అలమటిస్తే పట్టించుకొనేవారు కాదు. నిజాంచే ఉసిగొల్పిన రజాకార్లు విచ్చలవిడిగా గ్రామాలపై పడి ఇండ్లు తగలబెట్టి, అందినకాడికి దోచుకొనేవారు. ఈ భయంకర పరిస్థితిని చూసి వందేమాతరం రామచంద్రరావు ప్రధాని జవహర్ లాల్ నెహ్రూకు నిజాం దుర్మార్గాలపై లేఖ అందించాడు. తమ జల్సాలకు విలాస జీవితానికి సరిపోయే విధంగా 90 రకాల పన్నులు విధించడంతో ప్రజల బతుకు అధ్వాన్నమైంది. పన్నులు కట్టలేని పరిస్థితిలో గోళ్ళూడగొట్టారు. లెవీ కొలువకపోతే ఊరి మీద పడి రైతులు తినడానికి ఉంచుకున్న ధాన్యాన్ని దోచుకెళ్ళిన సంఘటనలనేకం. ఎదిరించినందుకు గాను బైరాన్‌పల్లిలో 108 మందిని కాల్చి చంపారు, నిర్మల్‌లో వెయ్యిమందిని ఉరితీశారు, గాలిపెల్లిని తగులబెట్టారు. ఇలాంటి సంఘటనలు కోకొల్లలు. శవాలను సైతం బూటుకాళ్ళతో తన్నిన నరహంతకులు, కిరాతకులు రజాకార్లు. నిజాం రాజుల దృష్టిలో ప్రజలంతా బాంచెలు (బానిసలు) సామాజికంగా వెట్టి అనే బానిసత్వ పద్ధతి అమల్లో ఉండింది. యార్‌జంగ్ నేతృత్వంలోని మజ్లిస్ ఇత్తెహాదుల్ బైనుల్ముస్లమీన్ సంస్థ బలవంతంగా హిందువులను ముస్లిం మతంలోకి మార్పిడి చేసేది. ఎదురు తిరిగిన వారిపై అరాచకంగా ప్రవర్తించేవారు. చెట్లకు కట్టేసి కింద మంటలు పెట్టేవారు, జనాన్ని వరసగా నిలబెట్టి తుపాకులతో కాల్చేవారు, బహిరంగంగా సామూహిక మానభంగాలు జరిపేవారు. దోపిడీ దృష్టి తప్ప స్థానిక ప్రజల పట్ల గౌరవం ఏమాత్రం ఉండేది కాదు. సంస్థాన ఉద్యోగాల్లో స్థానిక ప్రజల్ని పెట్టుకోకుండా ఉత్తర భారతం నుండి అపాకీలను రప్పించి నియమించారు. అన్ని దశల్లోను స్థానిక భాషలు, సంస్కృతులను నిర్దాక్షిణ్యంగా అణిచివేశారు. అరబ్బీ-అమృతం పారశీ-తేనె ఉర్దూ-కండశర్కర, తక్కిన భాషలన్నింటిని కాలికింది దుమ్ములా ఈసడించుకున్నారు. స్థానిక ఉర్దూను సైతం హీనంగా చూశారంటే తెలుగు పరిస్థితికి దిక్కులేదు. తుర్రేబాజ్ ఖాన్ , బందగి, షోయబుల్లాఖాన్ లాంటి అనేక మంది ముస్లింలు 1942 లో నిజాం నిరంకుశ పాలనలో షేక్ బందగి విస్నూర్ రాపాక రామచంద్రారెడ్డి అనే భూస్వామికి చెందిన గూండాలు హత్యచేశారు.

### ఆపరేషన్ పోలో

నిజాం సంస్థానంపై భారత ప్రభుత్వం జరిపిన సైనిక చర్యను ఆపరేషన్ పోలో అని పేరు పెట్టారు. జనరల్ జె.ఎన్.చౌదరి నేతృత్వంలో 1948 సెప్టెంబర్ 13న సైనిక చర్య మొదలైంది. సైన్యం రెండు భాగాలుగా విడిపోయి ఒకటి విజయవాడ నుంచి రెండవది బీదర్ దిశగా కదిలాయి. మొదటి రెండు రోజులు నిజాం సైన్యం తిరగబడినను ఆ తర్వాత బలం క్షీణించింది. తాను ఓటమి అంచుల్లో ఉన్నట్లు గమనించిన నిజాం నవాబు దిక్కుతోచని స్థితిలో లేక్‌వ్యూ అతిథి గృహంలో బంధించిన భారత ఏజెంట్ మున్షీని కలిసి లొంగిపోతున్నట్లు ప్రకటించాడు. దీనితో ఆపరేషన్ పోలో విజయవంతమైంది. సెప్టెంబర్ 13న జె.ఎన్.చౌదరి నాయకత్వాన ప్రారంభమైన దాడి సెప్టెంబర్ 17న నిజాం నవాబు లొంగిపోవడంతో పూర్తయింది. సెప్టెంబర్ 18న సైనిక చర్యకు నేతృత్వం వహించిన జె.ఎన్.చౌదరి సైనిక గవర్నర్‌గా పదవీ ప్రమాణం చేశాడు. ఎం.కె.వెల్లోడి ముఖ్యమంత్రిగా నియమించబడ్డాడు.

### సర్దార్ పటేల్ పాత్ర

సైనిక చర్య విజయవంతం కావడానికి అప్పటి భారత హోంశాఖా మంత్రి సర్దార్ పటేల్ కృషి ఎంతో ఉంది. సర్దార్ వల్లభ్ భాయిపటేల్ రాజకీయ చతురతతో పోలీసు చర్య జరిపి నిజాం పాలనకు చరమగీతం పలికాడు. హైదరాబాదును ప్రత్యేక దేశంగా ఉంచాలని కనీసం పాకిస్తాన్‌లోనైన విలీనం చేయాలని విశ్వప్రయత్నం చేసిన నిజాం పన్నాగాలను పటేల్ బద్దలు కొట్టాడు. నిజాం ఐక్యరాజ్యసమితికి భారతదేశంపై ఫిర్యాదు చేయడానికి దూతలను కూడా పంపాడు. భారతదేశంపై పోరాటానికి విదేశాల నుంచి ఆయుధ దిగుమతికి ప్రయత్నాలు చేశాడు. అయినను అతని ఆటలు, నిజాం ప్రధాని లాయక్ అలీ నాటకాలు పటేల్ ఎదుట పనిచేయలేదు. పోలీసు చర్యలో భాగంగా నలువైపులా నుంచి వస్తున్న భారత బలగాలను చూసి నిజాం కింగ్‌కోఠి నుంచి బయటకు వచ్చి భారత ప్రతినిధి కె.ఎం.మున్షీని కలిశాడు. అప్పటికే సమాచార సాధనాలు తెగిపోవడంతో ఎటు అర్థంకాక కాళ్ళబేరానికి దిగాడు. లొంగుబాటుకు మించిన తరుణోపాయం లేదని మున్షీ చెప్పడంతో నిజాం ఒప్పుకోకతప్పలేదు. బొల్లారం వద్ద నిజాం నవాబు సర్దార్ పటేల్ ఎదుట తలవంచి లొంగిపోవడంతో 1948 సెప్టెంబరు 17న హైదరాబాదు రాజ్యం భారత యూనియన్‌లో విలీనమైంది. అప్పుడు ఇక్కడి ప్రజలకు అసలైన స్వాతంత్ర్యం లభించింది. నిజాం ప్రధాని లాయక్ అలీని తొలిగించడమే కాకుండా ప్రజలకు నరకయాతన చూపించిన ఖాసిం రజ్వీని అరెస్టు చేశారు. ఆ తర్వాత హైదరాబాదు శాసనసభ రద్దు చేయబడింది. హైదరాబాదు రోడ్ల మీద ఇక తలెత్తుకు తిరగలేమని భావించిన లాయక్అలీ, ఖాసింరజ్వీలు మూటాముల్లెలు సర్దుకొని పాకిస్తాన్ పారిపోయారు.

### ఉద్యమ స్ఫూర్తి ప్రధాతలు

తెలంగాణ సాయుధ పోరాటంలో పురుషులు, స్త్రీలు, పిల్లలు అనే తేడాలు లేకుండా తుపాకులు, బడిసెలు పట్టి రజాకార్ల మూకలను తరిమికొట్టారు. మహబూబునగర్ జిల్లాలో అప్పంపల్లి, ఆదిలాబాదు జిల్లాలో నిర్మల్, సిర్పూర్, కరీంనగర్ జిల్లాలో మంథని, మహమ్మదాపూర్, నల్గొండ జిల్లాలో మల్లారెడ్డి గూడెం, నిజామాబాదు జిల్లాలో ఇందూరు, తదితర ప్రాంతాలలో పోరాటం పెద్ద ఎత్తున సాగింది. కొంపల్లికి చెందిన సుందరి, యశోధా బాయి,అహల్యా బాయి, సార్జుబాయి, ఎన్. సత్యవతి, కుమారిరాజం, జమలాపురం కేశవరావు, లక్ష్మీ నరసయ్య, ఆరుట్ల కమలాదేవి, రావి నారాయణరెడ్డి, ధర్మభిక్షం, చంద్ర రాజేశ్వరరావు, బద్దం ఎల్లారెడ్డి, మగ్దూం మొహియుద్దీన్, షోయబ్ ఉల్లాఖాన్, మల్లు స్వరాజ్యం రాంజీ గోండ్, విశ్వనాథ్ సూరి, దొడ్డి కొమరయ్య, బెల్లం నాగయ్య, కిషన్ మోదాని తదితరులు తెలంగాణ విమోచనానికి కృషిచేశారు. వీరందరి కృషి, దాశరథి, కాళోజీల కవితల స్ఫూర్తితో సామాన్య ప్రజలు సైతం ఊరూరున, వాడవాడల నిజాం పాలనపై తిరగబడ్డారు. కర్రలు, బరిసెలు, గుత్పలు, కారంముంతలు, వడిసెలను ఆయుధాలుగా మలుచుకొని పోరాడారు.

# అక్రమ షెడ్ల నిర్మాణానికి
# మున్సిపల్ అధికారుల అండ

- నాగారం మున్సిపల్ పరిధిలో జోరుగా అక్రమ షెడ్ల నిర్మాణం పట్టించుకోని అధికారులు
- అక్రమ నిర్మాణాలతో ప్రభుత్వానికి భారీ నష్టం
- అధికారుల పర్యవేక్షణ లేకపోవడంతో అక్రమ నిర్మాణాల జోరు
- నాగారంలో అక్రమ నిర్మాణాలపై విజిలెన్స్ అధికారులు పట్టించుకోరా.?





నాగారం(ప్రశ్న న్యూస్) నాగారం మున్సిపల్ పరిధిలో అక్రమంగా షెడ్ల నిర్మాణం ఎక్కడపడితే అక్కడ చేస్తుంటే ఎలాంటి అనుమతులు లేకుండా షెడ్ల నిర్మాణం జరుగుతుంటే అధికారులు మాత్రం చర్యలు తీసుకోకుండా చోద్యం చూస్తున్నారని స్థానికులు అగ్రహారం వ్యక్తం చేస్తున్నారు. వివరాల్లోకి వెళితే నాగారం మున్సిపల్ పరిధిలో అక్రమంగా ఎలాంటి అనుమతులు లేకుండా భారీ షెడ్లు నిర్మాణం చేస్తున్నారని, ప్రభుత్వానికి ఎలాంటి రుసుము చెల్లించకుండా అధికారులకు సిబ్బందికి లంచాలు ఇచ్చి అక్రమ నిర్మాణాలు చేస్తున్నారని, ఈ అక్రమ నిర్మాణాల వలన ప్రభుత్వ ఖజానాకు భారీ నష్టం వాటిల్లుతుందని, ప్రభుత్వం ఇప్పటికే అప్పుల్లో ఊరికి పోయింది కానీ అధికారులు మాత్రం లంచాలు తీసుకొని కోట్లకు పడగలెత్తుతున్నారు. దీనితో అధికారులు మాత్రం నిమ్మకు నీరెక్కినట్లు వ్యవహరిస్తున్నారని ప్రభుత్వానికి రావలసిన ఆదాయాన్ని రాకుండా చేస్తున్నారని తమ జేబులు నింపుకుంటున్నారు తప్ప ప్రభుత్వానికి రావాల్సిన ఆదాయాన్ని సమకూర్చలేకపోతున్నారని స్థానికులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ అక్రమ నిర్మాణాల వలన మున్సిపల్ ఆదాయం రోజురోజుకు తగ్గుతుందని మున్సిపల్ శాఖపై విజిలెన్స్ అధికారులు దృష్టి సారించాలని లేనట్లయితే ప్రభుత్వానికి భారీగా నష్టం వాటిల్లుతుందని పాలకవర్గం లేకపోవడంతో అధికారులు ఆడిందే ఆట పాడిందే పాట లాగా సాగుతుందని దీనిపై విజిలెన్స్, ఉన్నత అధికారులు వెంటనే దృష్టి సారించి చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరారు. భారీ అక్రమ నిర్మాణ షెడ్ల వలన ఏదైనా ప్రమాదం ఆస్తి నష్టం ప్రాణానష్టానికి ఎవరు బాధ్యత వహిస్తారని స్థానికులు కమిషనర్ కు ఫిర్యాదు చేసిన అసలు పట్టించుకోకపోవడం వెనక ఆర్థిక లావాదేవీలే కారణమని స్థానికులు ఆరోపిస్తున్నారు.ఏసీ కారులు ఏసీ గదులు లక్షల జీతాలు తీసుకుంటున్న అధికారులు ప్రభుత్వానికి ఆదాయం వచ్చేలా చర్యలు తీసుకోవడంలో నిర్లక్ష్యం వహిస్తున్నారని దీనిపై మున్సిపల్ ఉన్నతాధికారులు దృష్టి సారించాలని వెంటనే అక్రమ షెడ్ నిర్మాణ పనులు ఆపాలని స్థానికులు కోరారు.

# విద్యార్థులు క్రీడల్లో రాణించాలి

## మండల విద్యాశాఖ అధికారిణి శైలజా

**-ఓజిలి హైస్కూల్లో అలరించిన.. మండలస్థాయి క్రీడాపోటీలు**

**-వ్యాయామ ఉపాధ్యాయులు (పిడి) హరిబాబు ఆధ్వర్యంలో ఘనంగా క్రీడ పోటీలు**





**ఓజిలి ( ప్రశ్న న్యూస్** విద్యార్థులు క్రీడల్లో రాణించాలని విద్యార్థులు విద్యతో పాటు క్రీడాపోటీ ల్లో రాణించాలని మండల విద్యాశాఖ అధికారిణి శైలజా విద్యార్థిని విద్యార్థులకు తెలియజేశారు.ఓజిలి మండలం వ్యాప్తంగా జరుగుతున్న క్రీడల్లో భాగంగా ఓజిలి మండల స్థాయి క్రీడా పోటీలను వ్యాయామ ఉపాధ్యాయులు (పిడి) హరిబాబు ఆధ్వర్యంలో మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా మండల విద్యాశాఖ అధికారిణి శైలజా, మండల విద్యాశాఖ అధికారి (2) చంద్రశేఖర్ , ప్రధానోపాధ్యాయురాలు శారద పాల్గొన్నారు. వారికి వ్యాయామ ఉపాధ్యాయులు (పిడి) హరిబాబు, ఉపాధ్యాయిని ఉపాధ్యాయులు ఘన స్వాగతం పలికారు.కబడ్డీ, ఖోఖో, వాలీబాల్, టెన్నికాయిట్తో పాటు పలు విభాగాల్లో మండల స్థాయిలో క్రీడలు నిర్వహించారు. ఓజిలి, కురుగొండ, పలు పాఠశాలల విద్యార్థులు ఈ క్రీడల్లో ఉత్సాహంగా పాల్గొన్నారు. విద్యార్థిని విద్యార్థులను ఉద్దేశించి మండల విద్యాశాఖ అధికారిణి శైలజా విద్యార్థిని విద్యార్థులను ఉద్దేశించిమాట్లాడుతూ క్రీడల్లో పాల్గొనడం వలన మానసిక ఉత్తేజం కలిగి జీవితంలో క్రమశిక్షణతో మెలిగి ఉంటారన్నారు.క్రీడలతో మనస్సుకు ఉల్లాసం కలుగుతుందని తెలిపారు.క్రీడల్లో విద్యార్థులు పాఠశాలతో పాటు, గ్రామానికి, జిల్లాకు పేరు ప్రఖ్యాతలు తేవాలన్నారు.

**- విద్యార్థులు విద్యతో పాటు క్రీడల్లో రాణించాలి: ఎంఈఓ చంద్రశేఖర్**

విద్యార్థిని విద్యార్థులు విద్యతో పాటు క్రీడల్లో రాణించాలని విద్యార్థులను విద్యతోపాటు క్రీడలలో తీర్చిదిద్దుతున్న వ్యాయామ ఉపాధ్యాయులు పిడి హరిబాబు ను ప్రత్యేకంగా అభినందించారు.క్రీడల్లో విద్యార్థులు పాఠశాలతో పాటు, గ్రామానికి, జిల్లాకు పేరు ప్రఖ్యాతలు తేవాలన్నారు. విద్యార్థులు తెలుగు భాషలో పట్టు సాధించడంతోపాటు క్రీడలలో రాణించాలని పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు శారద సూచించారు.

**- చదువుతో పాటు క్రీడల్లో రాణించాలి: పిడి హరిబాబు**

చదువుతో పాటు క్రీడల్లో రాణించాలని వ్యాయామ ఉపాధ్యాయులు పిడి హరిబాబు విద్యార్థులకు తెలియజేశారు.దేశం గర్వించదగ్గ పౌరులుగా ఎదగాలని సూచించారు.విద్యార్థులు క్రీడల్లో రాణించాలి చదువుతోపాటు అన్ని రకాల ఆటల్లో పాల్గొని ఆరోగ్యంగా ఉండాలని తల్లిదండ్రులు, గురువులు,స్కూల్ , గ్రామం, మండలం, జిల్లా, రాష్ట్రం,దేశం గర్వించదగ్గ పౌరులుగా ఎదగాలని ఆకాంక్షించారు.క్రీడల్లో పాల్గొనేవారు ఆరోగ్యంగా ఉంటారని, యువత చదువుతో పాటు క్రీడలు, క్రమశిక్షణ, మంచి అలవాట్లను ఎంచుకోవాల పిడి హరిబాబు విద్యార్థులకు తెలియజేశారు.ఈ కార్యక్రమంలో ఎంఈఓ శైలజా, మండలవిద్యాశాఖ అధికారి 2చంద్రశేఖర్, ప్రధానోపాధ్యాయురాలు శారద, వ్యాయామ ఉపాధ్యాయులు పిడి హరిబాబు, మురుగేశరి, చెంచయ్య, మురళి కృష్ణ, సుబ్బారావు,రవి కుమార్, చిన్న చెంచయ్య, పరంధామయ్య, విద్యార్థిని విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

## ఈనెల 18 న వేములవాడ రాజన్న హుండీ లెక్కింపు

**- రాజన్నాలయ ఈఓ : రమాదేవి**



**వేములవాడ (ప్రశ్న )** వేములవాడ శ్రీ రాజరాజేశ్వర స్వామివారి హుండీలను ఈనెల 18 న ఉదయం 8 గంటలకు విప్పి,హుండీ ఆదాయాన్ని లెక్కించనున్నట్లు ఆలయ ఈఓ రమాదేవి మంగళవారం విడుదల చేసిన ఒక ప్రకటనలో పేర్కొన్నారు.

## తాటిపల్లి దుర్గాదేవి నూతన కార్యవర్గం



**జగిత్యాల జిల్లా(ప్రశ్న న్యూస్)** జగిత్యాల రూరల్ మండలంలోని తాటిపల్లి గ్రామంలోని హనుమాన్ మందిరం వద్ద సమావేశం నిర్వహించి కనక దుర్గాదేవి నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారని ఒక ప్రకటనలో తెలిపారు.అధ్యక్షులుగా పుదారి శ్రీనివాస్, ఉపాధ్యక్షులుగా పూదరి మహేష్, భక్కశెట్టి అభిలాష్ కోశాధికారిగా ఉంద్రాళ్ళ కిషన్, చొప్పరి రాజేందర్,సహాయ కార్య దర్శిగా ఉరుగొండ శ్రీరామ్, బోలిశెట్టి గంగారెడ్డి, బోలిశెట్టి మహేష్, కార్యవర్గ సభ్యులుగా ముత్యాల మల్లేష్, ఆకుల కిరణ్, ఆకుల నరేష్, సుందరగిరి రాజు, భక్కశెట్టి నాగరాజు, సాయి కృష్ణ,అక్షయ్, ప్రవీణ్, రాజు ఎన్నికయ్యారు, వివిధ కుల సంఘాల ప్రతినిధులు కార్యవర్గ సభ్యులుగా ఎన్నుకోబడ్డారని తెలిపారు.

## నేడు రాజన్నాలయంలో ప్రత్యేక పూజలతో మోదీ జన్మదిన వేడుకలు ఆరంభం

- నేటి నుండే సేవాపక్షం కార్యక్రమాలు షురూ
- భాజపా రాష్ట్ర నాయకులు : ప్రతాప రామకృష్ణ
- మోదీకి శుభాకాంక్షలు తెలుపుతూ సేవా కార్యక్రమాల్లో పాల్గొనాలి
- భాజపా పట్టణాధ్యక్షులు : రాపెల్లి శ్రీధర్ పిలుపు
- మోదీ జన్మదిన వేడుకలకు బీజేపీ సిద్ధం



**వేములవాడ (ప్రశ్న న్యూస్)** ప్రధాని నరేంద్ర మోడీ జన్మదిన వేడుకలను పురస్కరించుకొని రాష్ట్ర వ్యాప్తంగా అంగరంగ వైభవంగా కార్యక్రమాలు నిర్వహించేందుకు భారతీయ జనతా పార్టీ సిద్ధమైంది.నేటి సెప్టెంబర్ 17 నుంచి రెండు వారాల పాటు సేవా పక్షం కార్యక్రమాలను నిర్వహించనున్నట్లు పార్టీ రాష్ట్ర నాయకులు ప్రతాప రామకృష్ణ తెలిపారు.

నేడు రాజన్న ఆలయంలో ప్రత్యేక పూజలు,అన్నదాన సేవా కార్యక్రమాలతో వేడుకలు ప్రారంభమవుతాయని ఆయన వెల్లడించారు. ఈ సందర్భంగా భాజపా పట్టణ అధ్యక్షులు రాపెల్లి శ్రీధర్ మాట్లాడుతూ, “మోదీకి శుభాకాంక్షలు తెలపడంతో పాటు సేవా కార్యక్రమాల్లో భాజపా శ్రేణులు చురుకుగా పాల్గొని వేడుకలను విజయవంతం చేయాలి” అని పిలుపునిచ్చారు.

ఈ కార్యక్రమంలో నాయకులు పిన్నింటి హన్మాండ్లు, బిల్ల కృష్ణహరి,రేగుల రాజకుమార్, గుడిసె మనోజ్,వివేక్ రెడ్డి, జవ్వాజి రాజశేఖర్,కట్కం శ్రీనివాస్,కోలా దన్ను,అన్నం నర్సయ్య,నేరెళ్ల సాయి,బుర్ర మనీష్,మెరుగు లక్ష్మీరాజం, తిరుపతి,తదితరులు పాల్గొన్నారు.

## గ్రూప్ వన్ పరీక్షలు తక్షణమే రద్దు చేయాలి




**తార్నాక(ప్రశ్న న్యూస్)** గ్రూప్ వన్ అంశం పై ఐక్య విద్యార్థి సంఘాలతో సమావేశం ఏర్పాటు చేసిన నేపథ్యంలో సుందరయ్య విజ్ఞాన కేంద్రానికి విద్యార్థి సంఘాల నేతలు చేరుకోగానే పోలీసులు ముందస్తుగా విద్యార్థి నేతలను పోలీసులు అరెస్ట్ చేశారు. అరెస్టైన వారిలో బిఆర్ఎస్వి రాష్ట్ర కార్యదర్శి జంగయ్యను గాంధీ నగర్ పోలీస్ స్టేషన్ కు తరలించారు. ఈ సందర్భంగా జంగయ్య మాట్లాడతూ%ౌ%గతం ప్రభుత్వంలో టీఎస్పీఎస్సీ పేపర్ లీక్ అయినప్పుడు ప్రభుత్వమే చొరవ తీసుకొని పరీక్షలను రద్దుచేసి అవకతవకలపై విచారణ జరిపి బాద్యులను శిక్షించారని గుర్తు చేశారు. కానీ నేటి ఈ కాంగ్రెస్ ప్రభుత్వం జీవో 55 రీవోక్ చేస్తూ జీవో 29 ద్వారా నియామకాలు చేసి బలహీన వర్గాలైనటువంటి ఎస్సీ, ఎస్టీ, బీసీ మైనార్టీ వర్గాలకు రిజర్వేషన్లలో అన్యాయం చేస్తున్నారన్నారు. ప్రశ్నిస్తున్న వారిపై ప్రభుత్వం జరుగుతుందని నిరసనలు అక్రమ కేసులు పెట్టి భయభ్రాంతులకు గురిచేస్తుందని ఆగ్రహం వ్యక్తం చేశారు. పరీక్ష నిర్వహణలో పేపర్ మూల్యాంకనంలో లోపాలు ఉన్నాయని కోర్టుకు వెళ్తే ధర్మాసనం ఇచ్చినటువంటి తీర్పు ప్రభుత్వానికి చెంపపెట్టు అన్నారు. హైకోర్టు తీర్పుతో తప్పులు తడకలుగా గ్రూప్-1ఉద్యోగ నియామక ప్రక్రియ జరిగినట్టుగా తేటతెల్లమైందన్నారు. ఈ లోపాలు అన్నింటికీ నైతిక బాధ్యత వహిస్తూ రాష్ట్ర ముఖ్యమంత్రి వెంటనే రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు.ప్రభుత్వానికి చిత్తశుద్ధి ఉంటే అడిగే వారిని అరెస్టులు చేయడం కాదు గ్రూప్ -1పరీక్షల్లో అవకతవకలకు పాల్పడ్డ వారిపై కఠిన చర్యలు తీసుకోవాలన్నారు. గ్రూప్ వన్ పరీక్షను రద్దు చేసి తక్షణమే నోటిఫికేషన్ విడుదల చేయాలని, హైకోర్టు చెప్పినట్టుగా అవకతవకలపై సిట్టింగ్ జడ్జితో జ్యూడిషియల్ కమిషన్ ఏర్పాటు చేసి పూర్తి స్థాయి విచారణ చేయాలని జంగయ్య డిమాండ్ చేశారు.ప్రభుత్వం స్పందించకపోతే తప్పదు గ్రూప్ -1 అభ్యర్థులకు న్యాయం జరిగేంత వరకు బిఆర్ఎస్వి ఆధ్వర్యంలో పోరాటం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్వి నాయకులు ప్రశాంత్, నిశాంత్, ప్రసాద్ నేత, విశాల్, నవీన్, రెహమాన్, సాయి తదితరులు అరెస్టైన వారిలో ఉన్నారు.

## ఎమ్మెల్యే డా.నెలవల విజయశ్రీ ని సన్మానించిన వ్యవసాయ శాఖ సంఘం డైరెక్టర్ పెళ్లకూరు గోపాలకృష్ణ



**నెల్లూరు బ్యూరో (ప్రశ్న న్యూస్)** సూళ్లూరుపేట ఎమ్మెల్యే డాక్టర్ నెలవల విజయశ్రీని వ్యవసాయ శాఖ సంఘం డైరెక్టర్ పెళ్లకూరు గోపాలకృష్ణ ఘనంగా సన్మానించారు.మంగళవారం నాయుడుపేట పట్టణంలోని శ్రీనివాస కళ్యాణ మండపంలో సూళ్లూరుపేట నియోజకవర్గంలోని సహకార సంఘాల చైర్మన్లు డైరెక్టర్ల ప్రమాణ స్వీకార మహోత్సవం జరిగింది.ఈ కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా పాల్గొన్న ఎమ్మెల్యే డాక్టర్ నెలవల విజయశ్రీ , మాజీ ఎంపీ సూళ్లూరుపేట నియోజకవర్గం ఇంచార్జ్ నెలవల సుబ్రహ్మణ్యం కి శాలువా కప్పి ఘనంగా సన్మానించారు.రైతుల సంక్షేమానికి కృషి చేస్తానని నూతనంగా ఎన్నికైన వ్యవసాయ శాఖ సంఘం డైరెక్టర్ పెళ్లకూరు గోపాలకృష్ణ సూళ్లూరుపేట ఎమ్మెల్యే డాక్టర్ నెలవల విజయశ్రీ, మాజీ ఎంపీ సూళ్లూరుపేట నియోజకవర్గం ఇంచార్జ్ నెలవల సుబ్రహ్మణ్యం ఆధ్వర్యంలో శుక్రవారం ప్రమాణస్వీకారం చేశారు.ఈ సందర్భంగా ఆయన ప్రమాణస్వీకారం చేస్తూ రైతులకు అండగా ఉంటానని అందుబాటులో ఉంటూ ప్రజలకు సేవ చేస్తానని పేర్కొన్నారు. అనంతం వారి ఆశీర్వాదం తీసుకున్నారు. ఈ అవకాశాన్ని కల్పించిన సీఎం నారా చంద్రబాబునాయుడు కి, సూళ్లూరుపేట ఎమ్మెల్యే డాక్టర్ నెలవల విజయశ్రీ కి, మాజీ ఎంపీ సూళ్లూరుపేట నియోజకవర్గం ఇంచార్జ్ నెలవల సుబ్రహ్మణ్యం కి ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు.

# రోడ్డు ప్రమాదంలో ఒకరు మృతి

జడ్చర్ల, : మంగళవారం మధ్యాహ్నం జడ్చర్ల నియోజకవర్గంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒకరు మృతి చెందారు. మహబూబ్ నగర్ జిల్లా మిడ్జిల్ మండలం కొత్తపల్లి గ్రామ శివారులో 167 హైవేపై చిల్వర్ గ్రామానికి చెందిన రాములు తన బైక్‌పై వెళ్తూ ఆగి ఉన్న బొలెరో వాహనాన్ని ఢీకొనడంతో ఈ దుర్ఘటన చోటుచేసుకుంది. ఈ ప్రమాదంలో రాములు అక్కడికక్కడే మరణించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం కోసం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. పూర్తి వివరాలు ఇంకా తెలియాల్సి ఉంది.

## మన్నెంకొండ ఆలయంలో అగ్నిగుండ కార్యక్రమం, భక్తుల భక్తి ప్రదర్శన



మహబూబ్‌నగర్, : మహబూబ్ నగర్ జిల్లాలోని మన్నెంకొండ శ్రీ లక్ష్మీ వెంకటేశ్వర స్వామి ఆలయంలో మంగళవారం తెల్లవారుజామున అగ్నిగుండ కార్యక్రమం భక్తిశ్రద్ధలతో జరిగింది. వీరభద్ర స్వామికి పంచామృత అభిషేకాలు, ప్రత్యేక పూజలు నిర్వహించిన అనంతరం అగ్నిగుండం ఏర్పాటు చేశారు. భక్తులు జయజయ ధ్వానాలతో అగ్నిగుండంలో నడిచి తమ భక్తిని చాటుకున్నారు. ఈ కార్యక్రమంలో ఆలయ అర్చకులు, దేవరకద్ర ఆర్యవైశ్య సంఘ సభ్యులు పాల్గొన్నారు.

# పాలమూరులో నడిబొడ్డున దారుణం

దేవరకద్ర, : మహబూబ్‌నగర్ జిల్లా పాలమూరులో వారసత్వ భూమిని ఆన్‌లైన్ చేయకపోవడంతో శంకర్ అనే వ్యక్తి భార్య, ముగ్గురు పిల్లలతో కలిసి పెట్రోల్ పోసుకుని ఆత్మహత్యాయత్నం చేశాడు. స్థానికులు వెంటనే స్పందించడంతో ప్రాణాపాయం తప్పింది. అయితే అతని ఆటో మంటల్లో కాలిపోయింది. ఎంఆర్ఓ, ఆర్ఐలపై చర్యలు తీసుకోవాలని ఆర్డీఓ ఆదేశించగా, బాధితుడికి కొత్త ఆటో, భూమిని ఆన్‌లైన్ చేస్తామంటూ హామీ ఇచ్చారు.

# బీజేపీ తెలంగాణ రైతాంగ పోరాట చరిత్రను వక్రీకరిస్తోంది

కల్వకుర్తి,: తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట చరిత్రను వక్రీకరించి, ప్రజల మధ్య చీలికలు తెస్తున్న బీజేపీ విధానాలను తిప్పి కొడతామని సీపీఐ కల్వకుర్తి నియోజకవర్గ ఇంచార్జ్ పరుశురాం, ఊర్కోండ మండల కార్యదర్శి దార దాసు తెలిపారు. మంగళవారం ఊర్కోండ మండలలో తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట వారోత్సవాలను నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, హైదరాబాద్ సంస్థానంలో వెట్టి చాకిరీ, భావ వ్యక్తీకరణపై ఆంక్షలు, తెలుగు భాషపై అణచివేత వంటి నిరంకుశ ధోరణులు కొనసాగాయని, తెలుగు భాషా సంస్కృతులను రక్షించేందుకు 1946 నుంచి 1951 వరకు రైతులు, ప్రజలు నైజాం పాలనకు వ్యతిరేకంగా పోరాడారని తెలిపారు.

# 60 ఏండ్ల వ్యక్తికి 24 ఏండ్ల జైలు శిక్ష

నల్లగొండ,: నల్లగొండ పోక్సో కోర్టు పదేండ్ల బాలికపై అత్యాచారం కేసులో సంచలనం తీర్పు వెలువరించింది. దోషి మర్రి ఊషయ్యకు 24 ఏళ్ల కఠిన జైలు శిక్షతో పాటు రూ. 40 వేల జరిమానా విధించింది. బాధితురాలికి రూ. 10 లక్షల పరిహారం చెల్లించాలని పోక్సో కోర్టు ఇన్‌చార్జ్ జడ్జి రోజా రమణి ఆదేశించారు. 2023, మార్చి 28న నల్లగొండ మండలం అన్నెపర్తికి చెందిన మర్రి ఊషయ్య (60) 4వ తరగతి చదువుతున్న 10 ఏళ్ల మైనర్ బాలికపై ఈ అఘాయిత్యానికి పాల్పడినట్లు కేసు నమోదైంది.

## ప్రభుత్వ రంగ సంస్థల పరిరక్షణకై ఉద్యమించాలి

మిర్యాలగూడ, : ప్రభుత్వ రంగ సంస్థల ప్రైవేటీకరణ విధానాలను మానుకోవాలని, ఆర్టీసీ పరిరక్షణకు చర్యలు తీసుకోవాలని ఆర్టీసీ స్టాఫ్ అండ్ వర్కర్స్ ఫెడరేషన్ (సీఐటీయూ) నల్గొండ డిపో గౌరవాధ్యక్షులు దండెంపల్లి సత్తయ్య అన్నారు. మంగళవారం ఆర్టీసీ స్టాఫ్ అండ్ వర్కర్స్ ఫెడరేషన్ 46వ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా డిపో కార్యదర్శి ఎస్కె గులాం రసూల్ యూనియన్ జెండాను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా సత్తయ్య మాట్లాడుతూ, ఐక్య పోరాటాల స్ఫూర్తితో 1979 సెప్టెంబర్ 16న ఆర్టీసీ స్టాఫ్ అండ్ వర్కర్స్ ఫెడరేషన్ ఏర్పడిందని తెలిపారు.

# సర్వే చేసి డీపీఆర్ సిద్ధం చేయండి

మునుగోడు, : మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి మంగళవారం హైదరాబాద్‌లోని తన నివాసంలో శివన్నగూడెం రిజర్వాయర్ పనులపై ఇరిగేషన్ శాఖ అధికారులతో, రిటైర్డ్ ఇంజనీర్ల ఫోరం సభ్యులతో సమీక్ష నిర్వహించారు. రిజర్వాయర్ పనులు 80 శాతం పూర్తయినప్పటికీ, డిస్ట్రిబ్యూషన్ నెట్వర్క్ పనులు ప్రారంభం కాలేదని ఆయన అసంతృప్తి వ్యక్తం చేశారు. వెంటనే డిస్ట్రిబ్యూషన్ నెట్వర్క్ పై సర్వే చేసి, డిపిఆర్ సిద్ధం చేయాలని అధికారులను ఆదేశించారు.

# నల్గొండలో యూరియా కష్టాలు..

## రైతుల పడిగాపులు, ఆందోళనలు

మునుగోడు, : నల్గొండ జిల్లాలో యూరియా కొరత తీవ్రంగా ఉంది. పీఏసీఎస్, ఆగ్రోస్ కేంద్రాల వద్ద రైతులు గంటల తరబడి వేచి చూస్తున్నారు. అక్కడక్కడా ఆందోళనలు కూడా చేస్తున్నారు. నెలాఖరు వరకు ఇదే పరిస్థితి కొనసాగే అవకాశం ఉంది. జిల్లాకు 80 మెట్రిక్ టన్నుల యూరియా అవసరం ఉండగా, అధికారులు 70 మెట్రిక్ టన్నులు కావాలని నివేదించినట్లు సమాచారం. ఇప్పటివరకు 60 వేల మెట్రిక్ టన్నుల యూరియా పంపిణీ చేసినట్లు గణాంకాలు తెలుపుతున్నాయి.

## కోరుట్లలో శరన్నవరాత్రోత్సవ కరపత్రం ఆవిష్కరణ



ఆర్మూర్, : జగిత్యాల జిల్లా కోరుట్ల పట్టణంలో గణేశ నవదుర్గా మండలి త్రిశక్తి ఆలయ సేవా సమితి ఆధ్వర్యంలో దుర్గా శరన్నవరాత్రోత్సవ కరపత్రం ఆవిష్కరించారు. ఈ ఉత్సవాలు 22-09-2025న ప్రారంభమై 02-10-2025న ముగుస్తాయి. 26-09-2025న పంచమి బోనాలు, లక్ష గాజుల అర్చన, సరస్వతి పూజ సందర్భంగా సామూహిక అక్షయభ్యాసాలు, దుర్గాష్టమి సందర్భంగా చండి భవనం, లక్ష పుష్పార్చన, అన్నదాన కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. భక్తులు నవరాత్రులను విజయవంతం చేయాలని కోరారు.

# కొత్త సంవత్సరానికి క్వాంటమ్ వ్యాలీ రెడీ

## - 3డీ ప్రింటింగ్‌తో నిర్మించనున్న భవనాలు, డిజైన్లు విడుదల




**అమరావతి (ప్రశ్న న్యూస్)** ఆంధ్ర రాజధాని అమరావతి మరో ముఖ్యమైన మైలురాయిని చేరుకోబోతోంది. అమరావతిలో క్వాంటమ్ వ్యాలీకి ఇంతకు ముందే పచ్చజెండా ఊపేసిన ప్రభుత్వం 2026 జనవరి నాటికే కార్యకాలాపాలు ప్రారంభించాలన్న లక్ష్యంతో ముందుకు వెళుతోంది. ఇంకా కేవలం కొన్ని నెలలు మాత్రమే ఉన్న సమయంలో కొత్త భవనాలు ఎలా సమకూరుస్తారు అన్న అనుమానాలు వ్యక్తమవుతున్నా నాలుగు నెలల్లోనే పనులు పూర్తి చేస్తామని ప్రభుత్వం చెబుతోంది. అంత తక్కువ టైమ్ లో బిల్డింగ్‌లు ఎలా పూర్తి చేస్తారన్నదానికి సమాధానం 3డీ ప్రింటింగ్. అవును క్వాంటమ్ వ్యాలీ భవనాన్ని 3డీ ప్రింటింగ్ టెక్నాలజీతో నిర్మించబోతున్నట్లు ప్రభుత్వ వర్గాల సమాచారం. టెక్నాలజీ విషయంలో ఎప్పుడూ ఒకడుగు ముందే ఉండే చంద్రబాబు దేశంలోనే తొలి క్వాంటమ్ వ్యాలీని ఆవిష్కరించనున్నారు. నేషనల్ క్వాంటమ్ మిషన్‌కు అనుసంధానంగా ఇండియాలోని మొదటి క్వాంటమ్ కంప్యూటర్ అమరావతిలో రాబోతోంది. దీనికోసం ఇప్పటికే అమరావతిలో ఇప్పటికే 50 ఎకరాల స్థలాన్ని కూడా కేటాయించారు.సిలికాన్ వ్యాలీ తరహాలో ఈ క్వాంటమ్ వ్యాలీని అభివృద్ధి చేస్తారు. ఐబీఎం, టీసీఎస్, ఐఐటీ మద్రాస్, ఎల్%ఠ%టీ వంటి సంస్థలు ఈ ప్రాజెక్టులో భాగం కాబోతున్నాయి. అమరావతిలో జరుగుతున్న కలెక్టర్ల సదస్సులో క్వాంటమ్ వ్యాలీ డిజైన్లను విడుదల చేశారు చంద్రబాబు. ఐఐటీ మద్రాస్ రూపొందించిన ఈ డిజైన్లకు ఆమోదం తెలిపారు. అయితే ప్రాథమికంగా కార్యకలాపాలు ప్రారంభించడానికి ఓ భవనాన్ని కేవలం 120 రోజుల్లో సిద్ధం చేయించనున్నట్లు సమాచారం.

**- క్వాంటమ్ వ్యాలీ రోడ్‌మ్యాప్.. (2025-2030)**

మొదటి దశ (2025-27): ఈ కాలంలో మౌలిక సదుపాయాల కల్పనపై ప్రధానంగా దృష్టి పెడతారు. అమరావతిని క్వాంటమ్ టెక్నాలజీకి అనువైన కేంద్రంగా తీర్చిదిద్దడానికి అవసరమైన అన్ని ఏర్పాట్లు చేస్తారు. రెండవ దశ (2027- 30):ఈ దశలో, అమరావతిని క్వాంటమ్ రంగంలో ప్రపంచ అగ్రగామిగా, ఎగుమతుల కేంద్రంగా తీర్చిదిద్దడం లక్ష్యం.
అమరావతి క్వాంటమ్ క్యాపిటల్ కౌన్సిల్ (ఏక్యూసీసీ) ఏర్పాటు చేశారు.
క్వాంటమ్ ప్రాజెక్టుల కోసం 50 ఎకరాల భూమి కేటాయించారు. ఐబీఎం, టీసీఎస్, ఎల్%ఠ%టీ వంటి అంతర్జాతీయ సంస్థలతో అవగాహన ఒప్పందాలు (ఎంఓయూ) కుదుర్చుకున్నారు.

**- అమరావతి క్వాంటమ్ డిక్లరేషన్**

అమరావతిలో క్వాంటమ్ వ్యాలీ ప్రారంభించాలని నిర్ణయించిన తర్వాత ఐబీఎం, టీసీఎస్, వంటి భాగస్వామ్య సంస్థలతో కలిపి విజయవాడలో జాతీయ సదస్సు నిర్వహించారు. అందులో కొన్ని తీర్మానాలు చేశారు.12 నెలల్లో భారతదేశంలోనే అతిపెద్ద క్వాంటమ్ టెస్ట్‌బెడ్‌ను ఏర్పాటు చేయడం.
జనవరి 2026 నాటికి ఐబీఎం క్వాంటమ్ సిస్టమ్ 2ను, జనవరి 2027 నాటికి క్వాంటమ్ సిస్టమ్ 3ం ను అందుబాటులోకి తీసుకురావడం.
రూ.1000 కోట్ల స్టార్టప్ నిధిని ఏర్పాటు చేసి, 2030 నాటికి 100 స్టార్టప్‌లను ప్రోత్సహించడం.
అమరావతి క్వాంటమ్ అకాడమీ ద్వారా ప్రతి సంవత్సరం 5,000 మంది యువతకు శిక్షణ ఇవ్వడం.

**- క్వాంటమ్ లిటరసీ పెంపుపై దృష్టి**

ఐటీ గురించి అందరికీ ఐడియా ఉంది కానీ క్వాంటమ్ టెక్నాలజీపై చాలా మంది టెక్ విద్యార్థులకు కూడా అవగాహన లేదు. క్వాంటమ్ కంప్యూటింగ్ వ్యాలీ అనేది క్వాంటమ్ టెక్నాలజీ పరిశోధన- అభివృద్ధికి కేంద్రంగా ఏర్పడే హబ్. క్వాంటమ్ కంప్యూటర్లు క్విబిట్స్ అనే ప్రత్యేకమైన డేటా యూనిట్లను ఉపయోగించి సాధారణ కంప్యూటర్ల కంటే వేగంగా సంక్లిష్టమైన సమస్యలను పరిష్కరించగలుగుతాయి.
ఇది డ్రగ్ డిస్కవరీ, క్లైమేట్ మోడలింగ్, సైబర్ సెక్యూరిటీ, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ వంటి అనేక రంగాల్లో విప్లవాత్మక మార్పులను తీసుకురావచ్చు. కాబట్టి ముందుగా క్వాంటమ్ లిటరసీపై దృష్టి పెట్టాలనుకుంటున్నారు. విద్యారంగంలో క్వాంటమ్ టెక్నాలజీపై అవగాహన పెంచడం ఈ ప్రాజెక్టులో అత్యంత కీలకం. పాఠశాలలు, కళాశాలల్లో క్వాంటమ్ గురించి అవగాహన కల్పించాలి. విశ్వవిద్యాలయాలు క్వాంటమ్ టెక్నాలజీపై ప్రత్యేక కోర్సులను ప్రారంభించాలని నిర్ణయించారు.

# జూబ్లీహిల్స్ ఉప ఎన్నికల్లో కాంగ్రెస్ దే గెలుపు శ్రీ గణేష్

**- కంటోన్మెంట్ ఉప ఎన్నికల ఫలితాలే జూబ్లీహిల్స్ లో పునరావృతం అవుతాయి**

**- కాంగ్రెస్ శాసనసభాపక్ష కార్యాలయంలో మీడియాతో కంటోన్మెంట్ ఎమ్మెల్యే శ్రీగణేష్**




కంటోన్మెంట్ (ప్రశ్న న్యూస్) సికింద్రాబాద్ కంటోన్మెంట్ ఎమ్మెల్యే శ్రీ గణేష్ జూబ్లీహిల్స్ ఉప ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ దే గెలుపు అని జోస్యం చెప్పారు. తెలంగాణ ఉద్యమంలో పదిహేను వందల మంది అమరులైన్నారు.ఒక్క కుటుంబంతో వచ్చింది కాదు,నీళ్ళు,నియామకాలు,విధులు నేపథ్యంలో మొదలైన తెలంగాణ పోరాటం,ప్రతి ఒక్కరినీ కదిలించింది.ఈరోజు ఆ నాలుగు కుటుంబాలే బంగారు కుటుంబాలుగా ఉన్నారంటే ఏ స్థాయిలో దొచుకున్నారో అర్థమవుతుంది.బిఆర్ఎస్ పార్టీలో అంతర్గత కలహాలు, కుటుంబ కలహాలతో కలవరపడుతున్న కేటీఆర్ జూబ్లీహిల్స్ ఉప ఎన్నికల్లో ఓటమిని ముందే ఊహించి అవినీతి సొమ్ముతో పెట్టిన పేపర్,టీవీ,సోషల్ మీడియాల ద్వారా ఫేక్ ప్రచారాలతో ప్రజలను గందరగోళం సృష్టిస్తున్నారు.ఈ నేపథ్యంలో కంటోన్మెంట్ ఎమ్మెల్యే శ్రీగణేష్ నిన్న అసెంబ్లీలోని సియల్పీ కార్యాలయంలో మీడియా సమావేశం ఏర్పాటు చేశారు.ఆయన మీడియా మిత్రులతో మాట్లాడుతూ కంటోన్మెంట్ ఉప ఎన్నికల ఫలితాలే జూబ్లీహిల్స్ లో పునరావృతం అవుతాయని ముక్తకంఠంతో తెలియజేశారు. సెంటిమెంట్ కంటే అభివృద్ధికే జూబ్లీహిల్స్ ఓటర్లు పట్టం కడతారని,కంటోన్మెంట్ ప్రజలు కూడా అభివృద్ధికే పట్టం కట్టారని, రాష్ట్ర ముఖ్యమంత్రి కంటోన్మెంట్ నియోజకవర్గ చరిత్రలో ఎన్నడూ లేని విధంగా భారీ ఎత్తున నిధులు కేటాయిస్తుండడంతో అభివృద్ధి చేస్తున్నామని,విజ్ఞులైన జూబ్లీహిల్స్ ఓటర్లు కూడా కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిని ఆశీర్వదించి గెలిపించుకుంటే గత 10 ఏళ్ళుగా కుంటుపడిన అభివృద్ధిని పరుగులెత్తిస్తామని ఆయన ఈ సందర్భంగా పేర్కొన్నారు.ఐ

# మెదక్ విద్యార్థులు కరాటే పోటీల్లో స్వర్ణ పతకాలు సాధించారు

మెదక్,: జాతీయ స్థాయి కరాటే పోటీలలో మెదక్ విద్యార్థులు స్వర్ణ పతకాలు సాధించారు. ఈ నెల 14, 15 తేదీలలో ముంబైలోని బివ్వండిలో బ్రేవైస్ యూత్ ఆల్ స్టైల్ మార్షల్ ఆర్ట్స్ ఆధ్వర్యంలో జరిగిన ఈ పోటీలలో, మెదక్ పట్టణానికి చెందిన స్వరూప్ సింగ్ (అండర్ 13), అబ్దుల్లా (అండర్ 16), సూరజ్ (అండర్ 17) బ్లాక్ బెల్ట్ విభాగంలో కుమిటీలో స్వర్ణ పతకాలతో పాటు ఛాంపియన్షిప్స్ కూడా గెలుచుకున్నారు. ఈ సందర్భంగా టోర్నమెంట్ ఆర్గనైజర్ రాజా రామ్, కేశవ్ మాస్టర్స్ తదితరులు విద్యార్థులను అభినందించారు.

## నీటి కుంటలో బాలుడు గల్లంతు..

జహీరాబాద్, : జహీరాబాద్ మండలంలోని హుగ్గెల్లి శివారులోని నీటి కుంటలో ఈతకు వెళ్లి గల్లంతైన రిజ్వాన్ అనే బాలుడు మృతి చెందాడు. కోహిర్ మండలం పిచర్యగడి గ్రామానికి చెందిన బాలుడు మధ్యాహ్నం స్నేహితులతో కలిసి నీటి కుంటలో ఈతకు వెళ్ళాడు. పోలీసులు, ఫైర్ సిబ్బంది గాలింపు చేపట్టగా మంగళవారం ఉదయం మృతదేహం లభ్యమైంది. మృతదేహాన్ని పోస్టుమార్టం కోసం జహీరాబాద్ ఏరియా హాస్పిటల్ కి తరలించారు. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

# రైలు కిందపడి వ్యక్తి ఆత్మహత్య

నారాయణఖేడ్, : మంగళవారం జహీరాబాద్ రైల్వే స్టేషన్ లో షిరిడి నుంచి తిరుపతి వెళుతున్న రైలు కిందపడి నర్సింలు (52) అనే వ్యక్తి ఆత్మహత్య చేసుకున్నాడు. మృతుడు ఝరాసంఘం మండలం పోలవరం కు చెందినవాడని పోలీసులు గుర్తించారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

# సమయపాలన పాటించని తహశీల్దార్ పై చర్యలు తీసుకోవాలి

మధిర, : ఎర్రుపాలెం మండలం భీమవరం గ్రామంలోని 190 సర్వే నెంబర్ వివాదాన్ని పరిష్కరించాలని కోరుతూ సీపీఎం నాయకులు మంగళవారం తహశీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. అధికారులు అందుబాటులో లేకపోవడంతో నాయకులు ఆగ్రహం వ్యక్తం చేశారు. సమయపాలన పాటించని తహశీల్దార్ ఉషా శారదపై చర్యలు తీసుకోవాలని, సమస్యను పరిష్కరించాలని వారు డిమాండ్ చేశారు.

# అంబేద్కర్ సంఘం నూతన కమిటీ సభ్యుల మర్యాదపూర్వక భేటీ

వర్ధన్నపేట, : హనుమకొండ జిల్లా కాజీపేట మండలం మడికొండ పోలీస్ స్టేషన్ పరిధిలో, అంబేద్కర్ సంఘం అధ్యక్షుడు రొడ్డ దయాకర్ మరియు నూతన కమిటీ సభ్యులు మంగళవారం సిఐ పుల్యాల కిషన్, 64వ డివిజన్ కార్పొరేటర్ ఆవాల రాధికా రెడ్డిని వారి నివాసంలో మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో అంబేద్కర్ సంఘం ప్రధాన కార్యదర్శి మద్దెల రవికుమార్, యువజన సంఘం అధ్యక్షుడు పసుల రాజ్ కుమార్, ఉపాధ్యక్షులు, కార్యవర్గ సభ్యులు, యువజన సంఘం నాయకులు పాల్గొన్నారు.

# ఏబీవీపీ సభ్యత్వ నమోదు

మహబూబాబాద్, : మహబూబాబాద్ జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ, ప్రయివేట్ కళాశాలల్లో ఏబీవీపీ విద్యార్థి సంఘం సభ్యత్వ నమోదు కార్యక్రమం నిర్వహించింది. ఈ సందర్భంగా ఏబీవీపీ విభాగ్ సంఘటన మంత్రి అఖిల్ మాట్లాడుతూ, విద్యార్థులలో జాతీయ భావం, దేశభక్తి పెంపొందించడం, నాయకత్వ లక్షణాలు అలవర్చడం కోసం తమ సంఘం పనిచేస్తుందని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం విద్యార్థులకు చెల్లించాల్సిన ఉపకారవేతనాలు, ఫీజు రీయింబర్స్మెంట్ వెంటనే చెల్లించాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో ఆందోళన కార్యక్రమాలు చేపడతామని ప్రభుత్వాన్ని హెచ్చరించారు.

## యూరియా కోసం లైన్ లో నిల్చున్న మాజీ ఎమ్మెల్యే

స్టేషన్‌ఘన్‌పూర్, : జనగామ జిల్లా స్టేషన్ ఘనపూర్ సొసైటీ వద్ద మంగళవారం మాజీ ఎమ్మెల్యే తాటికొండ రాజయ్య దంపతులు యూరియా బస్తాల కోసం క్యూలైన్లో నిలుచున్నారు. యూరియా బస్తాల కొరతపై అధికారులతో మాట్లాడి, రైతుల ఇబ్బందులను అడిగి తెలుసుకున్నారు. యూరియా కోసం రైతులు పడుతున్న ఇబ్బందులను ప్రస్తావిస్తూ, ముందు జాగ్రత్తగా రైతులకు సరిపడా యూరియా కోసం రేవంత్ రెడ్డి కేంద్రంపై ఒత్తిడి తేవాలని ఆయన సూచించారు.

## వరంగల్ అర్బన్ కోఆపరేటివ్ బ్యాంక్ డైరెక్టర్ సీతా మహాలక్ష్మికి ఘన సన్మానం

డోర్నకల్, : మహబూబాబాద్‌లో వరంగల్ అర్బన్ కోఆపరేటివ్ బ్యాంక్ డైరెక్టర్‌గా ఎన్నికైన మాజీ ఎమ్మెల్యే బానోత్ శంకర్ నాయక్ సతీమణి డాక్టర్ సీతా మహాలక్ష్మికి ఘన సన్మానం జరిగింది. ఈ కార్యక్రమంలో మాజీ ప్రజాప్రతినిధులు, బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు ఆమెను శాలువా, బొకేలతో సత్కరించి, శుభాకాంక్షలు తెలిపారు. ఆమె విజయం పట్ల హర్షం వ్యక్తం చేస్తూ, పెద్ద సంఖ్యలో నాయకులు, కార్యకర్తలు హాజరయ్యారు.

# టెట్ పై ఇన్ సర్వీస్ ఉపాధ్యాయులకు రక్షణ కల్పించాలి

పాలకుర్తి, : విద్యాహక్కు చట్టం సెక్షన్ 23ను సవరించాలని, టెట్ పై ఇన్ సర్వీస్ ఉపాధ్యాయులకు రక్షణ కల్పించాలని టిపిటిఎఫ్ జనగామ జిల్లా ఉపాధ్యక్షుడు ఇమ్మడి అశోక్ మంగళవారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. ఐదేళ్ల పైబడి సర్వీసు ఉన్న టీచర్లందరూ రెండేళ్లలో టెట్ లో ఉత్తీర్ణులు కావాలని, లేదంటే ఉద్యోగాన్ని వదులుకోవాలని సుప్రీంకోర్టు ఆదేశించిన తీర్పు నుంచి సీనియర్ ఉపాధ్యాయులకు రక్షణ కల్పించాలని ఆయన కోరారు.

# శిథిలావస్థకు చేరుకున్న 33/11 కేవీ విద్యుత్ సబ్‌స్టేషన్

పటాన్‌చెరు, : నిజాంపేటలోని 33/11 కేవీ విద్యుత్ సబ్‌స్టేషన్ కార్యాలయ భవనం శిథిలావస్థకు చేరుకుంది. వారం రోజులుగా కురుస్తున్న భారీ వర్షాల వల్ల భవనం పూర్తిగా తడిసిపోయి, లోపల సిబ్బంది కూర్చోలేని పరిస్థితి ఏర్పడింది. ఈ భవనం ఎప్పుడైనా కూలిపోయే ప్రమాదం ఉందని, భయంతో విధులు నిర్వర్తిస్తున్నామని సిబ్బంది మంగళవారం తెలిపారు. సంబంధిత అధికారులు వెంటనే స్పందించి చర్యలు తీసుకోవాలని వారు విజ్ఞప్తి చేశారు.

# వేములవాడ-సిరికొండ రోడ్డు నిర్మాణానికి

# రూ.23 కోట్ల మంజూరు

- సీఎం రేవంత్ రెడ్డి,కేంద్రమంత్రి నితిన్ గడ్కరీ ప్రత్యేక చొరవతో రహదారి నిర్మాణానికి గ్రీన్ సిగ్నల్
- నెరవేరబోతున్న వేములవాడ నియోజకవర్గ ప్రజల చిరకాల వాంఛ



**వేములవాడ (ప్రశ్న న్యూస్)** వేములవాడ నియోజకవర్గ ప్రజల ఎన్నో ఏళ్ల కల నిజమవుతోంది. తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రత్యేక చొరవతో వేములవాడ-సిరికొండ రోడ్డు నిర్మాణానికి కేంద్ర రహదారుల మౌళిక సదుపాయాల నిధి (సీఆర్ఐఎఫ్) ద్వారా రూ.23 కోట్లు మంజూరు అయ్యాయి.వేములవాడ రూరల్ మండలం, హన్మాజిపేట గ్రామ శివారు 10/02 కిలోమీటర్ల వద్ద నుండి కోనరావుపేట మండలం,మామిడిపల్లి, బావుసాయిపేట,వట్టిమల్ల, భూక్యరెడ్డి తండా మీదుగా ఆజ్మీరా తండా శివారు 28/0 కిలోమీటర్ల వరకు సుమారు 18 కిలోమీటర్ల రహదారి నిర్మాణానికి నిధులు కేటాయించబడ్డాయి.ఈ సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి, కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీకి ధన్యవాదాలు తెలిపారు.విప్ ఆది శ్రీనివాస్ మాట్లాడుతూ %-% "ముఖ్యమంత్రి నేతృత్వంలోని ప్రజా ప్రభుత్వం రాష్ట్రంలో మౌళిక సదుపాయాల కల్పనలో ప్రత్యేక శ్రద్ధ చూపుతోంది. వేములవాడ నియోజకవర్గంలో పలు రోడ్లు, వంతెనల నిర్మాణం కోసం ప్రయత్నాలు కొనసాగుతున్నాయి" అని అన్నారు.ప్రజల తరపున కూడా ఈ రహదారి నిర్మాణ నిధుల మంజూరుపై హర్షం వ్యక్తం చేస్తూ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.

# పోరాట యోధుల త్యాగాలు

# నేటి తరానికి ఆదర్శం

- సీపీఎం పార్టీ జిల్లా కార్యవర్గ సభ్యులు : కడారి రాములు
- కామ్రేడ్ జోగినిపల్లి ఆనందరావుకు సీపీఐ ఘన నివాళులు



**బోయినిపల్లి (ప్రశ్న న్యూస్)** రాజన్న సిరిసిల్ల జిల్లా, బోయినిపల్లి మండలం, మాన్వాడ గ్రామంలో సీపీఐ పార్టీ నేతలు సాయుధ పోరాట యోధుడు జోగినిపల్లి ఆనందరావుకు మంగళవారం ఘన నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సీపీఐ పార్టీ రాజన్న సిరిసిల్ల జిల్లా కార్యవర్గ సభ్యులు కడారి రాములు మాట్లాడుతూ సాయుధ పోరాటం ద్వారా పేదలకు భూములు పంచిన చరిత్రను గుర్తుచేశారు.పోరాట యోధుల త్యాగాలు నేటి తరానికి ఎంతో ఆదర్శమన్నారు.

### ఇచ్చిన హామీలు నెరవేర్చలేదు

కాంగ్రెస్ ప్రభుత్వం డబుల్ బెడ్రూమ్ ఇళ్లు, ఆసరా పెన్షన్లు వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేశారు. భీడి కార్మికులకు కనీసం రూ.6 వేల పెన్షన్,జీఎస్టీ నుంచి మినహాయింపు కల్పించాలని కోరారు.జిల్లాలో ఈఎస్ఐ హాస్పిటల్ ఏర్పాటు అవసరమని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో సీపీఐ నాయకులు కె.వి. అనసూర్య, శాంతా,పోచమల్లు,రాజేశం, దుర్గయ్య,అరవింద్, తదితరులు పాల్గొన్నారు.

# తెలంగాణలో నిజాం ప్రభుత్వం ఆగడాలు

- భూస్వాముల దౌర్జన్యాలకు వ్యతిరేకంగా తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటం



**సిరికొండ (ప్రశ్న న్యూస్)** తెలంగాణ లో నిజాం ప్రభుత్వం ఆగడాలు, భూస్వాముల దౌర్జన్యాలకు వ్యతిరేకంగా తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటం 1948 నుండి 52 వరకు కొనసాగిందని దాసు తెలిపారు. 1948 సెప్టెంబర్ 17న జవహర్లాల్ నెహ్రూ ప్రభుత్వం, రజాకార్ల ఆగడాలను నియంత్రించడం కోసం ఆనాటి హోంమంత్రి సర్దార్ వల్లభాయ్ పటేల్ సైన్యాన్ని తెలంగాణలో దించుతున్నట్లు ప్రకటించింది. కానీ నిజాం లొంగిపోయినట్లు ప్రకటించిన తరువాత నెహ్రూ సైన్యాలు వెనక్కి పోకుండా, తెలంగాణ ప్రజలపై, కమ్యూనిస్టు నాయకులపై దాడులు కొనసాగించాయి.గడ్కోల్ గ్రామంలో భీంగల్ సబ్ డివిజన్ కార్యదర్శి బాలయ్య అధ్యక్షతన సమావేశం నిర్వహించారు. దాసు ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడుతూ కమ్యూనిస్టు పార్టీ ఆధ్వర్యంలో 3000 గ్రామ స్వరాజ్యాలు ఏర్పాటు చేసి పోరాడి సాధించుకున్న 10 లక్షల ఎకరాల భూమిని, పేదలు స్వాధీనం చేసుకున్నారని, అట్టి భూమి తిరిగి భూస్వాములకు ఇప్పించడానికి నెహ్రూ ప్రభుత్వ సైన్యాలు దాడులు చేసి మూడు వేల మంది ప్రజలను ,కమ్యూనిస్టు నాయకుల ప్రాణాలను బలి తీసుకున్నారని దాసు తెలిపారు. ప్రజా వ్యతిరేకి నిజాం ప్రభువుకు రాజభరణం ఇచ్చి, రాజ్ ప్రముఖ్ బిరుదు ఇచ్చి సన్మానించడం దుర్మార్గమని ఆయన అన్నారు. పైగా కోటి యాభై లక్షల రూపాయల రాజభరణాల కింద చెల్లించడం విచారకరమని ఆయన అన్నారు.తెలంగాణ ఆడబిడ్డల మాన, ప్రాణాలు దోచుకున్న నరహంతకుడు ఖాసిం రజ్వీనీ విమానం ఎక్కించి సాగనంపడం జరిగిందని ఆయన తెలిపారు. కరుడుగట్టిన రజాకారులు లొంగిపోవడం, వారికి నెహ్రూ ప్రభుత్వం మర్యాదలు చేయడం బట్టి నిజాం నవాబుతో కాంగ్రెస్ ఒప్పందం చేసుకుని మోసం చేసిందని స్పష్టమైనదని ఆయన అన్నారు. కాసిం రాజ్వి 2000 మందినీ చంపితే నెహ్రూ ప్రభుత్వం 3000 మందిని పొట్టన పెట్టుకుందని ఆయన తెలిపారు. సైన్యం వెయ్యి మంది స్త్రీలను చెరిచిందనీ, 5000 మంది స్త్రీలపై అత్యాచారాలు జరిపిందని ఆయన తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వం కమ్యూనిస్టులను అణిచివేసి, ప్రజలను అనాథలుగా చేసి, భయభ్రాంతులకు గురిచేయడానికి కుట్ర చేస్తుందని నిర్ధారణ అయిందనీ ఆయన తెలిపారు.3000 గ్రామ స్వరాజ్యాలను ధ్వంసం చేసి, ప్రజలను తిరిగి కష్టాల రొంపిలో దించిందని ఆయన అన్నారు. అందుకే1948 సెప్టెంబర్ 17 తెలంగాణ హైదరాబాదులో విలీనం చేసి,ప్రజలకు కాంగ్రెస్ పార్టీ చేసిన విద్రోహం అని దాసు అన్నారు.బిజెపి విమోచన పేరుతో ప్రజల్ని మోసం చేస్తుందని ఆయన తెలిపారు.స్వాతంత్ర ఉద్యమంతో, తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటంతో బిజెపికి సంబంధం లేదని, ఆయన అన్నారు. కానీ ప్రజల్ని మత సెంటిమెంటుతో విభజించి ఎన్నికల లబ్ధి కోసం తాపత్రయం పడుతుందని ఆయన అన్నారు.నరేంద్ర మోడీ ప్రభుత్వం ఎన్నికల వాగ్దానాలు విస్మరించి, ప్రజా ప్రయోజనాలను పాతరేసి కార్పోరేట్ కంపెనీలకు ఊడిగం చేస్తుందని ఆయన అన్నారు.హిందూ సెంటిమెంటు పేరుతో దేశంలో ఉన్న మెజార్టీ హిందువులను మోసగిస్తుందని, కష్టాల గురి చేస్తుందని ఆయన అన్నారు. తెలంగాణ సాయుధ రైతాంగ పోరాట స్ఫూర్తితో ప్రభుత్వ వ్యతిరేక విధానాలకు వ్యతిరేకంగా ఉద్యమించుదామని దాసు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో బాలయ్య న్యూ డెమోక్రసీ భీంగల్ సబ్ డివిజన్ కార్యదర్శి, సిపిఐ ఎంఎల్ న్యూడెమోక్రసీ నాయకులు మార్క్స్, నిమ్మల భూమేష్, గులాం హుస్సేన్,పిట్ల ఎల్లన్న, సంజీవ్, కృష్ణ, గాదెనరసయ్య,సుద్ధపల్లి నడిపి సాయన్న, తదితరులు పాల్గొన్నారు.

# ఓజోన్ పరిరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత

- మొక్కలు నాటండి ఓజోన్ పొర రక్షించండి




**ధర్పల్లి (ప్రశ్న న్యూస్)** నిజామాబాద్ జిల్లా ధర్పల్లి ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఓజోన్ దినోత్సవం ఘనంగా నిర్వహించారు.ధర్పల్లి ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో మంగళవారం నాడు రసాయనిక శాస్త్ర విభాగం తరపున ఓజోన్ దినోత్సవం ఘనంగా జరిపారు. కెమిస్ట్రీ అధ్యాపకురాలు ఏ శారద ఈ కార్యక్రమంలో మాట్లాడుతూ ఓజోన్ పొర పరిరక్షణకై క్లోరో ఫ్లోరో కార్బన్ల వాడకాలను తగ్గించాలని అన్నారు. ఈ కార్యక్రమంలో భాగంగా ప్రిన్సిపాల్ డాక్టర్ ఎన్ జ్యోతి విద్యార్థులు భావితరాలకు తనవంతు గా ప్రతి ఒక్కరు మొక్కలు నాటి పర్యావరణాన్ని పరిరక్షించాలని సూచించారు. విద్యార్థిని విద్యార్థులు అధిక సంఖ్యలో పాల్గొని తమ పోస్టర్ ఆవిష్కరణకు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ శ్రీరామ్, డాక్టర్ జి శ్రీనివాస్ రెడ్డి, డాక్టర్ ప్రభాకర్, డాక్టర్ రవి రాజు, డాక్టర్ కుమారస్వామి తో పాటు అధిక సంఖ్యలో విద్యార్థిని విద్యార్థులు పాల్గొన్నారు.

# ప్రజా పాలన దినోత్సవం ఘనంగా జరుపుకోవాలి - జిపి సెక్రెటరీ శ్రీనివాస్



**ధర్పల్లి (ప్రశ్న న్యూస్)** నిజామబాద్ జిల్లా ధర్పల్లి మండల కేంద్రంలో తెలంగాణ ప్రజా పాలన దినోత్సవం పురస్కరించుకొని బుధవారం ఉదయం 8 గంటలకు గ్రామ ప్రత్యేక అధికారి జి లక్ష్మారెడ్డి చేతుల మీదుగా గ్రామపంచాయతీ కార్యాలయం వద్ద జాతీయ పతాక ఆవిష్కరణ కలదు కావున ఇట్టి కార్యక్రమానికి అందరూ హాజరై ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయగలరని గ్రామ సెక్రెటరీ శ్రీనివాస్ కోరారు.

# ముక్కంటి సేవలో ప్లేబ్యాక్ సింగర్ వరం




**వేములవాడ (ప్రశ్న న్యూస్)** వేములవాడ శ్రీరాజరాజేశ్వర స్వామివారిని ప్రముఖ తెలుగు ప్లేబ్యాక్ సింగర్ (గాయని) వరం మంగళవారం దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు.స్వామివారి దర్శనానికి ముందుగా కోడె మొక్కులు చెల్లించుకున్నారు.అందరిని చల్లగా చూడు స్వామి అంటూ వేడుకున్నట్లు తెలిపారు.దర్శనం అనంతరం నాగిరెడ్డి మండపంలో ఆలయ అర్చకులు వేదోక్త ఆశీర్వచనం చేసి, తీర్థప్రసాదాలు అందజేశారు.

# పోలీసులు - ప్రాసిక్యూషన్ కృషితో నిందితుడికి జీవిత ఖైదు - జరిమానా

- శిక్షలతోనే సమాజంలో మార్పు వస్తుంది - జిల్లా ఎస్పీ : మహేష్ బీ గితే
- నిందితుడికి శిక్ష పడేందుకు కృషి చేసిన టౌన్ సీఐ వీరప్రసాద్,సిబ్బందికి ఎస్పీ అభినందనలు





**వేములవాడ (ప్రశ్న న్యూస్)** వేములవాడ పట్టణంలో చోటుచేసుకున్న హత్యకేసులో నిందితుడికి జీవిత ఖైదుతో పాటు రూ.1000 జరిమానా విధిస్తూ సిరిసిల్ల ప్రధాన న్యాయమూర్తి నీరజ మంగళవారం తీర్పు వెల్లడించారని జిల్లా ఎస్పీ మహేష్ బీ గితే తెలిపారు.

### కేసు వివరాలు

జూలపల్లి మండలం, తేలుకుంటకు చెందిన మరిపెల్లి రాజయ్య (64) వేములవాడ శివారులోగల మామిడితోటలో కాపరిగా పనిచేస్తుండేవాడు. అతనితో పాటు మంత్రి ఆనందం (చింతల్ ఠాణా) కూడా తోటకాపరిగా పనిచేసేవాడు. పని విషయంలో ఇద్దరి మధ్య తరచూ విభేదాలు తలెత్తేవి. తోటపని,వంటపని రాజయ్య ఒక్కడే చేస్తున్నాడనే కారణంగా ఎప్పటికప్పుడు తగాదాలు జరిగేవి.ఈ క్రమంలో రాజయ్య తనను తిట్టిన విషయాన్ని మనసులో పెట్టుకున్న ఆనందం, 29-04-2024న రాత్రిరాజయ్యతోట వద్ద భోజనం చేస్తున్న సమయంలో ఇనుప పారాతో తలపై బాది హత్య చేశాడు.

### దర్యాప్తు- న్యాయవిచారణ

మృతుడు రాజయ్య కుమారుడు శ్రీనివాస్ ఫిర్యాదు మేరకు వేములవాడ టౌన్ సీఐ వీరప్రసాద్ కేసు నమోదు చేసి, నిందితుడిని రిమాండ్‌కు పంపారు. అనంతరం సమగ్ర దర్యాప్తు జరిపి కోర్టులో చార్జ్ షీట్ దాఖలు చేశారు. కోర్టు మానిటరింగ్ ఎస్సై రవీంద్ర నాయుడు, కోర్టు కానిస్టేబుల్ మహేందర్,సిఎంఎస్ కానిస్టేబుల్ నవీన్ ఆధ్వర్యంలో 16 మంది సాక్షులను ప్రవేశపెట్టారు. ప్రాసిక్యూషన్ తరపున పబ్లిక్ ప్రాసిక్యూటర్ పెంట శ్రీనివాస్ వాదించగా సాక్ష్యాధారాలను పరిశీలించిన న్యాయమూర్తి, నిందితుడైన ఆనందంపై నేరం రుజువైందని తేల్చి జీవిత ఖైదు,రూ.1000 జరిమానా విధించారు.

### జిల్లా ఎస్పీ అభినందనలు

ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ మాట్లాడుతూ "జిల్లాలో నేరాలకు పాల్పడిన వారు ఎవరూ శిక్ష నుండి తప్పించుకోలేరు. శిక్షల ద్వారానే సమాజంలో మార్పు వస్తుంది. పోలీసులు, ప్రాసిక్యూషన్ సమన్వయంతో న్యాయవిచారణ జరగడంతో నిందితుడికి శిక్ష పడింది" అని పేర్కొన్నారు.కేసు విజయవంతం కావడానికి కృషి చేసిన సీఐ వీరప్రసాద్,పబ్లిక్ ప్రాసిక్యూటర్ పెంట శ్రీనివాస్, ఎస్సై రవీంద్ర నాయుడు, కానిస్టేబుళ్లు మహేందర్, నవీన్‌లను ఎస్పీ ప్రత్యేకంగా అభినందించారు.

# మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ ను సన్మానించిన గుడిసె సదానందం



**వేములవాడ (ప్రశ్న న్యూస్)** రాజన్న సిరిసిల్ల జిల్లాలో మంగళవారం నిర్వహించిన "మాదిగల ఆత్మీయ సమ్మేళనం" ఘనంగా నిర్వహించబడింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన తెలంగాణ రాష్ట్ర ఎస్సీ,ఎస్టీ,మైనారిటీ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మన్ కుమార్ హాజరయ్యారు. ఈ సందర్భంగా మంత్రి ని వేములవాడ బార్ అసోసియేషన్ పూర్వ అధ్యక్షులు గుడిసె సదానందం ఘనంగా సన్మానించడం జరిగింది.

# ఎమ్మెల్యే సత్యం కు విలాసాగర్ గ్రామ అభివృద్ధి పై వినతి - ఎమ్మెల్యే సానుకూల స్పందన

- యూత్ కాంగ్రెస్ ప్రధానకార్యదర్శి : ఏనుగుల ప్రశాంత్ కుమార్



**బోయినిపల్లి (ప్రశ్న న్యూస్)** రాజన్న సిరిసిల్ల జిల్లా, బోయినిపల్లి మండలంలోని విలాసాగర్ గ్రామ పలువురు ప్రజలు మంగళవారం చొప్పదండి నియోజకవర్గం శాసనసభ్యులు డాక్టర్ మేడిపల్లి సత్యం ను యూత్ కాంగ్రెస్ ప్రధానకార్యదర్శి ఏనుగుల ప్రశాంత్ కుమార్ ఆధ్వర్యంలో మర్యాదపూర్వకంగా కలిసి, గ్రామ అభివృద్ధి కోసం వినతిపత్రం సమర్పించారు.

### ప్రధాన అభ్యర్థనలు

- విలాసాగర్ చెరువును మినీ ట్యాంక్ బండ్ గా నిర్మించడం
- విలాసాగర్ గ్రామానికి లైబ్రరీ ఏర్పాటు
- కొదురుపాక%-%విలాసాగర్, జగ్గారావుపల్లి%-%విలాసాగర్ కల్వర్ట్ పూర్తి చేయడం
- శ్రీ వేంకటేశ్వర స్వామి ఆలయానికి సీసీ రోడ్,హై మాస్ లైట్లు,ఆలయ ముందు ప్రహరీ గోడ ఏర్పాటు

### ఎమ్మెల్యే సానుకూల స్పందన - హామీ

పలువురు గ్రామ వాసులు ఇచ్చిన వినతిపత్రం మేరకు ఎమ్మెల్యే సత్యం తక్షణమే సానుకూలంగా స్పందించి, తక్షణమే అభివృద్ధి పనులకు కృషి చేస్తానని హామీ ఇచ్చారు.
అనంతరం ఎమ్మెల్యే సత్యం ను శాలువాతో ఘనంగా సన్మానించి, కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో విలాసాగర్ శ్రీ వేంకటేశ్వర స్వామి ఆలయ కమిటీ చైర్మన్ దయ్యాల కొమురయ్య,యూత్ కాంగ్రెస్ ప్రధానకార్యదర్శి,ఆలయ కమిటీ వైస్ చైర్మన్ ఏనుగుల ప్రశాంత్ కుమార్,దేవస్థాన ప్రధాన కార్యదర్శి గొట్ల భూమయ్య,బూర నరహరి,సాగరం కనకయ్య,దమ్మ మల్లికార్జున్,కొంకటి శ్రీధర్, పొత్తూరి అశోక్,తదితర నాయకులు పాల్గొన్నారు.ం

# పార్టీ ఫిరాయింపుపై బీఆర్ఎస్ వివాదం హాస్యాస్పదం

- అధికారం లేకపోవడంతోనే బీఆర్ఎస్ రాద్ధాంతం
- యావత్ తెలంగాణ రాష్ట్ర ప్రజల ప్రశ్నకు బీఆర్ఎస్ సమాధానం చెప్పాలి
- రుద్రవరం సింగిల్విండో చైర్మన్, కాంగ్రెస్ నేత : రేగులపాటి కృష్ణదేవ రావు



**వేములవాడ (ప్రశ్న న్యూస్)** తెలంగాణ రాష్ట్రంలో పార్టీ ఫిరాయింపు అంశాన్ని బీఆర్ఎస్ రాద్ధాంతం చేయడంపై రుద్రవరం సింగిల్‌విండో చైర్మన్,కాంగ్రెస్ పార్టీ నాయకులు రేగులపాటి కృష్ణదేవరావు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ"నాడు మా తండ్రి రేగులపాటి పాపారావు సిరిసిల్ల నియోజకవర్గం నుండి కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్యేగా గెలిచి, తెలంగాణ సాధన కోసం కల్వకుంట్ల చంద్రశేఖర్ రావు స్థాపించిన టీఆర్ఎస్‌కు మద్దతు తెలిపినప్పుడు బీ(టీ)అర్ఎస్ పార్టీ అగ్రనేతలు కేసీఆర్, కేటీఆర్,తదితర పార్టీ శ్రేణులు జేజేలు కొట్టారు. అప్పట్లో పార్టీ ఫిరాయింపు అని ఎవ్వరూ మా తండ్రిని అనలేదు.నేడు అధికారం లేక కోర్టులో పిటిషన్లు వేయడం హాస్యాస్పదంగా ఉందని,ఇది యావత్ తెలంగాణ రాష్ట్ర ప్రజలకు అర్థమవుతుంది" అని ఆయన మండిపడ్డారు.అప్పట్లో అధికారంలో భాగస్వామ్యం కావడం సౌకర్యమైతే, నేడు ఫిరాయింపు ముద్ర వేయడం విరుద్ధ ధోరణి అని కృష్ణదేవరావు వ్యాఖ్యానించారు.

# నాయుడుపేటలో ఘనంగా రాష్ట్ర మంత్రి వై.సత్య కుమార్ జన్మదిన వేడుకలు

- జన్మదిన శుభాకాంక్షలు తెలియజేసిన బిజెపి నాయకులు బొల్లకాయల విజయభాస్కర్



**నెల్లూరు బ్యూరో( ప్రశ్న న్యూస్ )** రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ మంత్రి సత్య కుమార్ యాదవ్ జన్మదిన వేడుకలను ఉమ్మడి నెల్లూరు జిల్లా నాయుడుపేటలో భారతీయ జనతా పార్టీ నాయకులు, కార్యకర్తలు అత్యంత ఘనంగా నిర్వహించారు. పట్టణంలోని ప్రధాన కూడలి అయిన గడియారం సెంటర్ వద్ద బిజెపి నాయకులంతా కలిసి కేకులు కట్ చేసి, మంత్రి సత్య కుమార్ యాదవ్ జన్మదిన శుభాకాంక్షలు తెలియజేస్తూ సంబరాలు జరుపుకున్నారు. ఈ సందర్భంగా వారు మంత్రి సత్య కుమార్ యాదవ్ ఆరోగ్య, వైద్య శాఖ మంత్రిగా చేస్తున్న సేవలను కొనియాడారు. ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించడంలో ఆయన కృషిని ప్రశంసించారు. అనంతరం స్థానికంగా ఉన్న పేదలకు, అనాథలకు అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో బిజెపి నాయకులు బొల్లకాయల విజయభాస్కర్, చెంచు కృష్ణయ్య, రంగినేని కిష్టయ్య, కొప్పులు సుబ్రహ్మణ్యం తదితరులు పాల్గొని, మంత్రికి శుభాకాంక్షలు తెలిపారు.

# జర్నలిస్టుల సంక్షేమం

## ప్రభుత్వం మరిచిపోయింది: గౌటి రామకృష్ణ

- అండగా ఉంటామని చెప్పడం తప్ప ఎక్కడ అండగా ఉన్నారో చూపించండి
- ఆసుపత్రి పాలైన జర్నలిస్టులకు ఆసుపత్రి బిల్లు మొత్తం చెల్లించారా
- ముఖ్యమంత్రి సహాయ నిధి నుండి కూడా జర్నలిస్టులకు అందని మొత్తం సహాయం
- జర్నలిస్టుల కుటుంబాలు రోడ్డున పడుతున్నాయి ఆదుకొనే దిక్కేలేదు
- 2సంవత్సరాలు కావస్తున్న అక్రిడేషన్ ఇవ్వలేదు, ఏంప్యానల్ చేయలేదు
- అవార్డులు కాదు సమయానికి ఆర్థికంగా ఆదుకోండి చాలు
- ర్నలిస్టులపై దాడులు చేసిన పట్టించుకోని పోలీసుల, ప్రజాప్రతినిధులు
- జర్నలిస్టుల పై దాడి చేసిన వాళ్ళని రక్షిస్తున్న పోలీసులు, తిరిగి జర్నలిస్టులపై తప్పుడు కేసులు పెడుతున్నా వైనం



**హైదరాబాద్ (ప్రశ్న న్యూస్)** జర్నలిస్టుల సమస్యలను తీర్చడంలో రేవంత్ సర్కార్ పూర్తిగా విఫలమైందని తెలంగాణ జర్నలిస్టు సంక్షేమ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గౌటి రామకృష్ణ పేర్కొన్నారు. సమాచారం శాఖామంత్రి పొంగిలేటి శ్రీనివాస్ రెడ్డి మాటలు హాస్యాస్పదంగా ఉన్నాయని దాదాపు రెండు సంవత్సరాలు కావస్తున్న అక్రిడేషన్ కార్డు ఇవ్వాలన్న చిత్తశుద్ధి ప్రభుత్వానికి లేదన్నారు. చిన్న పత్రికలు ఏంప్యానల్ మెంట్ కోసం కేసీఆర్ ప్రభుత్వం నుంచి వేచి చూస్తున్నాయని మరి వాటిని ఎందుకు ఎంప్యానెల్ చేయలేదని ప్రశ్నించారు. కేసీఆర్ ప్రభుత్వ పాలన విధానాలనే రేవంత్ ప్రభుత్వం కూడా అనుసరిస్తుందని అందులో ఎలాంటి మార్పు లేదని పేర్కొన్నారు. కెసిఆర్ ప్రభుత్వంలో అక్రిడేషన్ కార్డుల జారీలో భారీగా అవకతవకలు జరిగాయని వాటిని సరి చేయడానికి రేవంత్ రెడ్డి ప్రభుత్వానికి రెండు సంవత్సరాలు కూడా సరిపోకపోవడం విడ్డూరంగా ఉందన్నారు. జర్నలిస్టులపై దాడులు చేసి తిరిగి వాళ్లపైన తప్పుడు కేసులు పెడుతుంటే పోలీసులు దాడి చేసిన వాళ్లకే సహాయం అందిస్తూ రిపోర్టర్లను శత్రువులుగా చూస్తున్నారన్నారు.

జీతభత్యాలు దేవుడెరుగు అది వచ్చింది లేదు పోయేది లేదు దానికోసం కాలక్షేపం తప్ప జర్నలిస్టులకు ఎలాంటి ఉపయోగం లేదన్నారు. జర్నలిస్టులపై అక్రమ కేసులు పెట్టడంలో కేసీఆర్ సర్కారును మరిపిస్తున్నారని అదే కాకుండా ప్రభుత్వ అధికారుల అవినీతిని వెలికితీస్తున్న జర్నలిస్టులను టార్గెట్ చేయడం ఎంతవరకు నమంజమనం అన్నారు. అధికారుల అవినీతిని, నిర్లక్ష్యాన్ని, బాధ్యతారాహిత్యాన్ని బయటకి తీయడం వల్లనే ప్రభుత్వ పథకాలు, ప్రభుత్వ విధానాలు ప్రజలలోకి వెళతాయని ఈ చిన్నపాటి విషయాన్ని కూడా ఎమ్మెల్యేల నుండి ముఖ్యమంత్రి స్థాయి వరకు మరిచిపోవడం బాధాకరమన్నారు. జర్నలిస్టుల సంక్షేమానికి కట్టుబడి ఉన్నామని ఇటు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అటు మంత్రి పొంగిలేటి శ్రీనివాస్ రెడ్డి పదేపదే అనడం తప్ప వాళ్ల కోసం చేసింది శూన్యమన్నారు.

మాటలు ఎన్నైనా చెప్పవచ్చని వాటిని అమలుపరచడం చేసినప్పుడే చెప్పిన మాటలకు సార్థకత ఉంటుందన్నారు.

జీవో ల ప్రకారం ఉన్న జర్నలిస్టులకు అక్రిడేషన్లు కార్డులు ఇస్తే అదే అవార్డులు ఇచ్చినంత గొప్ప అని ఇక అవార్డులు ఇచ్చిన జర్నలిస్టులకు ఒరిగింది ఏమీ లేదన్నారు. అనారోగ్యంతో ఆసుపత్రిపాలైన జర్నలిస్టులకు ముఖ్యమంత్రి సహాయనిధి నుండి పూర్తిస్థాయిలో బిల్లు చెల్లిస్తే అదే వాళ్లకు పెద్ద అవార్డు అని వాళ్ళ కుటుంబాలు రోడ్డున పడకుండా ఉంటాయని తెలిపారు.

అనారోగ్యాల పాలవుతున్న జర్నలిస్టులకు ముఖ్యమంత్రి సహాయనిధి నుండి పూర్తి మొత్తం చెల్లించి సంక్షేమం కోసం పాటు పడతామని చెబితే బాగుంటుందని ఈ సందర్భంగా సమాచారం శాఖ మంత్రికి ముఖ్యమంత్రి కి గౌటి రామకృష్ణ సూచించారు. ఇప్పటికైన రేవంత్ సర్కార్ స్పందించి జర్నలిస్టులపై మాటిమాటికి ప్రకటన చేయడం కాకుండా వాటిని అమలు చేయడం చేస్తే బాగుంటుందని కోరారు.

## రక్షణ మంత్రి రాజ్ నాథ్ సింగ్ ని

# కలిసిన ఈటెల రాజేందర్



**కంటోన్మెంట్ (ప్రశ్న న్యూస్)** తెలంగాణ రాష్ట్రంలో సెప్టెంబర్ 17 తెలంగాణ విమోచన దినోత్సవం సందర్భంగా కేంద్ర మంత్రి రాజ్ నాథ్ సింగ్ హైదరాబాద్ కి విచ్చేశారు. ఈక్రమంలో మల్కాజిగిరి పార్లమెంటు సభ్యులు ఈటెల రాజేందర్ బేగంపేట విమానాశ్రయంలో రక్షణ శాఖ మంత్రి రాజ్ నాథ్ సింగ్ ని మర్యాదపూర్వకంగా కలిశారు. అలాగే స్థానికంగా ఉన్న భాజపా నేత బానుక మల్లికార్జున్ ని పరిచయం చేస్తూ సికింద్రాబాద్ కంటోన్మెంట్ బోర్డు పరిధిలో బిజెపి పార్టీ కారిక్రమాలను ప్రజల్లోకి తీసుకెళ్ళడంలో ఆయన దిట్టఅని వివరించారు. అనంతరం జూబ్లీ బస్ స్టేషన్ ఆనుకొని ఉన్న కంటోన్మెంట్ పార్కులో దివంగత నేత మాజీ ప్రధానమంత్రి వాజ్ పాయ్ విగ్రహం ఏర్పాట్లు దగ్గరుండి మల్లికార్జున్ చూసుకున్నారని ఈటెల రక్షణ మంత్రికి తెలిపారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ రాష్ట్ర భాజపా అధ్యక్షుడు రామచంద్రరావు, కంటోన్మెంట్ బిజెపి నేత బి.ఎన్.శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

## 200 మంది కాంట్రాక్టు ఉద్యోగులను

# సాగనంపిన గూగుల్!

- జెమిని, ఏఐ ప్రాజెక్టులపై పని చేస్తున్న 200 మందికి పైగా కాంట్రాక్ట్ ఉద్యోగులకు గూగుల్ గుడ్‌బై
- ముందస్తు సమాచారం లేకుండా అలా గుడ్‌బై చెప్పడంపై పలువురు ఉద్యోగులు అసంతృప్తి
- ఆ ఉద్యోగులు సంస్థ ఉద్యోగులు కాదన్న గూగుల్




**న్యూఢిల్లీ (ప్రశ్న న్యూస్)** టెక్ దిగ్గజం గూగుల్‌లో ఉద్యోగుల తొలగింపు అంశం మరోసారి చర్చనీయాంశమైంది. తాజాగా, కంపెనీలోని ఏఐ ప్రాజెక్టులపై పనిచేస్తున్న 200 మందికి పైగా కాంట్రాక్ట్ ఉద్యోగులను హఠాత్తుగా తొలగించినట్లు సమాచారం. వీరిలో అత్యధికులు జెమిని చాట్‌బాట్, ఇతర ఏఐ టూల్స్ అభివృద్ధిలో నిమగ్నమై ఉండటం గమనార్హం. తమ తొలగింపు గురించి ముందుగా తెలియకుండానే ఒక్కసారిగా విధుల నుంచి తొలగించడంతో పలువురు ఉద్యోగులు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు.

ఈ కాంట్రాక్టర్లలో చాలామంది మాస్టర్స్, పీహెచ్‌డీ విద్యార్హతలు కలిగినవారు కాగా, కొందరు "సూపర్ రేటర్స్"గా గుర్తింపు పొందినవారు కూడా ఉన్నారు. ఈ విషయంపై గూగుల్ ప్రతినిధులు స్పందిస్తూ, "ఈ ఉద్యోగులు నేరుగా గూగుల్ ఉద్యోగులు కాదు. వారు నియామక ఏజెన్సీ లేదా సబ్‌కాంట్రాక్టర్ల ద్వారా పనిచేస్తున్నారు" అని తెలిపారు. ఇది కంపెనీ తీసుకున్న ప్రత్యక్ష నిర్ణయం కాదని వారు సూచనప్రాయంగా వెల్లడించారు. దీంతో టెక్ పరిశ్రమలో కాంట్రాక్ట్ ఉద్యోగుల భద్రతపై మరోసారి చర్చ మొదలైంది. సాధారణంగా, గూగుల్ వంటి అనేక పెద్ద కంపెనీలు తమ ఏఐ ప్రాజెక్టుల కోసం తాత్కాలిక ఉద్యోగులను పెద్ద సంఖ్యలో వినియోగిస్తుంటాయి. అయితే, స్వల్ప వ్యవధిలో నోటీసు ఇచ్చి ఉద్యోగాల నుంచి తొలగించడం వంటి పరిస్థితులు కాంట్రాక్టర్లు, వాలంటీర్ల భవిష్యత్తుపై ప్రభావం చూపే అవకాశం ఉంది.

# చిన్న గల్లి పెద్ద అపార్ట్మెంట్

- అక్రమ నిర్మాణాలకు సహకరించిన చైన్ మెన్ నాగయ్య
- ఇంత చిన్న గల్లీలో అంత పెద్ద అపార్ట్మెంట్ కడుతుంటే అధికారులు నిద్రపోయారా .?
- ఇంచార్జ్ ఏసిపి బాల శ్రీనివాస్ అవినీతి అక్రమాలకు సికింద్రాబాద్లో గుట్టలుగా అక్రమ అపార్ట్మెంట్లు
- ఇన్చార్జి సమయంలోనే భారీగా అవినీతికి పాల్పడ్డ ఏసిపి బాల శ్రీనివాస్
- సికింద్రాబాద్ సర్కిల్లో అక్రమ అపార్ట్మెంట్లకు కొదవలేదు అధికారుల అవినీతికి ఏం తక్కువ లేదు





**తార్నాక (ప్రశ్న న్యూస్)** మున్సిపల్ శాఖలో టౌన్ ప్లానింగ్ అధికారులు సిబ్బంది ఏకమై అక్రమ నిర్మాణాలను పెంచి పోషించారు, పోషిస్తున్నారు. వీళ్ళ అవినీతికి హద్దు అదుపు లేకుండా పోయింది. ఏకంగా అక్రమ అపార్ట్మెంట్లు కట్టి అమ్ముకుంటున్న పట్టించుకునే నాధుడే లేకుండా పోయాడు. టౌన్ ప్లానింగ్ అధికారుల అవినీతికి స్టాంప్స్ అండ్ రిజిస్ట్రేషన్ అధికారులు ఎస్ఆర్ఓలు తోడు కావడంతో ఇక గ్రేటర్ హైదరాబాద్ పరిధిలో అనుమతులు లేని అనేక అపార్ట్మెంట్లకు అక్రమ మార్గంలో రిజిస్ట్రేషన్లు చేపించి తోడు దొంగల వలె ఇద్దరు కలిసి భారీగా అవినీతి అక్రమాలకు పాల్పడుతూ కోట్లు సంపాదించారు. ఈ అక్రమ రిజిస్ట్రేషన్ లతో ఒక్కొక్క ఎస్ఆర్ఓ లు వందల కోట్లకు పైనే ఉన్నారన్న ఆశ్చర్యం పోవలసిన అవసరం లేదు. టౌన్ ప్లానింగ్ అధికారుల అవినీతికి ఎస్ఆర్ఓ లు తోడు కావడంతో ఇక గ్రేటర్ హైదరాబాద్ పరిధిలో విచ్చలవిడిగా అక్రమ నిర్మాణాలు చేసి దొంగ రిజిస్ట్రేషన్లు చేయించి ఎవరికి పడితే వారికి అమ్మేశారు చివరికి ప్రభుత్వ భూములను కూడా రిజిస్ట్రేషన్లు చేయించిన ఘనత ఎస్ఆర్వోలది దానికి సహకరించిన ఘనత టౌన్ ప్లానింగ్ అధికారుల ది టౌన్ ప్లానింగ్ అధికారులు ఆదిలోనే నియమ నిబంధనలు పాటించి కట్టడి చేసి ఉంటే ఈరోజు నగరంలో ఇన్ని అక్రమ నిర్మాణాలు ఉండేవి కాదు. ఇక సికింద్రాబాద్ నియోజకవర్గంలో ప్రజాప్రతినిధుల పేరుతో అక్రమ నిర్మాణాలకు కొదువే లేదు బిల్డర్లు 10 ఫీట్ల రోడ్లలో కూడా ఐదు అంతస్తుల అపార్ట్మెంట్లు నిర్మిస్తున్నారంటే అధికారులకు ఎంత భారీగా లంచాలు ఇస్తున్నారో అర్థం చేసుకోవచ్చు. సికింద్రాబాద్ సర్కిల్ పరిధిలో చాలావరకు 2 అంతస్తులకు అనుమతులు తీసుకొని 5 అంతస్తుల అక్రమ అపార్ట్మెంట్లు కట్టి అమ్ముతున్నారు, ఇప్పటికే వందల సంఖ్యలో అమ్మేశారు. దానికి టౌన్ ప్లానింగ్ అధికారులు డిప్యూటీ కమిషనర్లు సహకారం అందించి లంచాలు తీసుకొని అటువైపు కన్నెత్తి చూడకుండా లంచాలు తిన్నారంటే అర్థం చేసుకోవచ్చు ఎంత భారీ స్థాయిలో టౌన్ ప్లానింగ్ అధికారులు, డిప్యూటీ కమిషనర్లు అవినీతికి పాల్పడ్డారో అందులో భాగంగా మెట్టుగూడ డివిజన్ పరిధిలోని పక్కింటి నెంబర్11%-1-%292 ఎస్ వి డాటర్ కాలనీ లో 10 ఫీట్ల రోడ్డు వుండే ఇక్కడ 5 అంతస్తులు అపార్ట్మెంట్ ఎలా నిర్మించారని స్థానికులు ఆశ్చర్యం వ్యక్తం చేస్తున్నారు. ఈ అక్రమ నిర్మాణం పై గతంలో ఇన్చార్జిగా ఉన్న టౌన్ ప్లానింగ్ ఏసిపి బాల శ్రీనివాస్, చైన్ మెన్ నాగయ్య కలిసి భారీగా లంచాలు తీసుకొని ఈ అక్రమ నిర్మాణానికి నోటీసులు కూడా ఇవ్వలేదన్న ఆరోపణలు ఉన్నాయి. కేవలం ఒక నోటీసు జారీ చేసి మిగతా నోటీసులు ఇవ్వకుండా లంచాలు తీసుకొని మేనేజ్ చేశారని స్థానికులు విమర్శిస్తున్నారు. ఇలా చైన్ మెన్ల అవినీతి దాహానికి సికింద్రాబాద్ సర్కిల్ పరిధిలోనే కాకుండా గ్రేటర్ హైదరాబాద్ పరిధిలో అక్రమ అపార్ట్మెంట్లు పుట్టగొడుగుల్లా వెలిసాయి అనడంలో అతిశయోక్తి లేదేమో దానికి స్థానిక కార్పొరేటర్లు తోడు కావడంతో ఇంకేముంది ఇటు అధికారులు అటు ప్రజాప్రతినిధులు అందరు ఏకమై ప్రభుత్వ ఆదాయానికి భారీగా గండికోడుతూ కోట్లు గడించారు. గెలిచినప్పుడు చిల్లిగవ్వ కూడా లేని కార్పొరేటర్లు ఈరోజు కోట్లకు పడగలెత్తారు అంటే ఎంత అవినీతి అక్రమాలు చేశారో అక్రమ నిర్మాణాలకు సహకరించారో ప్రజలే అర్థం చేసుకోవాలి. ఇలా సికింద్రాబాద్ నియోజకవర్గంలో అనేక అక్రమ నిర్మాణాలు జరుగుతున్నాయని జోనల్ కమిషనర్ కు డిప్యూటీ కమిషనర్ కు లిఖితపూర్వకంగా ప్రజలు ఫిర్యాదులు చేసిన స్పందించకపోవడంతో ఈ అవినీతి అక్రమాలు జోరుగా సాగుతున్నాయని స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైన సికింద్రాబాద్ సర్కిల్ డిప్యూటీ కమిషనర్ ఆంజనేయులు, జోనల్ కమిషనర్ రవికిరణ్ స్పందించి ఈ అక్రమ నిర్మాణాన్ని వెంటనే కూల్చివేయాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు.

# అక్రమ నిర్మాణాలు చేస్తే సీజ్ చేస్తాం: జెడ్ సి రవికిరణ్

- అక్రమ నిర్మాణాలను ఉపేక్షించేది లేదు: ఏసిపి పావని
- జిహెచ్ఎంసి నిబంధన ప్రకారమే నిర్మాణాలు చేసుకోండి
- సికింద్రాబాద్ సర్కిల్ పరిధిలో అక్రమ నిర్మాణం సీజ్










**సీతాఫలమండి (ప్రశ్న న్యూస్)** అక్రమ నిర్మాణాలపై సికింద్రాబాద్ జోనల్ కమిషనర్ రవి కిరణ్ కఠినంగా వ్యవహరిస్తున్నారు. 16వ తేదీ మంగళవారం నాడు ప్రజా ప్రశ్న దినపత్రికలో సికింద్రాబాద్ సర్కిల్లో విచ్చలవిడిగా అక్రమ నిర్మాణాలు అనే కథనంపై ఆయన స్పందించారు. సీతాఫలమండి నాగూరి పార్క్ పక్కన జరుగుతున్న 5 అంతస్తుల అక్రమ నిర్మాణాన్ని వెంటనే సీజ్ చేయాలని ఆదేశాలు జారీ చేయడంతో సికింద్రాబాద్ సర్కిల్ పరిధిలోని జీహెచ్ఎంసీ ప్రత్యేక టాస్క్ ఫోర్స్ బృందం చిల్కలగూడ పార్క్ సమీపంలో ఉన్న ప్రాంగణ నెం. 11-4-322/20/6 వద్ద స్టిల్ట్2 అనుమతులు తీసుకొని అక్రమంగా 5 అంతస్తులు నిర్మాణం చేశారని దానితో అక్రమంగా నిర్మించబడిన 3వ, 4వ, 5వ అంతస్తులను ఏసీపీ పావని సమక్షంలో, టౌన్ ప్లానింగ్ సిబ్బంది సీజ్ చేశారు.

ఈ సందర్భంగా ఎసిపి పావని మాట్లాడుతూ జిహెచ్ఎంసి నిబంధనలకు విరుద్ధంగా ఎవరిని నిర్మాణాలు చేసిన సీజ్ చేస్తామని చట్టపైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కొంతమంది ప్రజాప్రతినిధుల పేరు చెప్పి అక్రమ నిర్మాణాలను ప్రోత్సహిస్తున్నారని అలాంటి రాజకీయ వత్తుళ్ళకు లెక్కచేయమని ప్రభుత్వ నిబంధనలు ముఖ్యమన్నారు. గతంలో జరిగిన అక్రమ నిర్మాణాలపై పత్రికలో కథనాలు వచ్చిన ప్రజలు స్వచ్ఛందంగా ఫిర్యాదులు చేసిన వెంటనే వాటిని పరిశీలించి వాటిపై కూడా చర్యలు తీసుకుంటామని ఎసిపి పావని పేర్కొన్నారు.

Printed, Published & Owned by "Gouti Bala Sai Tilak" and Published at H.No : 8-2-293/82/10/80, Womens Co-operative Housing Society, Road No - 7, Jubilee Hills, Hyderabad - 500033, Telangana State. Printed at "Gowrish Offset Printers". H.No : 3-4-353, Barkatpura, Hyderabad-500027. Telangana State. Editor : "Vempati Vijay Kumar". "RNI No: TELTEL/2021/80267". Email : prajaprashna@gmail.com. Cell No : 9494055588